# స్ఫురణ... స్మరణ

(ప్రసంగాలు, సమీక్షలు)

అవధానుల మణిబాబు

# స్ఫురణ... స్మరణ

(ప్రసంగాలు, సమీక్షలు)

అవధానుల మణిబాబు

# SPHURANA... SMARANA

(Speeches & Reviews)

**Avadhanula Mani Babu,**
**M.Sc., B.Ed.,**

First Edition : **December, 2017**

Rights : **Writer**

D.T.P. : **M.V.G. Srinivas,** Amalapuram

Printing : **Kalimi Sri,** Vijayawada

Price : Rs. 100/-

For Copies:

**A. Mani Babu,**
# 3-62, Near Bank of Maharastra,
Sarpavaram, Kakinada Rural, E.G.Dist.,
Andhra Pradesh - 533 005, Mobile : 99481 79437

సర్వశ్రీ

ఇంద్రగంటి శ్రీకాంత శర్మ, శ్రీమతి జానకీ బాల

***

ఆచార్య డా॥ ఎన్.గోపి ◆ ఆచార్య డా॥ శిఖామణి

దాట్ల దేవదానం రాజు ◆ మాకినీడి సూర్యభాస్కర్

భగ్వాన్ ◆ డా॥ కత్తిమండ ప్రతాప్ ◆ బొల్లోజు బాబా

ఎస్.వి. రామశాస్త్రి ◆ శశికాంత్ శాతకర్ణి

డా॥ ఉప్పలధడియం వేంకటేశ్వర

***

కాశీభొట్ల సత్యనారాయణ ◆ డా॥ రెంటాల శ్రీవేంకటేశ్వరరావు

జి. సుబ్బారావు ◆ గొట్టుముక్కుల వేంకట సత్య నరసింహశాస్త్రి

కాకరపర్తి దుర్గా ప్రసాద్ ◆ మధునాపంతుల సత్యనారాయణ మూర్తి

డా॥ జోశ్యుల కృష్ణబాబు ◆ డా॥ ఎల్.కె. సుధాకర్

అద్దేపల్లి ప్రభు ◆ కె.ఎన్. మురళీ శంకర్ ◆ కొరుప్రోలు గౌరినాయుడు

గ.నా.రా. ◆ శ్రీహస్త ◆ తంత్రవహి శ్రీరామమూర్తి

◆ విజయ శేషేంద్ర శాతకర్ణి ◆ డా॥ గజరావు సీతారామస్వామి

... వీరందరికీ

***

సాహితీ ప్రస్థానం, జాబిలి, రమ్యభారతి, చినుకు, నవ మల్లెతీగ, విశాలాక్షి,... పత్రికలకు;

సాహితీ స్రవంతి, కాకినాడ; ఆంధ్రీకుటీరం, పల్లెపాలెం; కళాసాహితి, కొత్తపేట; కవిసంధ్య, యానాం... వేదికలకు

సోమనాథ కళాపీఠం, పాలకుర్తి (తెలంగాణా); సాంస్కృతీ సమాఖ్య, విజయవాడ... సంస్థలకు

మరెందరికో...

శిరసా నమామి.

**ఇంద్రగంటి శ్రీకాంత శర్మ**
104, సాహితీ రెసిడెన్సీ, సైనిక్‌పురి,
సికింద్రాబాదు - 500 094.

# యువగళం

సర్వసాధారణంగా యువకులై, సాహిత్యాభిలాష ఉన్నవాళ్లు ఒళ్లు ఎక్కువగా నలగని కవిత్వవ్యాసంగం వైపు మనస్సుపెడుతూంటారు. కాస్తంత శ్రమించగలవాళ్లు కథా రచనవైపు కూడా చూపు తిప్పుతూంటారు. జీవనానుభవం, పఠనానుభవం, శారీరక, మానసిక శ్రమలు ఎక్కువగాకోరే వ్యాసరచనవైపు, నవలారచనవైపు నడవడం కష్టం కనుక, అటువైపు - శ్రద్ధగా - దృష్టిపెట్టే వాళ్లు తక్కువగా ఉంటూంటారు.

శ్రీ అవధానుల మణిబాబు ఇందుకు భిన్నం. అధ్యయనంపట్ల ఆసక్తి ఉండడం, మిత్రులు అద్దేపల్లి రామమోహనరావుగారి వంటి గురుస్థానీయులు దొరకడం, ఉద్దీపన కారణాలైనా - పలు రచనలు చదివి స్వతంత్రబుద్ధితో ఆలోచించి అంచనాలు వేయగల నైపుణ్యం ఉండడం వల్ల, సాహిత్య విమర్శవైపు దృష్టి పెట్టారని - ఈ వ్యాసాలు చదవడం ద్వారా నాకు అర్థమైంది.

ఇటువంటి సాహిత్య వ్యాసంగంలో మిత్రులు, పరిచితులు అయిన రచయితల రచనలు పరామర్శించడంలో, సమీక్షకుడికి ఒక ఇబ్బంది ఎదురవుతూ ఉంటుంది. పొగడ్త అయితే ఇబ్బంది లేదు; గట్టిగా లోతులు తరచి విశ్లేషించినా, విమర్శించినా, సూచనలు చేసినా - వారు కష్టపెట్టుకోగలరు. లేదా; సమీక్షకుడి సాహిత్యాధ్యయన జ్ఞానాన్ని శంకిస్తారు.

సాహిత్య వ్యాసరచనకు ఎన్నో కోణాలున్నాయి. ఒకవ్యక్తి ఒక రచన మొదలు, పలురచనలు చదివి, అతడిని లేదా ఆమెని, విలువకట్టవచ్చు. ఒక సాహిత్యధోరణిని పరామర్శించవచ్చు. ఒక ఉద్యమాన్ని విలువకట్టవచ్చు. అనుభవాలు - జ్ఞాపకాలు నెమరువేయవచ్చు. ఒక్కొక్క ప్రక్రియ సుళువు బలువుల్ని విశదం చెయ్యవచ్చు. ఉపజ్ఞ ఉండాలేగాని - ఎన్ని నడకలైనా నడవవచ్చు.

కానైతే – గాఢ అధ్యయనం, నిష్కర్ష అనేవి ఇక్కడ అత్యంత ఆవశ్యకాలు. ఇతరుల అంచనాలు, అభిప్రాయాలు ఉటంకించడంకాదు; మనం ఏమి నిగ్గుతేలుస్తామనేది ముఖ్యం. ఒక సాహిత్య వ్యాసకర్త వ్యక్తిత్వాన్ని తేల్చేది ఇదే.

ఈ సంపుటిలో ఎక్కువ భాగం పుస్తక సమీక్షలు మనల్ని పలకరిస్తాయి. అద్దేపల్లివారితో అనుబంధం, ఒక కార్తీక సమారాధన అనుభవం, కాకినాడ ఆంధ్ర సాహిత్య పరిషత్తు చరిత్ర సింహావలోకనం, అదనపు సమాచారాలు.

ఈ వ్యాసాలలో నాకు కనిపించిన మొదటి సుగుణం: వాక్యరచనలో ధారాళగుణం. ఈ మాట చిన్నదిగా కనిపించవచ్చుగాని – అటూ ఇటూ అయితే చదువరి చేజారిపోయే ప్రమాదం ఉంది. పెద్దతరంలో కట్టమంచి రామలింగారెడ్డిగారు, వ్యాఖ్యాత వేదం వేంకటరాయశాస్త్రిగారు, అభ్యుదయ (విప్లవ) విమర్శకులు కె.వి.రమణారెడ్డిగారు వంటి వారే యీ ప్రమాదానికి గురైనవారు. వ్రాసేక వాక్య విధానంలో ధారాళత లేకపోతే, వ్యాస రచన విషయం ఎంత గొప్పదైనా – రాణించదు.

ఇక – మణిబాబుగారి అంచనాలు గమనించడం నాకు ఇష్టం. వ్యక్తుల గురించి కావచ్చు; ధోరణులగురించి కావచ్చు. విమర్శకుడి అంచనాలు, ఆయా పుస్తకాలు చదివినప్పుడు – “ఔనుసుమా!” అనిపించాలి. లేదా నిజాయితీగా విభేదించ బుద్ధిపుట్టాలి. సూక్ష్మంగా చెప్పాలంటే: ఒక అంచనా మనసుని చదువరికి ఆకట్టాలి. లేదా కలవరపెట్టాలి. Passing గా వెళ్లిపోకూడదు.

**శ్రీ మణిబాబుగారి కొన్ని అంచనాలివి :**

1. డా. గోపి హృదయ రశ్మిలో పురివిప్పి ఆడిన భావ మయూరాల సమూహమే యీ గ్రంథం.

2. (భగ్వాన్) కవిత రాసుకుంటూ తనే ఒక కవితగా మారిపోతారు చాలాచోట్ల.

3. నవ్వు, ఏడుపు, ఈ రెండు మాత్రమే ప్రతిస్పందనకు ఉద్దీపనలుగా సరిపోవేమో! వాటి వెనుక స్థితిగతులే ప్రధానకారకాలేమో! (బొల్లోజు బాబా కవిత గురించి)

4. కవిత్వంపట్ల కవిలో రూపుదిద్దుకున్న నిర్వచనాన్ని, తన సాహిత్య ప్రస్థానం పట్ల దృక్పథాన్ని, సంపుటిలో ఒకటిరెండు కవితలలో ప్రతికవీ అంతర్లీనంగా వ్యక్తీకరించడం జరుగుతుంది. (దోసిలిలో నది)

5. క్రాంత దర్శనమేకాదు; కనబడుతున్న సన్నివేశం వెనక కనపడని సత్యాన్నీ అంచనా వేయగల విజ్ఞత వీరికవిత్వంలో కనిపిస్తుంది. (ఉప్పలధడియం వేంకటేశ్వర కవిత)

6. కొత్తగా చెప్పిన విషయం, చెప్పాలనే ఆడంబరం కనపడవీ గ్రంథంలో... (భక్తి – బాధ్యత వ్యాసం)

– ఇవి అలవోకగా నా కళ్లబడిన వాక్యాలు. నన్ను, విమర్శకుడిగా శ్రీ మణిబాబు ఆకర్షించిన వాక్యాలు.

అధ్యయనానుభవం నిండిన మరిన్ని గాఢమైన ఉద్దేశాలూ, అంచనాలు చెప్పగల వ్యాస రచనలు శ్రీ మణిబాబు చేయగలరని నా ఆశ, ఆశాస్యం.

శుభాకాంక్షలతో...

సికింద్రాబాదు, **ఇంద్రగంటి శ్రీకాంత శర్మ**
30-11-2017.

# ఈ క్రమంలో...


| | | పేజి నెం. |
|---|---|---|
| 1. | స్మృతులు... అనుభూతులు | 01-07 |
| 2. | హృదయ రశ్మిలో 'పురివిప్పిన ఊపిరి' | 08-13 |
| 3. | పూర్ణిమత్వ కవిత్వం 'చంద్రవర్షం' | 14-17 |
| 4. | కవి, విమర్శకుల కరదీపిక 'కావ్య సంజీవి' | 18-21 |
| 5. | 'వెలుతురు తెర' తీస్తే స్మృతి చిహ్నాలు, స్వప్న శకలాలు | 22-25 |
| 6. | జీవించే క్షణాల జాబితా | 26-30 |
| 7. | అంతస్స్రవంతికి అక్షర రూపం 'దోసిలిలో నది' | 31-34 |
| 8. | మధు రథ యానం | 35-42 |
| 9. | నల్ల కలువల సౌకుమార్యం, నక్షత్రాంతర్గత విస్ఫోటనం | 43-46 |
| 10. | ఆవేదనకు అక్షరానువాదం - డా. కత్తిమండ కవిత్వం | 47-51 |
| 11. | వ్యక్తావ్యక్త పారవశ్యం - 'జ్వాలాపాతం' | 52-55 |
| 12. | ఓ చదవాల్సిన 'పాఠం' | 56-59 |
| 13. | సశేష జ్ఞాపకాల సాక్షరరూపం 'పాఠం పూర్తయ్యాక' | 60-63 |
| 14. | ఆంధ్ర సాహిత్య పరిషత్ | 64-77 |
| 15. | ఆశాద్వీపంలో కార్తీ (క)వనభోజనం | 78-82 |
| 16. | భక్తి - బాధ్యత | 83-85 |


***

# 1 స్మృతులు ... అనుభూతులు

జాబిల్లిని చూస్తూ ప్రతివారూ చందమామ ఆరోజు తమ ఇంటిపైనే ఉన్నాడనుకొంటారు. 'సమ భావన' కలగజేయడం కొందరి సహజాతం. అద్దేపల్లీ అంతే. కాస్త పరిచయం ఉన్నవారెవరైనా మాస్టారి అత్యంత ఆప్తులలో తామూ ఒకరనుకొంటారు. అలా ఆనందించేవారిలో నేనొకడిని. పదకొండేళ్ళ పరిచయంలో కొన్ని వందల గంటల సంభాషణ అద్దేపల్లి "ఉన్నతి"ని తెలియజేసింది. కానీ, పదిహేనేళ్ళ సాహిత్యానుభవం దానిని అక్షరబద్ధం చేసేందుకు సరిపోనంది. అద్దేపల్లి సాహిత్యం శాశ్వతమైనది, సార్వజనీనమైనది. కానీ వారితో గల సాన్నిహిత్యం నాకింకా విలువైనది. ఆ సాన్నిహిత్యానికీ శాశ్వతత్వాన్ని కల్పించే ప్రయత్నమే ఈ వ్యాసం.

***

చంద్రంపాలెంలో దేవులపల్లి విగ్రహావిష్కరణ సందర్భంగా కవిసమ్మేళనాన్ని ఏర్పాటు చేసారు. ఉభయగోదావరి జిల్లాలలో సుప్రసిద్ధ కవులంతా కవితాపఠనంకోసం వేదికపై కూర్చొన్నారు. అప్పటికి ఎవ్వరితోనూ నాకు పరిచయం లేదు. ఒక చిన్న కాగితంపై "నాపేరు ఫలానా, అవకాశం ఇప్పించగలరు" అని వ్రాసి, భయపడుతూ పంపాను – చివర్లో అయినా పిలుస్తారనే ఆశతో. కానీ మాస్టారు అందరితో పాటు వేదికపైకి ఆహ్వానించారు. అపరిచితుల పట్ల కూడా అంత సానుకూలంగా స్పందించడం వారికే సాధ్యం.

***

2012లో తిరుపతిలో నిర్వహింపబడిన 'ప్రపంచ తెలుగు మహాసభల'ను పురస్కరించుకుని కాకినాడలో 'తెలుగు మాసోత్సవాల' పేరిట ముప్ఫైరోజులు సాహిత్యసభలు వైభవంగా జరిగాయి. ఉపన్యాస అంశాల ఎంపిక, వాటిపై సాధికారత గల వక్తల సూచన – ఇలా తన పరిపూర్ణ మార్గదర్శనంతో నిర్వహణ పరంగా రాష్ట్ర స్థాయిలో తూర్పుగోదావరి జిల్లా ప్రథమ స్థానంలో నిలవడానికి ఎంతగానో దోహదం చేసారు మాస్టారు. ఆ సందర్భంలో ఒకరోజు కొత్త తరం కవుల సందేహనివృత్తికి వారితో ముఖాముఖి ఏర్పాటుచేసాం. ఎప్పటిలా టాప్ తీసేసిన రిక్షాలో వస్తూ తనతో ఓ బరువైన సంచితో దిగారు. ఏవిటిది అని అడిగితే తర్వాత చెప్తా అన్నారు. ఆ రోజు కార్యక్రమం ఓ అద్భుతం. జిల్లా యంత్రాంగం సత్కారం పొంది, తన సంచిలోంచి ఎంతో శ్రద్ధగా ప్యాక్ చేసి "అభినందనలతో అద్దేపల్లి" అని సంతకం చేసిన పుస్తకాలను తీసి ప్రశ్నలడిగిన వారందరికీ బహుమతిగా ఇస్తూ **"సాధారణంగా మనం సమాధానం చెప్పిన వాడే గొప్పనుకుంటాం. కానీ ఎవరైనా మంచి ప్రశ్న అడిగినపుడే మనకు తెలిసిన విషయాలు బయటకు వస్తాయి. అందుకే వారిని అభినందించడం ముఖ్యం"** అన్నారు. ఇదీ! ఆరు దశాబ్దాల సాహిత్య జీవితం నెరపిన ఓ అగ్రశ్రేణి విమర్శకుడు వర్ధమాన కవుల సందేహాలకు అందజేసిన గౌరవం.

***

ఓసారి సేవారంగంలో కృషి చేస్తున్న శ్రీ వెంకట్రామశాస్త్రిని "ప్రతి నెల – సాహిత్య హేల" కార్యక్రమంలో అభినందనపూర్వకంగా సత్కరించాలని ఆహ్వానించాం. ఐతే, సభాప్రారంభం ఆలస్యమైంది. తప్పనిసరి పని ఉండి శాస్త్రిగారు వెళ్ళిపోయారు.

విషయం తెలుసుకొని మాస్టారు ఎంతో బాధపడ్డారు. అంతటితో ఊరుకోక 'సారీ' చెప్పడానికి చాలాసార్లు ఫోన్ చేసారు. అది స్విచ్ఆఫ్ చేయబడింది. మాట్లాడడానికి ఇష్టపడక స్విచ్ఆఫ్ చేసి ఉంటారని మేమంతా భావించాం. అద్దేపల్లి స్వయంగా ఇంటికివెళ్ళి మాట్లాడతానని బయలుదేరారు. ఇంతలో శాస్త్రిగారు ఫోన్ చేసి అత్యవసరంగా వెళ్ళవలసి వచ్చిందని తరువాత సభలో సత్కారం స్వీకరిస్తానని చెప్పారు. అప్పటి వరకూ మాస్టారు పొందిన వేదనకు నేను ప్రత్యక్షసాక్షి. ఇందులో ఆశ్చర్యకరమైన విషయం వారిద్దరి మధ్య వయసు తేడా ముప్పై సంవత్సరాలు. శాస్త్రిగారిని 'ఒరేయ్' అని పిలిచేంత చనువు మాస్టారికుంది. అయినా, అహానికి తావు లేకుండా ఇతరుల ఫీలింగ్స్ పట్ల చిన్న చూపులేని 'పెద్ద మనిషి' అద్దేపల్లి.

***

సభలులేని సాయంత్రాలలో మాస్టారు, నేను, మరికొందరు మిత్రులం కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్ వెనుక వైపు చప్టాపై కూర్చుని ఆరు నుండి ఎనిమిది గంటలదాకా, జరిగిన సభల విశేషాలో, జరుపబోయే వాటి ప్రణాళికలో చర్చిస్తూ గడిపేవాళ్ళం. మధ్య, మధ్యలో మాస్టారికి ఎన్నో ఫోన్లు. వాటిలో వారి శిష్యుల సందేహాలు, కవితా గానాలు, ఆహ్వానాలు, కుశల ప్రశ్నలు... ఎన్నో. ఎక్కడున్నారు? అని అడిగితే 'నేను ఫ్రెండ్స్ తో కూర్చొన్నా' అనేవారు మాకేసిచూస్తూ. అలా అన్న ప్రతిసారీ ఇంతటి సాహితీవేత్త మనలని శిష్యులనో, కుర్రాళ్ళనో కాక ఫ్రెండ్స్ అన్నారే! అని గర్వంతో పులకించి పోయేవాళ్ళం.

***

అధికశాతం సభలలో మేష్టారు అధ్యక్షస్థానంలో ఉండేవారు. తొలి పలుకులు, ప్రసంగాల తరువాత మరికొన్ని ముక్తాయింపులు, అభినందనలు, సూచనలు - అంతే. కానీ వారి అపరిమిత జ్ఞానాన్ని, అనేకానేక అంశాలపై వారి అన్వయాన్ని మేం పొందేదెలా? అందుకే ఈ రైల్వే స్టేషన్లో కలవడం. అక్కడ కాళిదాసు, కార్ల్ మార్క్స్, మాఘుడు, తిక్కన, పింగళ సూరన... ఇలా ఎందరో, ముఖ్యంగా విశ్వనాథ. వెన్నెలరాత్రి నాయనమ్మ పిల్లలందరికీ చేతులలో పెరుగన్నం తలో ముద్దా పెట్టినట్టు, తన అధ్యయన సారాన్ని నిస్వార్థంగా పంచేసేవారు.

***

'మాస్టారూ! ఆ సభలో నేను మాట్లాడుతున్నాను, మీరు విని సూచనలు చేయాలి' అంటే చాలు, సామాన్య శ్రోతలా వచ్చి అందరితో పాటు కూర్చొని విని, చివరిలో అభినందించి వెళ్ళిన సందర్భాలు ఎన్నో. వేదికపై అధ్యక్షులుగా, అతిథులుగా ఉన్నది తనకంటే చిన్నవారైనా సభలో శ్రోతగా కూర్చోవడం మాస్టారిని ఏమాత్రం ఇబ్బందిపెట్టని విషయం. అందుకే స్థాయిని చాటుకొనేందుకు ప్రయత్నం, స్థానాల కోసం తాపత్రయం ఆయన చివరివరకూ దరిచేరనివ్వని అంశాలు.

***

వారి రైలుప్రయాణ అనుభవాలను ఎంతో ఆసక్తికరంగా చెప్పేవారు. చాలాసార్లు టి.సిలు టికెట్ పై వీరి వయసు చూసి ఈయనది కాదనేవారుట. కొందరు "బాబూ మీకంటే పెద్ద వాణ్ణి నాకు లోయర్ బెర్త్ ఇప్పించండి" అనేవారుట. కొందరు పేపరో పుస్తకమో చదువుతూ కవిత్వాన్ని గురించి, సాహిత్యం గురించి వీరికి వివరించేవారుట. అవన్నీ వచ్చాక ఆనందంగా మాతో పంచుకొని బిగ్గరగా నవ్వేవారు, చిన్న పిల్లాడిలా.

***

పత్రికల్లో మంచి వ్యాసాలో, కవితలో వచ్చినపుడు తాను చదివి ఆనందించడం లేదా ఆ వ్యాసకర్తనో, కవినో అభినందించడం మాత్రమే కాదు. మనకూ ఫోన్ చేసి "చూసావా అది, వెంటనే చదువు, సాయంత్రం దానిపై మాట్లాడుకొందాం" అనేవారు. ఇక్కడ విశేషం ఏమిటంటే 'మాటలాడుకుందాం అనడం.' ఆ స్థానంలో మరెవరైనా అసలు అది ఎలా అర్థం చేసుకోవాలంటే ... అని మొదలుపెడతారు. ఒక కవిని, కవిత్వాన్ని, వ్యక్తిని, వ్యక్తిత్వాన్ని మనకు పరిచయం చేయాలన్నపుడు వినమ్రంగా తన అభిప్రాయంగానే ప్రతిపాదన చేసేవారు గానీ ఇది ఇంతే అని ప్రకటన చేయలేదు. ఎంతటి ఆత్మీయులపైనైనా తన అభిప్రాయాలను రుద్దే ప్రయత్నమూ చేయలేదు. 'ఎవరి అభిప్రాయాలు వారివి' – ఈ ఒక్క భావన ఇన్ని వేల మందికి మాస్టారిని ఆప్తుడిని చేసింది.

***

వారి నుండి ఫోన్ రాగానే, పెద్దాయన చేసారు అని ఆనందంగా లిఫ్ట్ చేస్తే, "పనిలో ఉన్నావా? ఎక్కువ సమయం తీసుకోను. ముఖ్యమైన విషయం ఉండి చేశాను" అని తొందరగా ముగించేవారు. మన వ్యాసక్తులు ప్రధానవృత్తికి అంతరాయం కలిగించకూడదని వారి సిద్ధాంతం.

***

ఒక సంస్థవారు మాస్టారినీ, నన్నూ తిలక్ కవిత్వంపై మాట్లాడమని అడిగారు. ఒకరు మాట్లాడుతున్నట్టు మరొకరికి తెలియదు. రేపు సభ అనగా మా మాటల్లో ఇద్దరి ప్రసంగ అంశం ఒకటేనని తెలిసింది. ఆ సభలో మాస్టారు 'అమృతం కురిసిన రాత్రి'లో ఒక్క వాక్యాన్ని కూడా కోట్ చెయ్యకుండా తిలక్ కవితాసృష్టి నెరపేనాటికి ఉన్న సాహిత్య వాతావరణం, అనంతర సాహిత్యంపై తిలక్ ప్రభావం... ఈ నేపథ్యంలోనే ప్రసంగించారు. ఇదంతా కేవలం నాకు 'అమృతం కురిసిన రాత్రి'ని విడిచి పెట్టడానికి. నేను ఆరోజు ధన్యవాదాలు తెలుపుతూ " దీపావళి నాడు మతాబులు, కాకర పువ్వొత్తులు పిల్లలకు విడిచి పెట్టేది అవి మనం కాల్చలేక కాదు, వాళ్ళు అవి తప్ప కాల్చలేరని. అలాగే వారు మాత్రమే చెప్పగల విషయాలను చెప్పి నాకు వీటిని విడిచిపెట్టారు' అన్నాను. ఈ సందర్భం ఒక్కటి చాలు మాస్టారి మాతృహృదయం తెలియజేయడానికి.

***

వారి ఎస్.ఎం.ఎస్.లు చాలా చమత్కారంగా ఉండేవి. సభ జరిగేటప్పుడు వేదికపై నుండి ప్రేక్షకులలో కూర్చొన్న వారికి సరదాగా సందేశాలు పంపేవారు. అలాగే, ఈ వేళ రాగలవా? అని అడగడానికి 'గలవా?' అని మెసేజ్ చేసేవారు. నేను 'గలను' అనో 'లేను' అనో పంపేవాడిని. అంత చనువుగా వ్యవహరించేంత చనువిచ్చేవారు మాస్టారు.

నిర్వహించబోయే కార్యక్రమాలపట్ల ముందుగానే ఒక ప్రణాళిక ఉన్నా, సభ్యులందరినీ సమావేశపరిచి, చర్చించి, మినిట్స్ వ్రాయించి ఆమోదింపజేసేవారు. నిజానికి వారు ఏదన్నా, కాదనే పెద్దరికం ఎవరికీ లేదు. కానీ అవతలివారికి, వారి ఆలోచనలకు విలువనివ్వడం మాస్టారి ఔన్నత్యం.

***

వయసుని గుర్తుచేసుకుని భయపడడం, హోదాని ఉపయోగించుకొని పనులు జరిపించుకోవడం ఎప్పుడూ లేదు. ఈ కవర్ కొరియర్ చెయ్యమనో, ఇది డిటిపి చేయించమనో, నువ్వు వచ్చేప్పుడు ఆ పత్రిక తీసుకురా అనో ఎపుడూ మాస్టారు అడగడం తెలియదు. ఎంత దూరమైనా నడుస్తూ, కొన్ని సార్లు తన లూనాపైనో, విలాసంగా రిక్షాలోనో తిరిగి తన పనులను తానే చేసుకోవడం. అందుకే మేస్టారు తనకు వృద్ధాప్యం వచ్చిందన్న విషయాన్ని పెన్షన్‌పేపర్స్ కి తప్ప మరెవ్వరికీ తెలియనివ్వలేదు.

***

మాటల మధ్యలో సందర్భం వచ్చినపుడు వారి కవితా పంక్తులను ఉటంకిస్తే ఎంతో ఆనందించేవారు. ఏమాత్రం గర్వం లేకుండా 'భలే గుర్తు పెట్టుకున్నావ్, వెరీగుడ్' అనేవారు మనసారా నవ్వుతూ. నచ్చిన ప్రతిసారీ అంతగా మనసుని మాటలలోకి అనువదించి ఆనందాన్ని వ్యక్త పరచడం మేస్టారికే చెల్లింది.

***

తన ఆనందాన్ని, కవిత్వాన్నీ తప్ప తన ఆవేదనను తెలియకుండా ఉంచడానికి చివరి దశలో ఎంతగానో ప్రయత్నించారేమో అన్పిస్తుంది. పలకరించడానికి వస్తామన్నా, తగ్గిపోతుంది మళ్ళీ వారం సభలో కలుద్దాం అనేవారు. చెప్పకుండా వెళ్తే, లేని ఓపిక తెచ్చుకుని ఐదు నిమిషాలు మాట్లాడి, మళ్ళీ కలుద్దాం అని; నీరసం తెలియకుండా ఉండేందుకు పైకిలేచి షేక్ హ్యాండ్ ఇచ్చి సాగనంపేవారు. మనకు సాహిత్యాన్ని మిగిల్చి, తాను దేహాన్ని విడిచివెళ్ళే మూడు రోజులముందు ఐ.సి.యులో ఉండగా పలకరిస్తే ఎప్పటిలానే 'ఓహ్.. వెరీ గుడ్. మళ్ళీ మాట్లాడుకుందాం' అన్నారు. నాటి నుండీ మాస్టారి పుస్తకాలు నాతో మాట్లాడుతూనే ఉన్నాయ్.

***

ఓసారి సభ పూర్తయ్యాక, ఒకాయన మేస్టారిని ప్రక్కకు పిలిచి ఓ వంద రూపాయలుంటే ఇవ్వండి అని అడిగార్ట. మన మధ్య పరిచయం లేదు, పైగా ఇక్కడ ఇందరున్నారు, నన్నే ఎందుకు అడుగుతున్నారు? అంటే మిమ్మల్ని చూస్తే వెంటనే

ఇచ్చేలా అనిపించారండి అన్నాట్ట. ఇంత మందిలో నిన్ను మించిన వెర్రాడు లేడు అని ఎంత గౌరవంగా చెప్పాడయ్యా, 'ధ్వని' అంటే అది – ఈ సందర్భాన్ని ఆయాసపడేంతగా నవ్వుతూ ఎన్నిసార్లు తలుచుకొనేవారో.

***

ఆ మధ్య పిఠాపురంలో జరిగిన సభలో ఓ వక్త "సామాజిక స్థితిగతులను, సమకాలీన సమస్యలను నిరంతరం అధ్యయనం చేసి అనుగుణమైన పరిష్కారాన్ని అక్షరాలుగా అందజేసినవారు అద్దేపల్లి. అందుకే వారో సామాజిక శాస్త్రవేత్త" అన్నారు. కాకినాడలో 'వ్యక్తిత్వ వికాస సమాజం'వారు అద్దేపల్లి కవిత్వంలో ప్రేరణదాయక వాక్యాలను కోట్‌చేస్తూ వారిని 'మనో వైజ్ఞానిక వేత్త' అన్నారు. ఓ ప్రజాకవికి ఇంతకు మించి బిరుదులు, అవార్డులు ఏముంటాయ్?

***

వైద్యం పొందుతుండగా ఓ రోజు కలిసినపుడు గత రాత్రి వచ్చిన కల గురించి సుదీర్ఘంగా వివరించారు. చెబుతున్నంతసేపూ మేస్టారి ముఖంలో ఆనందం. కళ్ళలో వింత మెరుపు. ఆ తర్వాత కలలగురించి, వాటి నిడివి, నిద్రలేచాక జ్ఞాపకం, ఆ స్థితిలో మానసిక విన్యాసం – వీటి గురించి కాసేపు చర్చించుకున్నాం. అపుడు మాస్టారో మాటన్నారు **"అనుభూతి గాఢత అపరిమితమయ్యే కొద్దీ కాలప్రమాణం సుదీర్ఘంగా అనిపిస్తుంది".** బహుశా ఇది అదేపల్లి పలికిన చిట్టచివరి కవితాత్మక వాక్యం. నిజమే, ప్రారంభంలో చెప్పినట్లు వారితో గడిపిన కాల ప్రమాణం స్వల్పమే అయినా పై వాక్యమే ఈ వ్యాస నిర్మాణానికి ప్రేరణ కావచ్చు.

***

మన కాలపు మహాకవి ఓ దశాబ్దకాలపు పరిచయభాగ్యాన్ని వరంగా అందజేసినందుకు బదులుగా ఏం చేయగలిగాను? ఇలా జ్ఞాపకాల స్ఫురణ, స్మరణ, పునశ్చరణ తప్ప. అయినా మేస్టారు ఏమీ అనుకోరు, అనలేరు. ఎందుకంటే, అక్షరాన్ని ప్రేమించడం తప్ప భూమిపై ఏం నేర్చుకున్నారు గనుక?

**(ఏప్రిల్ - 2016 'జాబిలి' మాసపత్రికలో ప్రచురితం)**

# 2 హృదయ రశ్మిలో 'పురి విప్పిన ఊపిరి'

అక్షరాలదారుల్లో అలుపెరుగక తన్మయత్వంతో తిరుగాడే ఓ కవి గ్రంథపరంపరలో ఇరవయ్యవ కవితాసంపుటిని చదవడమంటే – వారి అర్ధశతాబ్దపు సృజనానుభవ సారం అలవోకగా జరిపిన కావ్యోత్పత్తితో మమేకమై, మన జీవితం ఏ పదాల మాటున ఉందో సరిచూసుకోవడం; వీలైతే, కవి సూచించిన పథాలవెంట దానిని కాస్త సరిచేసుకోవడం.

ప్రత్యక్షంగానో, పరోక్షంగానో (వీరి సాహిత్యానికి జరిగిన ఇతర భాషానువాదాలతో కలిపి) తొంభై గ్రంథాలున్న ఆచార్య డా. ఎన్. గోపి నేటికీ ఇంత అవిరళ కృషి జరపాల్సిన అవసరమేమిటి? సమాధానం సుస్పష్టం. సాహిత్యాన్ని వ్యాసక్తి గానో, అనురక్తిగానో కాక, జీవన అభివ్యక్తిగా విశ్వసించారు గనుక. అందుకే, కవిత్వం నాకు **"రక్త ప్రసరణమంత స్వాభావికమైంది. ఊపిరి పీల్చడమంత ధారాళమైంది"** అని సగర్వంగా స్పష్టంచేస్తారు. కవిత్వ అసామాన్యత్వాన్ని వివరిస్తూ **"అది సంవేదనకు పర్యాయమౌతుంది, భయపడ్డవాడికి చింతాకంత నాలుకనైనా ఇస్తుంది. దీనుని మూల్గుకి అక్షరాల మైకునమర్చి వినిపిస్తుంది. కన్నీళ్ళతో గడ్డకట్టిన భూగోళాన్ని ఇంచుకంతైనా కరిగిస్తుంది"** అని పారమార్థిక ప్రయోజనంగా ప్రకటించిన వీరి "పురివిప్పిన ఊపిరి"లో అనులోమ విలోమాలను మనోనేత్రంతో దర్శిద్దాం.

***

కారణభూతమైన వస్తువుకన్నా అది అందించే ఫలితం ఎక్కువ ఆనంద హేతువవుతుంది. ఒకే సంఘటన ప్రభావం అనుభవించే వారి మానసిక స్థితిపై ఆధారపడి, బహుముఖీన అనుభూతులకు మూలమవుతుంది. ఎవరి ప్రాధాన్యతలు వారివి. అయితే, భావుకుడైన కవి మాత్రం **"ప్రేమను అనుభవించి, ఆనందించిన క్షణాలు ప్రేమకన్నా గొప్పవి. వానాకాలపు వరండాలో కూర్చొని పారే కాలవల్ని చూస్తుంటాను. వర్షం కన్నా వర్షానుభవం గొప్పదని తెలుసుకుంటాను"** అనగల్గుతాడు.

డా. గోపి దృష్టిలో కవిత్వాగమనం ఓ నిరీక్షణ ఫలితం. **"కవిత్వం కోసం తలుపు దగ్గర నిలబడి ఎదురు చూసే అమ్మలాంటి వాడు కవి"** అంటూ ఒక పదం యొక్క రాకకోసం కవాటాలను తెరిచి ఎదురుచూసే మాతృ హృదయంగా కవి తపస్సును సంభావిస్తారు. **"కవి గూట్లో దీపం లాంటివాడు. వాకిట్లో ఆడుకునే పిల్లల కోసం చీకటిని వెళ్ళగొడతాడు"** అంటూ ఇతరుల ఆనందం కోసం తాను ఉపకరణం కావలసిన బాధ్యతనూ గుర్తు చేస్తారు.

ఇక కవిత్వంలో పదసంఘటన గూర్చి **"ప్రతి పదం ఒక దీపం, పిట్టగోడ మీద దీపాల వరుస కవిత్వ చరణంలా కదులుతుంటుంది. దేని వెలుగు దానిదేగానీ పక్క దాని వెలుగులో కలిసిపోతుంది"** అని సాహిత్య విద్యార్థులకు ఒక శాశ్వతసూత్రాన్ని అందజేస్తారు. కవికి విశ్వసృష్టి చేసే పరమాత్మకున్నంత ఘనతను ఆపాదిస్తారు. ఆకాశంలో నక్షత్రాలు వాటి నిర్దేశిత స్థానాల్లో ఉన్నట్లు **"ఏ స్థానంలో ఏ పదముండాలో కవి వేళ్ళకు తెలుసు"** అంటారు. ప్రతి శబ్దాన్నీ, తదేక ధ్యానంతో మృదుత్వాన్ని అద్ది కావలసిన రీతిలో వినియోగించే కవిని **"ఏకీ ఏకీ దూదిని మెత్తబరిచే శ్రామికుడి"**తో పోలుస్తారు. పెన్సిల్ చెక్కినపుడు రాలే పొట్టును పాప పూయించే పువ్వులుగా, ఆమె కురిపించే అక్షరాలను కాగితమ్మీద ఎగరేసే సీతాకోక చిలుకలుగా దర్శించగలగడం; ఉత్తరాలను నిత్య నూతన ప్రాచీన కావ్యాల్లా, పెట్టెల అడుగున మెరిసే ముత్యాల దండల్లా ప్రేమతో గౌరవించడం – పై ప్రతిపాదనలకు సాక్ష్యాలు, వీరి ఊహాశాలితకు నిదర్శనాలు.

***

భౌతిక శాస్త్రపరంగా శక్తి ప్రసరణ జరిగినపుడు లేదా పదార్థం రూపభేదాన్ని పొందినపుడు మాధ్యమాన్ని – శక్తి పంపిణీకి ఉపకరించే అంశంగా భావిస్తాం. అయితే, తొలి, మలి రూపాల భేదాన్ని మాత్రమే చూస్తే, అది పరిశీలన. ఈ మార్పు వెనుకగల మాధ్యమాన్ని అన్వేషిస్తే పరిశోధన. కవిత్వమైనా అంతే. దృగ్గోచరమయ్యే విషయాన్ని కాక మనం ప్రాముఖ్యతనివ్వని అంశాన్ని ప్రధాన వస్తువు చేస్తే అది కవి స్థాయిని చాటే ప్రయోగమవుతుంది. అందుకే, రాష్ట్ర విభజన ప్రకటన జరిగిన మరునాడు 'చీలిన ఉదయం' కవితలో వార్త పట్టుకొస్తున్న పేపర్‌బాయ్ ని ఉద్దేశించి **"వాడికి తెలియదు – ఇవాళ వాడు రెండు రాష్ట్రాలను మోసుకొస్తున్నాడు"** అనడం వెనుక ఎంతటి "లోచనం" దాగుందో కదా! ఈ సందర్భంగా రాసిన మరో కవితలో **"మ్యాపుల మధ్యే గీతలు, దాన్ని మానవగీతగా మలచుకోవాలి"** అని ప్రబోధించిన కవి 'ఏం ఫరవాలేదు' అని భరోసానిస్తూ ఇరు రాష్ట్రాల మధ్య పూలకంచెను నిర్మించడానికి తోటివారిని ఆహ్వానిస్తారు. కేవలం సందేశంగానో, సూచనగానో కాకుండా సమిష్టితత్వాన్ని కథనాత్మక కవితగా 'గతంలో నీడ' అనే కవితలో ప్రకటిస్తారు. **"చిన్నప్పుడు పక్కింటికీ మాకూ మధ్య ఓ దడి; పక్షులు మా వాకిట్లోంచి లేచి వాళ్ళ ఆవరణలో వాలేవి. వాళ్ళ పూల మీద సీతాకోక నా భుజమ్మీదకెగిరొచ్చేది; పరిమళాల నెవరాపుతారు. కట్టెల సందుల్లోంచి కళ్ళు కళ్ళు మాట్లాడుకునేవి; అడవిలో చెట్లే కాదు. వేళ్ళు కూడా కలిసే ఉంటాయి. అందుకే వాటిది సమిష్టి గాలి"** అంటూ మనుషుల మధ్య ఉన్న భాషా పరిమళ వ్యాపనాన్ని ఆపలేమని, 'వేళ్ళ' ప్రస్తావన ద్వారా ఉపరితలంపైన విడివిడిగా ఉన్నా అంతరాంతరాల్లో కలిసే ఉన్నామంటూ సహృదయ వైశాల్యాన్ని, సౌమనస్యాన్ని చాటుతారు.

***

**"పది నిమిషాల్లో పోతామని తెలిసినా తొమ్మిది నిమిషాల యాభై తొమ్మిది సెకండ్ల యుద్ధమే జీవితం"** – ఇది జీవితం పట్ల వీరి దృక్పథం. మన ముందు నడిచినవారో, ముందుకు నడిపించినవారో, వెనుక నడువవలసిన వారో అకస్మాత్తుగా దూరమైతే ఎంత పరిణత మనస్కులమైనా 'సంయోగాచ్చ వియోగాచ్చ కా తత్ర పరివేదనా' అని సరిపుచ్చుకోలేం. సమూహంలో ఉన్నపుడు సైతం వారికి మాత్రమే

ప్రత్యేకమైన చేతలో, మాటలో గుర్తొచ్చి కొన్ని క్షణాలు ఒంటరిని చేస్తాయ్. మరేదో రాద్దామనుకున్న కలాన్ని ఆ ఆత్మీయుల జ్ఞాపకాలు ప్రేమగా ఆవహించి కాగితాన్ని తడిచేస్తాయి. ఎలిజీలలో బాధావహ మానసం నుండి అసంకల్పితంగా పెల్లుబికిన వాక్యాలేగానీ ప్రయత్నపూర్వక పదసంఘటనకు అవకాశం అంతగా చిక్కదు. అందుకే ఇవన్నీ కవి తాలూకు స్నేహశీలతను, అచ్చమైన అనుబంధాన్ని అక్షరబద్ధంచేస్తాయి. భౌతికంగా దూరమైన ఆత్మీయులను స్మరిస్తూ, తాత్వికతను మేళవించి, భర్తీ కాని లోటును **"మనల్ని సగం సగం చంపి వాళ్ళు పూర్తిగా చచ్చిపోతారు"** అని బాధగా నివేదిస్తారు. **"పోయినోళ్ళదేంపోయింది. ఉన్నోళ్ళకే రంధి. ఇక్కడే ఎక్కడో ఉన్నట్టు భ్రమలు కల్పిస్తారు"** అంటారు. అయితే ఆ భ్రమలో, అనుభూతుల సంస్మరణలో వారితో జరిగిన చివరి సంభాషణ జ్ఞప్తికి తెచ్చుకుంటారు. ఆ సమయంలో అది అప్రధానమే కావచ్చు. కానీ నేడు అది ఓ కావ్య నిర్మాణానికి సరిపడేంత ప్రేరణ. కొందరి మరణం మన చుట్టూ ఓ అంధకారాన్ని సృష్టిస్తుంది. దానిని విచ్ఛిన్నంచేసి బయటకు రాలేని నైరాశ్యం కలిగిస్తుంది. ఆ దశలో మరలా మనలను చైతన్యవంతం చేసేవి వారి మాటలే. అందుకే, మాట్లాడిన చివరి మాటల్తో స్మృతి కావ్యాలు అల్లిస్తారు అంటారు, కవి. **"మట్టిని బుక్కి, బంగారాన్ని పుక్కిలించావు"** అని నటి తెలంగాణ శకుంతలను, 'తెలుగు వాక్యం మూగబోయింది' శీర్షికతో చే.రా గారిని... మరెందరి జ్ఞాపకాలనో స్మృతి గీతాలుగా మలిచారు.

***

"To condense the diffused light of a page of thought into the luminous flash of a single sentence,...." మార్క్ ట్వైన్ మాటలు ఎన్ని మార్లు గుర్తొస్తాయో ఈ సంపుటి చదివినంత సేపూ. కవి మనస్థితితో పాఠకుడు అనునాదంలో ఉన్నపుడు అనవసరపు క్లిష్టతతో వాతావరణాన్ని భంగపరచకుండా అత్యుత్తమ అనుభూతిని సారళ్యంతో అందజేయడం వీరి శైలి. అందుకే, నిర్మాణం జరిగిన కాలంలో ఆ ప్రదేశంతో ఓ అనిశ్చిత అనుబంధాన్ని పొందిన బాలకార్మికుడు అది ఇల్లుగా మారిన తరువాత దానికి ఏమీ కా(లే)ని స్థితిని కవితగా మలుస్తూ **"ఆ ఇంటికి భావావేశ వారసుడు వాడే"** అని ప్రకటిస్తారు.

మూలాన్ని అన్వేషించే క్రమంలో మనం ఏదో ఒక బిందువు వద్ద అదే 'ఆది' అని నిర్ధారించుకుని సరి పుచ్చుకుంటాం. అయితే కవి మేధ మరింత లోతైనది. అందుకే దారానికి మూలం – వడికే రాట్నమనో, అంతకు ముందు దూది అనో ఆగిపోకుండా విత్తును గుర్తు చేసుకొని అటునుండి **"మట్టిలోకి వెళ్తేతప్ప దీని మూలం బోధపడదు"** అంటారు. మూలాలను మరువక పోవడమే నిజమైన ఔన్నత్యం. అందుకే, వడ్లగిర్నీలో పనిచేసిన నాయనమ్మను; పేదరికంలో తన కడుపు నింపిన పొప్పడి చెట్టును; శరీరాల నుండి విముక్తాలైనా నీడలుగా ఫోటోనుండి ఆశీర్వదిస్తున్న అమ్మా, నాన్నల జ్ఞాపకాలను – కవితలుగా స్మరిస్తారు.

***

ఇవ్వవలసిన విషయానికి ఇవ్వవలసినంత ప్రాధాన్యత నివ్వకపోవడం లోకంతీరు. అత్యంత ప్రేమతో పరమాత్మ ఇచ్చిన ఇంద్రియాలన్నిటినీ మనం వైయక్తిక అవసరాలకే వినియోగించుకుని వాటికి సార్ధక్యాన్ని అందించలేకున్నాం. ఈ విషయమై "అవజ్ఞ" కవితలో **"మనం దేనినీ గమనించం. ఇష్టమైనవి చూడడానికే మన రెప్పలు లేస్తాయి. శరీరానికి సేవ చెయ్యడానికే మన అవయవాలు పనిచేస్తాయి. తలెత్తి ఆకాశాన్ని వీక్షించి తలవంచి నేలను పలుకరించం. ఓ గరికపోచ, ఓ చిన్న పిట్ట ఇంత పెద్ద ప్రపంచాన్ని ఎంత కరుణతో దీవిస్తాయో గమనించం. ఆఖరుకు మనలో మనల్ని కూడా"** అంటూ బాహ్య అంతర్వీక్షణాలు రెండిటా మనం విఫలమవుతున్నామని హెచ్చరిస్తారు.

అతిథి ఇంటికి రాగానే వ్యక్తులను కాక వస్తువులను పరిచయం చేయడం నాగరికతగా భావిస్తున్న మన వస్తు వ్యామోహాన్ని **"తన ఇంటికి తానే ఓ గైడ్ గా మారిపోయాడు"; "పాపం ఇదివరకు అతనికో వ్యక్తిత్వముండేది. ఇపుడు ఇల్లే అతని అస్తిత్వమయింది"** అంటూ సున్నితంగా విమర్శిస్తారు.

***

ఇలా, తరచిచూస్తే **"అస్తిత్వంలోకి బొక్కెన వేసి స్వీయ సామాజిక సమ్మిళిత సంవేదనను పైకి చేదుకున్న"** అనుభవాల అక్షర రూపమే ఈ కవిత్వం. కవి శ్వాస

కోశాంతరంగాన నింపుకొన్న భావనా సురభిళమంతా బాహ్య ప్రపంచంలో కవిత్వంగా రూపాంతరం చెందింది. **"నాలో ఏదో పక్షి రెక్కలు విప్పుకుంటున్న సవ్వడి. అది బయటకు వచ్చి ఆకాశంలో ఎగిరినపుడు నేను అనంతంగా విస్తరిస్తాను"** అని చాటుకునే డా. గోపి హృదయరశ్మిలో పురివిప్పి ఆడిన భావమయూరాల సమూహమే ఈ గ్రంథం. ఓ కవితను ముద్రించుకుని **"అరచేయంత కాగితం ఆకాశపు విస్తీర్ణం పొందుతుంది".** అలాంటి వందల ఆకాశాల నడుమ విహరింపచేసే సాధనం – ఈ కవితా సంపుటం.

***

**(ఫిబ్రవరి - 2016 'జాబిలి' మాసపత్రికలో ప్రచురితం)**

# 3 పూర్ణిమత్వ కవిత్వం 'చంద్రవర్షం'

సుదీర్ఘ సాహిత్యజీవనం నెరపే వ్యక్తుల విషయంలో పరిశీలిస్తున్నది ప్రస్తుత కవితాసంపుటినే ఐనా, పరిణామ క్రమాన్నీ అధ్యయనం చేయడం తప్పనిసరి అవుతుంది. వస్తువు ఎంపిక, అభివ్యక్తి గాఢత మొదలైన ఒకటి రెండు అంశాలకేకాక ఈ పరిణామాన్ని కవిత్వ ప్రాణధాతువులుగా పేర్కొనే సామగ్రి అంతటా వెతకాల్సివస్తుంది. అలా వెతికినప్పుడు 'కవిత్వమంటే ఏమిటి?' అనే ప్రశ్నకు కవి చెప్పుకునే నిర్వచనాల్లో క్రమానుగత మార్పు కనిపిస్తుంది. అయితే, శ్రీ భగ్వాన్ ఇటీవల ప్రచురించిన "చంద్రవర్షం" చదివినపుడు పైన చెప్పిన సంగతులేవీ ఈయనకంతగా వర్తింపవనిపిస్తుంది. ఎందుకంటే, **"కవితలెప్పుడూ మనిషితనం వాసన వేయాలి, అవి మానవతా ద్వారంలోంచే పయనించాలి"** అని నమ్మి, తొలి అడుగు నుండి నేటివరకూ నిర్దిష్ట పథాన్ని విడవక నడుస్తున్న కవి గనుక.

***

భగ్వాన్ నిరంతర పాఠకుడు. తాను చదవడమే కాదు, భుజాన వేలాడే చేతి సంచిలో ప్రెస్ వాసన పోని ఫ్రెష్ పుస్తకాలు ఓ రెండు మూడుంచుకొని, మిత్రులు ఎదురైనపుడు ఇది చదివావా, తప్పక చదవాల్సిన పుస్తకం అని ఇవ్వడం అలవాటు. ఈ పఠనశీలత, భావ వినిమయం, అరవై ఏళ్ల అనుభవం అన్నిటికీమించి వేలాది విద్యార్థుల తాలూకు జీవిత పరిశీలన – వెరసి ప్రతి కవితలో తాత్త్వికత అంతస్సూత్రమై అందగిస్తోంది. అందువలనే **"పిట్టంటే ఎగిరే మనిషి, మనిషంటే ఎగిరే పిట్ట"** వంటి అరుదైన వాక్యాలను అత్యంత సాధారణంగా అనగలుగుతారు.

కొన్ని నమ్మకాల వెనుక లాజిక్ మనం పట్టుకోలేం. అయితేనేం? పోయేదేముందిలే అని ఆచరణ కొనసాగిస్తాం. ఇలాంటి ఒక సందర్భాన్ని సంభాషణగా మలచి గొప్ప ముగింపుని ఇస్తారు "ప్రవాహం" కవితలో. నదిలోకి నాణెం విసిరినామెను ఎందుకు విసిరావని అడుగుతాడు కవి. మాటలిలా సాగుతాయ్:– **ఎందుకు? పుణ్యం; ఎవరు చెప్పారు? అమ్మ; ఆమెకు ఎవరు చెప్పారు? ఆమె అమ్మ... నేను నా పిల్లలకు, వాళ్ళు వాళ్ళ పిల్లలకు.** ఇలా కొనసాగించి కవి అంటాడు **"నదిలా నమ్మకం కూడా ఒక ప్రవాహమేనేమో!"** ఈ వాక్యం తరువాత నదికి, నమ్మకానికి ఎన్నెన్ని సారూప్యతలున్నాయో గుర్తు చేసుకుంటూ కవితంతా శ్రద్ధగా మరోసారైనా చదువుకుంటాం.

కవితాపాదాలను సంక్షిప్తీకరించిన తీరు ఒక్కోచోట ముచ్చట గొలుపుతుంది. **"ఒడ్డున, పని చచ్చిన పడవలు ఎక్కడ్నుంచో కొట్టుకొచ్చిన మృత కళేబరాల్లా తేలుతున్నాయి** (వంతెన నిర్మించాక కవితలో)" – సన్నివేశాన్ని అక్షరబద్ధం చేసేప్పుడు కవిత్వానికి, ప్రెస్‌నోట్‌కి తేడా తెలియని కొందరికి ఇవి అధ్యయనంచేసి అవసరమనుకొంటే బట్టీ పట్టాల్సిన వాక్యాలు. మరో కవితలో **"ముగ్గిన ఆకుల అక్షతలు జల్లి చెట్లు అతడిని ఆశీర్వదిస్తాయి"** అంటారు. ఇక్కడ ఆకులను పండిన అనకుండా ముగ్గిన అనడం ద్వారా కవితను మెరిపించి, వాటి 'పసుపుదనాన్ని' గుర్తించి అక్షతల స్థాయిని ఆపాదిస్తాడు కవి. ఈ కవితలోనే మరికొంత భాగాన్ని చివరలో ప్రస్తావించుకుందాం.

కుటుంబ సంబంధాలను అక్షరబద్ధంచేస్తూ, నలుగురి మధ్యలోనే ఉన్నా ఒంటరిగా స్మార్ట్ ప్రపంచంలో బ్రతుకేస్తున్న మనల్ని కొంత అసూయకు గురిచేస్తారు భగ్వాన్. పాఠశాల దశలోనే పిల్లలకు ప్రత్యేక గదులను కేటాయిస్తున్న కాలంలో ఇంటిల్లిపాదీ కలసి పంచుకున్న కొన్ని "ఉమ్మడి సమయాల్ని" మనముందుకు తెస్తారు. **"నడవనిండా జోకులు పారేసుకుని నవ్వులేరుకున్నాం"** అన్నపుడు, ఊహించ గలగాలిగానీ ఎంత గొప్ప దృశ్యాన్ని తెరకట్టి ప్రదర్శించారో. **"మేమంతా మా గది కిటికీలోంచి చెట్టునీ, చిలకల్నీ అవి కొరికిపారేస్తున్న కాయల్ని కళ్ళనిండా పోగేసుకుంటున్నాం"** – ఇక్కడ పోగేసుకోవడమనే పదానికి ప్రత్యేకత ఉంది. అమితమైన ఆపేక్షతో ఒక్కొక్కటిగా ఏరుకొచ్చి పదిలంగా ఒకచోట పేర్చుకొనే ప్రక్రియను పోగేసు కోవడమంటాం. అంటే ఓ ప్రాకృతిక సందర్భాన్ని తమదిగా చేసుకొనేందుకు కుటుంబమంతా ప్రదర్శిస్తున్న ఉత్సుకత వ్యక్తమవుతోంది. అందరూ కలసిగడిపే అవకాశమిచ్చిన ఓ కరెంటు పోయిన రాత్రిలో **"చీకట్లో ఇళ్ళన్నీ వేడెక్కి ఉన్నా మా ఇల్లు మాత్రం ఒక గొప్ప ప్రేమ పాలపుంత కాంతిలో తలారా తడిసిపోయింది"** అంటూ అందుకు కారణమైన లైన్మెన్ ను **"నిన్నసలు అనుబంధాల వీధిలో ఊరేగించాలి సుమా!"** అంటారు. ఇలా కౌటుంబిక సంబంధాలే కాదు శ్రీ గిడ్డి సుబ్బారావు, శ్రీ పి.ఆర్.ఎల్ స్వామిలతో అనుబంధాన్నీ కవితలుగా అల్లి వారి వ్యక్తిత్వ పటాలను ప్రేమగా ప్రదర్శిస్తారు.

అమితంగా ప్రేమిస్తున్నవారిని అనవసరపు జాగ్రత్తలతో కొన్ని ఆనందాలకి దూరం చేస్తుంటాం, అవాంతరాలు ఎదురై ఆపదలొస్తాయేమోనని. ఇలాంటి ఓ అనుభవాన్ని మనకీ తెలియాలని "వానలో తడవడం" అనే కవితగా మలచారు భగ్వాన్. పిల్లలు వానలో తడిసిపోతారని బడిసమయం మాస్టర్లు పొడిగిస్తున్నారుట, ఈ విషయం తెలియక పిల్లలెళ్ళాక కురుద్దామని మబ్బులు వానను వాయిదావేసాయిట. ఇది ఎంతకీ తేలక చివరకి బడివదలడం, వాన కురవడం ఒకేసారి జరిగాయి. అయ్యయ్యో అని మాస్టర్లు, మబ్బులు బాధ పడుతుంటే **"అయినా తెలియనిదెవరికని? వానలో మజాగా తడవడమే పిల్లలకిష్టమని"** అంటారు అప్పటివరకూ మేస్టారుగా ఉన్న కవి భగవాన్. **"బొటన వేలుని, చూపుడు వేలునీ పట్టకారులా మడిచి, అక్షర**

**కాంతిని బిగించి పట్టుకుని"** అని ఓ కవితలో అన్నట్లు, ఆ కాంతిజనకం సుద్దైనపుడు విద్యార్థుల మస్తిష్కాలను, కలమైనపుడు కవిత్వ ప్రేమికుల హృదయాలను వెలిగించడమే పనిగా సాగుతున్నవారు భగ్వాన్.

పుస్తకమంతా, పిల్లల ఆటను చూస్తూ తామూ ఆటలో మునిగిపోయిన వాళ్ళని, దండలల్లడాన్ని చూస్తూ తామూ దండలల్లేసిన వాళ్ళని, వానలో ఆడుతున్న పిల్లలతో తామూ ఆడేసుకుంటున్నవాళ్ళని మనకూ చూపించిన భగ్వాన్, కవిత రాసుకుంటూ తానే ఓ కవితగా మారిపోతారు చాలా చోట్ల. **"అతని పెరట్లో ఎన్ని మొక్కలున్నాయో అన్ని అతనులుగా అతనక్కడ సాక్షాత్కరిస్తున్నపుడు మొక్కల్నీ, అతడిని విడదీసి చూపడం సాధ్యం కాదు"** అని ఓ వృక్ష ప్రేమికుని గురించి వీరు వ్రాసినట్లు – చంద్రవర్షంలో ఎన్ని కవితలున్నాయో అన్ని 'అతను'లుగా భగ్వాన్ సాక్షాత్కరిస్తారు. చివరిగా ఒక మాట, 'తమ భాషను మరచిన వాళ్ళు' కవితలో కవి ఆశించినట్లు **"పట్టునిండా తేనెలా, మబ్బు నిండా నీరులా, పందు నిండా గుజ్జులా"** పరి'పూర్ణిమ'త్వం సిద్ధించిన కవిత్వం ఈ చంద్రవర్షం.

***

**(నవంబర్ - 2016 'రమ్యభారతి' త్రైమాసిక పత్రికలో ప్రచురితం)**

# 4 కవి, విమర్శకుల కరదీపిక "కావ్య సంజీవి"

ఓ ఇష్టమైన కవి తాలూకు కవిత్వాన్ని ఉద్దేశ్యపూర్వకంగా పక్కనపెట్టి, ఆ కవిత్వంపై వెలువడిన విశ్లేషణాత్మక వ్యాసాన్ని సమీక్షించడం ఓ ప్రత్యేక సందర్భం. కాసేపు మనం శ్రీ 'శిఖామణి' కవిత్వాన్ని గురించి నరసింహమూర్తిగారి మనసుతో మాట్లాడుకోబోతున్నాం. కనువిందు చేస్తున్న కవితా పంక్తుల మోహంలో పడకుండా, మనదైన Ego interference కు గురికాకుండా మూర్తిగారి విశ్లేషణపైనే దృష్టిసారించడం కొంత కష్టమైన పనేనేమో!

***

పుస్తకానికి సంబంధించిన ప్రాథమిక విషయాల్లోకి వస్తే, వందల మందికి మాధుర్యాన్ని పంచగల పానీయం గాఢమైన ఎసెన్స్‌గా చిన్న సీసాలో ఇమిడిపోయినట్లు, అంతవరకూ వెలువడిన శిఖామణి కవిత్వంపై తమ సమగ్ర విశ్లేషణను డా. ఉపాధ్యాయుల అప్పల నరసింహమూర్తి 2008లో 'బాధానందం' అనే శీర్షికతో ముప్ఫై పేజీల వ్యాసంగా అందించారు. పత్రికలూ, ఇతర గ్రంథాలలో ఇప్పటికే సంక్షిప్తరూపంలో అచ్చయినా, పూర్తిరూపం ఇపుడు 'కావ్య సంజీవి' పేరిట ముద్రించి నరసింహమూర్తిగారి సహధర్మచారిణి శ్రీమతి నరసమ్మగార్కి అంకితమిచ్చారు. మూర్తిగారు మరణించినపుడు శ్రీ శిఖామణి రాసిన నివాళి వ్యాసాన్ని పుస్తకంలో చేర్చడం ప్రత్యేకంగా ప్రస్తావించవలసిన విషయం.

***

వ్యాసం చదవడం పూర్తిచేసాక మనకు తెలిసే మొదటివిషయం దీని ముద్రణ ద్వారా శ్రీ శిఖామణికో, వారి కవిత్వానికో ఇపుడు లభించే లేదా లభించవలసిన అదనపు ప్రయోజనమేమీ లేదు. అయితే – (1) ఒక అగ్రశ్రేణి కవిగా రూపొందిన తరువాత కూడా కవి చేసిన కృషి ఎంత లోతుగా, ఎన్నెన్ని కోణాలలో మూల్యాంకన చేయబడుతుంది? ఎన్నెన్ని పరీక్షలను ఎదుర్కోవాల్సి వస్తుంది అనేది తెలుసుకోడానికి, వీలైతే ఒకింత మెలుకువలో ఉండడానికి – ఎదగాలనుకునే కవుల కోసం; (2) మూలాలను, పరిణామక్రమాన్ని, కవి ప్రకటించిన భావాల వెనుక కార్య కారణ సంబంధాన్ని, గతకాలపు సువిశాల సారస్వతంలో సరూప అభివ్యక్తుల ఉటంకింపుల్ని,.... ఇన్ని నిర్వహించాల్సిన బాధ్యత తెలియజెప్పడానికి – తయారుకావాలనుకునే విమర్శకులకోసం ఈ ముద్రణ ఎంతైనా అవసరం.

***

నిజానికి నరసింహమూర్తిగారు కవిత్వాన్ని గూర్చి తన అభిప్రాయాలను, కవిలోకానికి ఇవ్వదలచిన నిర్దేశాలను అందించడానికి మాధ్యమంగా శిఖామణి గారి కవిత్వాన్ని ఎంచుకున్నారు. అందుకే మొదటి పేజీల్లోనే **“కవి బంగారు పాళీతో రాసాడా? ఇనుప పాళీతో రాసాడా? అన్నది ముఖ్యంకాదు. అభిశప్త సమాజానికి అండదండగా నిలిచాడా, లేడా? అన్నదే ముఖ్యం. అగాధ మానవతా సముద్రాల గర్భంలో నిక్షిప్తమైన బడబాగ్ని శిఖలతో ఉవ్వెత్తున ఎగసిన ఉత్తాల తరంగమై, ఉజ్జ్వల కాంతిపుంజ ఉన్నిద్ర కంఠమై, ఉపక్రమోపసంహారాలు లేని ఉదాత్త స్వప్నంగా నిలిచాడా లేడా? అన్నది ముఖ్యం”** – కవిత్వపు Aims & Objectivesని తెలియజెప్పే ప్రయత్నమిది.

***

తరువాత దశలో, కవి ఏ ఏ పథాలలో పయనిస్తాడు, అతడిని ఏవి అనుసరిస్తాయి, వాటి బాహ్యాంతర స్వరూపాల భేదం నుండి తానేం నేర్చుకుంటాడు? ఇన్నిటి గురించి మనలో ప్రశ్నలు లేవనెత్తుతారు. వాటన్నిటితో శ్రీ శిఖామణి కవిత్వాన్ని బేరీజు వేసి **“కవిత్వ తత్వాన్ని ఆకళించుకోగల నూత్నదర్శనం కారణంగా శిఖామణి కవిత్వం కవిత్వ ప్రియులకు మహా బాధానందాన్ని అందిస్తుంది”** అని ప్రకటిస్తారు. ఈ పుస్తకానికి మూర్తిగారు పెట్టుకొన్న పేరు వెనుక కారణం ఇది.

వ్యాసనిర్మాణంలో ఒక నిర్దిష్టమైన శిల్పం మనకు కనిపిస్తుంది. ముందుగా సార్వకాలికము, సార్వజనీనము అయిన విషయాలను తెలియజేసి, అక్కడినుండి శిఖామణి కవిత్వంలోకి ప్రవేశించి, ప్రశంసించి సాధికారికంగా వారి పరిశీలనలను మన ముందుంచుతారు.

**"ఉత్తమోత్తమ కవులకు అవసరమైన సంయమనం, సమగ్రత అనే లక్షణాలు శిఖామణిలో ఒక పాలు తక్కువని చెప్పకతప్పదు. ఈ లోపం కూడా శిఖామణిలో ఒక అత్యంత ఆకర్షణీయమైన సృజనబీజంగా పరిణమించింది"** – ఉండాల్సిన కొన్ని లక్షణాలు లేవని చర్చ మొదలుపెట్టి అది ఆమోదయోగ్యమే అని రూఢిచేసి ముగించడం ఇక్కడ వ్యాసకర్త ప్రదర్శించిన టెక్నిక్. అయితే, "ఆకర్షణీయము", "సృజన బీజము" అనే పదాల వాడకం ద్వారా వాక్యం ప్రారంభంలోని "లోపం" అనే పదం మనకు మరికొన్ని ప్రశ్నలనుదయింపజేసి వాటికి సమాధానాలను అన్వేషించే క్రమంలో శిఖామణి కవిత్వాన్ని మరోసారి మనసుపెట్టి చదివేందుకు ప్రేరేపిస్తుంది.

***

తరువాతి సోపానంగా శ్రీ శిఖామణి కవిత్వానికి ప్రేరణదాయకంగా నిలిచిన సాహిత్యంతో వారి కవిత్వాన్ని తులనాత్మక సంసర్గం జరుపుతారు. ఈ దశలో మనం చదువుతున్నది వ్యాసమైనా, వాక్య నిర్మాణం కవిత్వాన్ని చదువుతున్న అనుభూతిని కలిగిస్తుంది. **"వేదన ఏ రూపంలో ఉన్నా కవిత్వం దానిని మన కళ్ళ ముందు నిలుపగలదనే సత్యానికి శ్రీ శ్రీ తో పాటు శిఖామణి కూడా సాక్ష్యం పలుకుతాడు"** – ఈ శతాబ్దం నాదని ప్రకటించిన కవితో సారూప్యం కవి పొందిన ఉన్నత గౌరవం. చాలాచోట్ల సుదీర్ఘ వాక్యాలు వ్యాసకర్త చివరికి ఏం తేలుస్తారో అనే ఉత్సుకతను కలిగిస్తాయి. మరోచోట **"రెండు దశాబ్దాల నుంచి తెలుగు కవిత్వ పాఠకులకు తారసిల్లిన తరితీపు శిఖామణి"** – ఎంత హృద్యమైన వాక్యమిది.

***

ఇతర కవుల ప్రభావాలు, వైరి సమాసాలు, పద ప్రయోగాలు కవితా నిర్మాణంలో అలసట, అనవధానం చోటుచేసుకున్న సందర్భాలను సోదాహరణంగా సూచిస్తూ – వాటిని అధిగమించి శిఖామణి సాధించిన సంయమనశీలతను,

సమగ్రతను స్పష్టంచేసి; అభివ్యక్తి తీవ్రతలో వచ్చిన క్రమానుగత మార్పుని, ఔచిత్య భూమిక నాశ్రయించి నిర్వహించడంలో వచ్చిన పరిణతిని నర్మగర్భంగా తెలియజేస్తారు. అయితే ఈ ప్రతిపాదనలన్నిటికీ ముందే **"వేసవి నీటి పాయలో ఉండే ఒక సారళ్యం, ఒక తళ తళ ఆ అభివ్యక్తిలో కనిపిస్తాయి"** అని కవిపై తనకు గల శాశ్వత అభిప్రాయాన్ని వ్యక్తంచేస్తారు.

***

చివరకు, శిఖామణి కవిత్వమర్మాన్ని ప్రకటిస్తారు. **"శిఖామణికి పూలను ప్రేమించడం తెలుసు, అందుకే అతని మాటలు పరిమళిస్తాయి, అతడు కవిత్వపు ఇండుబకాయతో వరదగా పారే భాషకు తేటదనం తెస్తాడు, సరళము ప్రసన్న గంభీరము అయిన కావ్య భాషా పరిచయంతో పాటు భావకవులు, అభ్యుదయ కవులు ఉపయోగించిన ఆధునిక ప్రామాణిక భాషను అనుసరించిన వాడీ కవి.**

**సభ్యత, సంస్కారాలతో పాటు, శబ్ద సంస్కారం కూడా ఉన్నవాడు ఈ కవి.**

**కవిత్వానికి నలుపూ తెలుపూ అంటూ ఉండదు. చదరంగం గళ్ళలా శిఖామణి కవిత్వంలో ఎత్తు ఎత్తుకీ గడిమారినా ఏదో ఒక కొత్త వ్యూహం కదులుతూ మనల్ని కదిలిస్తుంది"** లాంటి statements తో శిఖామణి కవిత్వం తాలూకు సమగ్ర చిత్రాన్ని మనకు సాక్షాత్కరింపజేసి ముగిస్తారు.

***

**"మార్చి, 21 న యానాంలో "కావ్య సంజీవి" ఆవిష్కరణ సందర్భంగా చేసిన ప్రసంగం"**

**(ఆగస్ట్ - 2017 'సాహిత్య ప్రస్థానం' లో ప్రచురితం)**

**(అరుపదుల శిఖామణి సాహిత్య సంచిక 'సంజీవని' లో ప్రచురితం)**

# 5 “వెలుతురు తెర” తీస్తే స్మృతి చిహ్నాలు, స్వప్న శకలాలు

బొల్లోజు బాబా – డిసెక్షన్ టేబుల్‌పై జీవిని ప్రదర్శించి అంతర్గతనిర్మాణాన్ని బోధించే అధ్యాపకుడు. అపారదర్శక దేహంలో దాగిన అంతరంగాన్ని అన్వేషించి అందులో అవకాశమున్నంత మేరా ఆహ్లాదాన్ని నింపాలని తపించే సృజనకారుడు. ఈ రెంటికీ మించి వెలుపలా, లోపలా ఒకేలా ఉండగల అద్వైతి. బహుశా, ఈ మూడవ లక్షణమే మొదటి రెండురంగాలలో వారి ప్రభావానికి కారణమని నా అభిప్రాయం.

పదుగురిలో ఉన్నపుడు తానో విద్యావేత్తగానో సాహిత్య కారునిగానో బయటపడకుండా జాగ్రత్తపడతారు కానీ ఒంటరిగా కూర్చుని కవిత రాసుకుంటున్నపుడు తనలోని “మాష్టారు, మనిషి” అవసరమైనంతగా చొరబడుతుంటే మాత్రం అచేతనంగా అంగీకరిస్తారు. ఈ బలహీనతే వీరి కవిత్వాన్ని మనసుపెట్టి చదివిస్తుంది. మనసుపట్టి కుదిపేస్తుంది.

***

బాబా కవిత్వాన్ని మనం మనలాగే ఉంటూ చదవడం అంత సులభం కాదు. **"ఒక సమాంతర కాలంలోకి అనంతంగా ప్రవహిద్దాం వస్తావా!"** అని ఆహ్వానిస్తున్నట్లు ఆ పయనం అతనితో సమాంతరం, అనంతం. అంతవరకూ సరే, ఈ ప్రవహించడం ఏమిటి? అప్పటికే హృదయ ద్రవీభవనం జరిగాక మరో మాటెలా అనగలడు కవి?

**"ఇంద్ర ధనస్సుని పొరలు పొరలుగా ఒలుచుకొని పంచుకొన్నాయి పూలు"** అని ఓ కవితలోనూ, **"క్రోటన్ మొక్కలు ఇంద్రధనుస్సుని పగలగొట్టుకొని పంచుకొన్నట్లున్నాయి"** అని fragment గానూ రాసి పక్క పక్క పేజీల్లో ప్రచురించడం, కవికి ఇది పునరుక్తి అని తెలియకకాదు. ఒకే సామ్యాన్ని వివిధ సందర్భాలుగా కవిత్వీకరించగల తన అన్వయశక్తిని ప్రకటించడం. ఒకే భావన అక్కడ పొరలు పొరలుగా ఒలవబడి కవితైతే, ఇక్కడ పగిలి లఘురూపాన మెరిసింది.

కొందరి సహవాసంలో జీవితంలో ప్రతిక్షణం నూతనత్వాన్ని అలముకుంటుంది. అవే పరిసరాలు, అవే సంగతులు అయితేనేం? నిన్నటిని రేపు తలచుకుంటున్నపుడు దాచుకోడానికి కొన్ని జ్ఞాపకాలు కనిపిస్తాయి. ఇంతటి వైవిధ్యాన్ని జీవితంలో నింపిన వ్యక్తులు హటాత్తుగా దూరమైతే? అనుక్షణం సంబరంగా గడవాల్సిన జీవితం సాధారణ సన్నివేశంగా మారిపోతుంది. అలాంటి ఓ సమయంలో **"నీ నిష్క్రమణ తరువాత రోజులన్నీ ఒకేలా ఉన్నాయి, మరోసారి ఏడవటం తప్ప మరేం చేయగలను చిన్నమ్మా!"** అంటాడు కవి. "జానెవాలే కభీ నహీ ఆతే, జానెవాలోంకి యాద్ ఆతీ హై" అనే పార్సీకవి వాక్యాన్ని పరిచయంచేస్తారు తన "యాది" లో శ్రీ సామల సదాశివ. అవును, పోయినవారు రాలేరు. కానీ, వారి జ్ఞాపకాలు కళ్ళెదుట కదలాడతాయి, కవితలకు ప్రేరణవుతాయి.

జీవితమంటే ఐకాంతిక వర్తనం కాదు. సామూహిక ఉత్సవం. కవులంతా అంతర్వర్తనులే అని కొన్నిసార్లు కొందరు generalize చేసినా, వినడానికో, విమర్శించడానికో వాళ్ళకీ ఓ నలుగురు కావాలి. అందుకే, **"ఎవరూ నడవని దారి కదాని ఉత్సాహంగా ముందుకు పోతుంటే జీవితం నవ్వుతో ఓయ్ పిచ్చి మొద్దూ నేనిక్కడుంటే అటెక్కడికి పోతున్నావ్? అంది వెనుకనుంచి"** అని స్వీయానుభవంగా చెప్పుకుంటాడు కవి.

అన్ని నవ్వులూ ఆనందాన్ని పంచవు. అన్ని కన్నీళ్ళు బాధించవు. నవ్వు, ఏడుపు ఈ రెండు మాత్రమే ప్రతిస్పందనకు ఉద్దీపనలుగా సరిపోవేమో. వాటి వెనుక స్థితిగతులే ప్రధాన కారకాలేమో! నిజమేననిపిస్తుంది **"ఆ కాన్సర్ పిలగాని నవ్వు కన్నీళ్ళ కన్నా ఎక్కువ బాధిస్తోంది"** అనే వాక్యం చదివినపుడు.

'సమీక్ష' దృష్టితో చదివేటపుడు, ఓ సంపుటిలోని కవితల అంతస్తత్వాన్నిబట్టి వాటిని వివిధ తరగతులుగా వర్గీకరించి విడివిడిగా పరిశీలించి కవిని అందుకోడానికి ప్రయత్నిస్తాం.

**"అన్ని నిర్ణయాలు ముందే అయిపోయాయి**
**ఏదో కాలక్షేపానికి జీవించాలి అంతే"**
**"ప్రకృతి పొరల్లో**
**ప్రాణాన్ని గింజను చేసి పాతిపెట్టే మృత్యువుంది.. ఎంతదృష్టం?"**

ఇలాంటి వాక్యాలు ఎదురైనపుడు మాత్రం ఇది వేదాంతమా? జీవితం నేర్పిన రాజీపాఠమా? సంపూర్ణ సంతృప్తి వ్యక్తపరచడమా? – ఇలా పరమార్థం తెలీక సమీక్ష మాట అటుంచి కాసేపు సంబరపడిపోతాం.

**"ఇంటికెళ్ళ లేక పోవటం ఒక విషాదం**
**పెద్ద పులిని నమ్మించలేకపోయిన ఆవుకోసం**
**లేగదూడ జీవితాంతం అరుస్తూంటుంది"** ఇక్కడ 'జీవితాంతం' అనే పదాన్ని ప్రాధాన్యరహితంగా భావిస్తే కవితలో అనేక అన్వయాలకు ఆస్కారం ఉంటుంది. మరోసారి పై పదాన్ని ఒకింత దృష్టి సారించి పలికితే – పెద్దపులి యముడని, తాను ఆవునని, వెళ్ళక పోవడానికి కారణం మరణమని, ఇంటిదగ్గర ఎదురుచూస్తూన్న వారంతా లేగదూడలని, వారి అరుపులు జ్ఞాపకాలని తెలిసిపోతుంది. ఇంత తెలిసాక, వెంటనే పక్క పేజీలోకెళ్ళి మరో కవిత చదివేస్తే, పాఠకునిగా మనమెక్కడో ఫెయిలవుతున్నట్లు లెక్క.

***

తన అనుభవాల జేబులో ఇప్పటికీ దాచిన యవ్వన దశలోని "గులాబీరేకల గరగరల్ని"; నాయనమ్మ, అమ్మ, భార్య – మూడు తరాల గృహ నిర్వహణా సామర్థ్యాన్ని;

పరీక్ష పత్రాల్ని దిద్దుతున్నపుడు మెదడుతో తూకం వేస్తూ, హృదయంతో మూల్యాంకన చేస్తూ, ఖాళీ జవాబు పత్రంలో విద్యార్థిని జీవితం సంధించిన ప్రశ్నలను వెతుకగల తన బహుముఖ విన్యాసాన్ని; పనిగట్టుకుని పెంచాలనో, కావాలని కుదించాలనో తాపత్రయ పడకుండా ప్రతీ అనుభూతిని, తానో కవితలో అన్నట్లు **'మట్టిని మోసుకెళ్ళే కందిరీగ'**లా శ్రద్ధగాతెచ్చి మన గుండెల్లో గూడు కట్టేసాక, ఆలోచించేందుకు మనకంటూ ఏమీ మిగలవిక – **"జేబుడు పదాలు, గుప్పెడు కలల ముక్కలు తప్ప".** బతుకు ఉత్సవం కావడానికి ఇవి చాలవా...?

***

**(ది. 07.08.2016న సాహితీ స్రవంతి, కాకినాడ సభలో ప్రసంగం.)**

**(డిసెంబర్ - 2016 'చినుకు' మాసపత్రికలో ప్రచురితం)**

# 6 జీవించే క్షణాల జాబితా.

కవితగా మలిచేందుకు ఎన్నుకున్న అంశంపై తానిప్పటికే కొన్ని కవితలు రాసుంటే మరలా ఓ కొత్తదైన భావాన్ని, అందులో తనదైన గొంతుకను పలికించడం కవికి అంత సులభం కాదు. ముందుగా వ్యక్త్యంతర వైవిధ్యాలని (intra individual differences) వినియోగించుకొని తనకు తాను మరోకోణంలో ఆవిష్కృతమైతే తప్ప పాఠకుడిని సంతృప్తి పరచలేడు. ఈ దశలో అనుభవం, అధ్యయనం అండగా నిలుస్తాయ్, అంతర్గతమైన తపనేదో ప్రతిపదానా తోడవుతుంది. ‘నవత’ నింపుకొని  మరో కవిత సిద్ధమవుతుంది.

వందల కవితలు రాసాక కూడా వేరే భావాలెలా తలెత్తుతాయబ్బా! అని ఆశ్చర్యపరిచే పేర్లలో మాకినీడి సూర్య భాస్కర్ ఒకటి. సృజన, విమర్శ, చిత్రలేఖనం, అధ్యాపనం... ఇన్ని జీవన వ్యాపారాల మధ్య తనకు తాను దొరికే క్షణాల అన్వేషణలో లభించిన కవి ‘సమయా’ల సాక్షర రూపం “నాకు నేను దొరికిన క్షణాలు” కవితా సంపుటి. **“కళా నిరంకుశత్వం పాలించేది ఆనంద సామ్రాజ్యం అందం రాజధాని”** అని ప్రకటించినా, 94 పేజీల క్షేత్రాన్ని శ్రద్ధగా సాగుచేసిన కృషీవలత్వమే కనిపిస్తుంది. ఆ రాశిపోసిన పంటలో ఓ దోసెడు అందుకుందాం.

***

ఉపనిషత్తుల నుండి భగవద్గీత వరకూ, బౌద్ధ జైన సాహిత్యాల్లోనూ 'చెట్టుకు' మానవదేహంతో కొన్నిచోట్ల, సంసారంతో మరికొన్ని చోట్ల సారూప్యం చెప్పబడింది. అయితే ఒకింత సూక్ష్మావలోకనంతో, నిత్య పత్రహరిత సత్యంగా తన దేహం ప్రకాశించడానికి కారణం – **"నా గుండెలోనే ఓ మొక్క ఉందో, నా గుండే ఓ విత్తనమో"** అని ప్రశ్నించుకుంటాడు, కవి. ఆ విత్తనానికో లేక మొక్కకో ఆవాసం 'గుండె' లోనే కవి ఎందుకు ఎంచుకోవాలి? యావత్ శరీరానికీ రక్త ప్రసరణ జరిపే కేంద్రమదేననే "శరీర ధర్మాన్ని" ఏళ్ళపాటు బొమ్మ గీసి బోధించినవాడు కనుక.

'భూమి', 'పంట'గా పిలవబడిందంటే – నిర్జీవం జీవమయమైనట్లు. అయితే ఈ పరివర్తనలో నీలం(మేఘం) ఆకుపచ్చ(పైరు)గా మారటాన్ని మన దృష్టికి తెస్తూ

**ఊహకందని ఏ పసుపచ్చతో సమ్మిళితమౌతుందో ...**
**ఏ కిరణ సంస్పర్శతో**
**సంకలితమౌతుందో**
**విదళితమౌతుందో**
**విచలితమౌతుందో"** – ఇదిగో ఇలాంటపుడే కవిత రాసిన చిత్రకారుడు మనకు దొరికిపోయేది. వర్ణమయ పదచిత్రాలతో, కాసేపు 'కిరణ జన్య సంయోగ క్రియ' సైన్స్ కు సంబంధించిన విషయంగా కాక సాహిత్యపరమైన వర్ణనేమోననే భ్రమలో పడేస్తుందీ కవిత. "కవి ప్రతిభలోన నుండు కావ్యగత శతాంశములయందు తొంబదియైన పాళ్ళు" అన్నదందుకే విశ్వనాథ.

రీడింగ్ రూమ్‌ని 'మినీ ముద్రణశాల'గా, హాల్‌ని ప్రదర్శనశాలగా మార్చుకున్న మాకినీడి రహస్యం **"కలల నడక, కలతల నడక, కలవరింతల నడక, పలవరింతల నడక, నడక నడక ఆగని నడక"** అంటే అన్ని ఉద్వేగ దశలలోనూ లక్ష్యం దిశగా సాగిపోవడమే. "చరైవేతి, చరైవేతి" కి పరమార్థం ఇదే. "బాధ్యతల నుండి ఒక్కరోజు కూడా సెలవు కోరని కవి– మాకినీడి" అన్న అద్దేపల్లి మాటలు ఈ సందర్భంలో స్మరణీయం.

ఏడుపు, నవ్వు వ్యతిరేక పదాలనుకుంటాం కానీ ఓ విస్మృత స్త్రీ జీవితానికి అన్వయించి వాటి మధ్య అవిభాజ్యతను తెలియజేస్తాడు కవి. **"పురిటి నొప్పుల**

**ఏడుపులోనూ కొత్త మొలక కేర్ మంటే చిత్తముప్పొంగగా ఆనందించిన పిచ్చితల్లి కదా – ఏడుపులో నవ్వు జీవితమైనదామె, బతుకంతా నవ్వుల పాలైన ఏడుపామె".** నిజమే, 'ఆమె' జీవన స్రవంతిలో ప్రతి సంతోష తరంగంతోనూ సమాంతరంగా ఓ కన్నీటి పాయ ప్రవహిస్తున్నపుడు జమిలిగా సాగే ఈ ప్రయాణాన్ని ఎంత సరళంగా చెప్పగలిగాడో కవి.

**"ఆవకాయ సీసాగా, జంతికల డబ్బాగా**
**అమ్మ మనసు సర్దుకుంటుంది.**
**బడ్జెట్ ప్రకారం అవసరాన్నిచ్చేసినా**
**మరో పదో పరకో అదనంగా చేతిలో పెడుతూ**
**నాన్న మనసు కుదుట పడుతుంది.**
**బెంగటిల్లిన మనస్సూటుకేసులో**
**సెలవు రోజుల జ్ఞాపకాల పొరల బట్టలను**
**మళ్ళీ మళ్ళీ సర్దుతూ ..**
**ఒకరోజు ఆలస్యంతో కరెక్టు టైముకు వచ్చే రైలు**
**ఆ రోజెందుకో ఆఘమేఘాల మీద వచ్చేసి"** – ఇదీ సెలవల తరువాత, పిల్లల తప్పనిసరి ప్రయాణ సన్నివేశాన్ని ఆవిష్కరించిన తీరు. "మనస్సూటుకేసులో సెలవు రోజుల జ్ఞాపకాల పొరల బట్టలను మళ్ళీ మళ్ళీ సర్దుతూ...." సన్నివేశంలోకి ప్రవేశించి ఒక్కొక్క పొరను విప్పి మనం ఎవరికి వాళ్ళం పాత్రధారులమైతే, ఎంతసేపవుతుంది ఈ సర్దడం పూర్తవడానికి, కాస్త సర్దుకోడానికి!

'బతుకమ్మ' కవిత మరింత ప్రత్యేకమైనది. జీవితంలో ప్రధానమైన ముగ్గురమ్మలలో మొదటి ఇద్దరుగా తల్లిని, భార్యను ప్రతిపాదించి చివరిలో అకస్మాత్తుగా ఊహించని తెరతీస్తాడు కవి.

**"అమ్మ ఒళ్ళోకి ప్రశాంతంగా–**
**ప్రేయసి ఒళ్ళోకి నిశ్చలంగా ఇష్టంతో వెళ్ళినట్టుగా**
**ఆ అమ్మ ఒడిలోకీ నిర్వికారంగా వెళ్తాను.**
**ఎంతైనా మృత్యువు కూడా దేవత కదా!**
**ముగ్గురమ్మల మూలపుటమ్మ ఈ బతుకమ్మ".**

ఇక్కడ కాసేపాగి, ఇంతవరకూ మాకినీడి వెలువరించిన కవిత్వాన్ని అవలోకిస్తే i) సంఘటనాత్మక కవిత్వం ii) సామాజిక స్ఫూర్తి, ప్రపంచీకరణ వ్యతిరేక వాదం iii) అనుభూతివాదం iv) అనుభూతి, సామాజికతల మేళవింపు; ఇవి "ప్రకృతి గీసిన వికృత చిత్రం", "సెలవరోజు", "కలల పెదవుల నవ్వుల్లోకి", "తడి తడిగా ఆలోచించే" అనే నాలుగు వచన కవితా సంపుటులలో ప్రధాన స్రవంతులుగా తోస్తాయ్. అన్ని భావజాలాలనూ ఏకరీతిగా స్వీకరిస్తూ, సాహిత్యపరంగా సమదృష్టితో సాగుతూ ఎన్నెన్నో మైలురాళ్ళను దాటిన మాకినీడికి పై కవితా నిర్మాణంలో తన ఆరాధ్య గ్రంథమైన "ఒక యోగి ఆత్మకథ" తాలూకు తాత్త్వికముద్ర, మొదటి అడుగునుండీ నడిపిస్తున్న ఒకానొక 'మౌలిక ప్రేరణ" స్పష్టంగా కనిపిస్తుంది. ఇంతటి వైరాగ్యాన్ని వాక్యంలో ఇమిడ్చిన వీరి 'మహత్వ కవిత్వ పటుత్వ సంపద' పై మనసు పడేలా చేస్తుంది.

"loneliness and darkness just robbed me of my valuables" అంటాడు ఫ్రాయిడ్. చిత్రంగా, మాకినీడి దృష్టి కోణం వేరు. **"నాకు చీకటి, చీకటికి నేనూ తోడైనప్పుడు మూగిన భయాలు నాకు తోడుగా వచ్చాయా? చీకటికా? నాకు ఒంటరితనం ఒంటరితనానికి నేనూ తోడైనపుడు ముసిరిన ఆలోచనలు నాకు తోడుగా వచ్చాయా? ఒంటరితనానికా?"** – పైకి తెలియక అడుగుతున్నట్లున్నా, ఆ ఏకాంతం, చీకటితో సహవాసం చేసేటపుడు ఎదురైన భయాలు, ముసిరిన ఆలోచనలు (Negative thoughts) తనకోసం కాకుండా ఆ చీకటికోసం, ఒంటరితనంకోసం వచ్చాయి అని బదలాయిస్తారు తెలివిగా. మరోలా చూస్తే సృజన జరిపే క్షణాల్లో కవిని ఇవి ఏ మాత్రం ప్రభావితం చేయలేవు సరికదా, మరింత ఉత్ప్రేరకాలే అవుతాయ్.

ఓ ప్రశంసా పత్రం, ఓ జ్ఞాపిక, ఓ న్యూస్ క్లిప్పింగ్... ప్రతి కళాకారునికీ మొదటి దశలో ప్రేరణగా నిలవడం, ప్రోత్సాహం ఇవ్వడం సహజం. అయితే ఎత్తుకి ఎదిగినా వాటిని అంతే అపురూపంగా చూడడం ఉత్సుకతలోని పచ్చదనాన్ని వ్యక్తం చేస్తోంది. **"నా కవిత్వపు ఆనందమయ క్షణాల ఆనవాళ్ళు, జనాల నీరాజనాలు. మలిగిపోతున్న కర్తవ్యాన్ని తిరిగి గుర్తు చేసే తీపిగుర్తులు"** తనకు తాను దొరికిన క్షణాలకు గుర్తులుగా మాత్రమే కాదు, కర్తవ్య నిర్వహణకు ప్రేరకాలుగానూ అభివర్ణిస్తారు.

కవిత్వానికి సంబంధించని ఇతర విషయాలో రెండు మాట్లాడాలనుకుంటే, ఏ కవిత ఎపుడు ఎంతసేపట్లో తయారయిందనేది ఈ గ్రంథంలో మనకు లభించే అదనపు సమాచారం. కవిత ఎపుడు,ఎలా పుడుతుంది? లాంటి సందేహాలకు ఈ కాలాదులు మనకు ఓ అభిప్రాయాన్నిస్తాయి. అయితే ఇవన్నీ వీరికి, ఈ కోవకు చెందినవారికి మాత్రమే పరిమితం. పుస్తక ప్రారంభంలో "కొన్ని కవితల గురించి…." శీర్షికతో కవి చెప్పుకున్న విషయాలు మరికొన్ని అంశాలు వ్రాయకుండా/ అవసరం లేకుండా చేసాయ్.

తొలినాళ్ళలోనే నాగభైరవ వంటి కవులచే "పరిణత మనస్కతతో పసివాడి అన్వేషణ" అని ప్రశంసింపబడిన సూర్యభాస్కర్ కవిత, పరిణత వయస్సులోనూ ఆ పసితనపు మనోహరత్వాన్ని విడనాడలేదు. **"కవి కాళ్ళకి సాగిలపడాలనిపించే కవిత్వం చదూతున్నప్పుడు అదేమిటో తెలీదు, నన్ను నేను మరచి పోతుంటాను"** అని పేర్కొన్న మాకినీడి తన మూడోవంతు రోజుని చదవడానికి, రాయడానికి కేటాయించి, బతుకుతున్న కాలంలో నిజంగా జీవించే క్షణాల శాతాన్ని పెంచుకుంటున్న ధన్యజీవి.

ఇదే పరంపర ఇలాగే కొనసాగించి, మనం మర్చిపోయే క్షణాలను మనకి మరిన్ని అందించాలని ఆశిద్దాం.

***

**(ఆగష్ట్ - 2017 'నవ మల్లెతీగ' మాసపత్రికలో ప్రచురితం)**

# 7 అంతస్స్రవంతికి అక్షర రూపం ‘దోసిలిలో నది’.

"Happiness is a mysterious thing, to be found somewhere between too little and too much" - "A book of simple living" లో Ruskin bond ప్రతిపాదన. కేవలం శారీరక, మానసిక అంశాలకే కాకుండా హృదయగతమైన ఆనందాలకూ పై భావనను అన్వయించుకోవచ్చు. కవిత్వంలో తాను అర్థంచేసుకోవలసింది ఎంతో ఉన్నపుడు, లేదా ఏమీలేనప్పుడు పాఠకుడు కొంత నిరాసక్తత కనబరుస్తాడు. తాను కొంత చెబుతూ పాఠకునికి కొంత విడిచి పెట్టినపుడు మాత్రమే కవి విజయవంతంగా తన కవిత్వమంతా చదివించుకోగల్గుతాడు. నిజానికి, ఇది చదివేవాడి మేథను కవి గౌరవించడం కూడా. అయితే, ఈ పని అంత సులభమైనది కాదు.

పది కవితా సంపుటాలు వెలువరించిన శ్రీ దాట్ల దేవదానం రాజుగారికి ఈ మంత్రవిద్య అబ్బి ఎంతోకాలమైంది. కనుకనే, అంతులేని నదిని అలవోకగా తన దోసిలిలో నింపుకోగలిగారు. అది యథాతథంగా మన దోసిళ్ళలోకి ఒంపాలంటే వీలుకాదని కవిత్వపు రూపునిచ్చి, పుస్తకంచేసి పంచేసారు.

"**నిఘంటువుల్ని శోధించి సమస్త లోకాన్నీ వర్ణంగానో, అవర్ణంగానో చూడగలిగే పదాన్ని టకటకలాడే ఊతకర్రతో తడుముకుంటున్నాడు**" అంటూ అంధుల జీవితాన్ని ఆర్ద్రంగా ఆవిష్కృతం చేసి; కేవలం సమస్యల జాబితాగా కవితను ముగించకుండా సమకాలీన సమాజ ముఖచిత్రాన్ని "**ఇక్కడెంత ఆకుపచ్చతనముందో, ఇక్కడెంత సంస్కార జీవితముందో, ఇక్కడెన్ని తడి గుడ్డలు కత్తులవుతున్నాయో, ఇక్కడెన్ని బహిరంగ నేరాలున్నాయో ఎలా తెలిసేది**" అని పరిహసిస్తూ పరిచయం చేస్తారు. ఈ జనారణ్యపు రహదారిని దాటేందుకు కాళ్ళకు ఏ లేపనం పూయాలో అని వాపోతారు. ఇలా, రెండు నేపథ్యాలలో కవితను తుదివరకూ సమాంతరంగా నిర్వహించడం, మధ్యమధ్యలో మెరిపించిన పదచిత్రాలు... వెరసి కవితస్థాయిని పెంచి సంపుటిలో మొదటికవిత చదవగానే 'మంచి ప్రారంభం' అనిపిస్తారు.

కవిత్వంపట్ల కవిలో రూపుదిద్దుకున్న నిర్వచనాన్ని, తన సాహిత్య ప్రస్థానం పట్ల దృక్పథాన్ని సంపుటిలో ఒకటి రెండు కవితలలో ప్రతీకవీ అంతర్లీనంగా వ్యక్తీకరించడం జరుగుతుంది. ఈ వర్గీకరణకు చెందిన కవిత్వాన్ని 'మెటా పోయిట్రీ' అంటాం. "**వెన్నెల వెలుగుల్ని మంచి గంధంలా అరగదీసి, రంగరించి, తెలుగింటి ముగ్గులా బొటనవేలు, చూపుడువేలు సందున శబ్దమై జారితే కవిత్వమౌతుంది**" ఇది ప్రణాళిక. లేఖనానికీ కావలసింది ఈ రెండు వేళ్ళే. అందుకే ఎంపిక చేసుకున్న ప్రతీక వారి భావనను సమగ్రంగా ప్రతిఫలించగలిగింది. మరో కవితలో "**నన్ను నేను పాతుకుని కొత్త చిగురుల అక్షరాల్ని పదాలు చేసి కవిత్వంగా ఎగరేస్తాను**"; "**సృజన నా బలం, సొత్తు, నా పొగరూ దమ్మూ అక్షరాలే**" అని ప్రకటించుకున్నప్పుడు ఒకింత గర్వం తొణికిసలాడినా "**ఎదుగుదల అంటే అనుదిన వ్యాపకంగా విస్తరించడమే**" అనే వాక్యంలో వారి వినమ్రత వెల్లడవుతుంది.

రోజులో పగలే ముఖ్యమైనది, రాత్రి కేవలం విశ్రాంతికోసం ఉద్దేశింపబడినదనుకుంటాం కానీ, ఓ రాత్రి గడవాలంటే ఎన్నెన్ని భరించాలో, ఎన్ని పాత్రలు ధరించాలో కదా! అనిపిస్తుంది ఈ కవిత చదువుతూంటే – "**నల్లటి నిందలు, మండిన అసూయలు, రగలని ప్రతీకారాలు, మగతనిద్ర దోబూచులాటలు, ఛిద్రమైన కలనయ్యాను, దూరాలు మరింత పెరిగిన అమిత్రత్వ సందోహాలు, ఆదిమ గాథల తవ్వకాలు**". ఇక్కడ, అసూయలు మండినా ప్రతీకారాలు రగలకపోవడం కవి

సౌమనస్యానికి చిహ్నం. గతకాలపు తలబోతను ఆదిమ గాథలతవ్వకాలు అనడం చేయితిరిగిన కవిత్వం.

సాధారణంగా వ్యక్తి తాను ఎంచుకొని ఎదుగుతున్న రంగంలో అసూయా ద్వేషాలకు తొలిదశలో కొంత వేదన పొందుతాడు. ఆ పరిధి దాటే పరిణతి సాధించినపుడు వేటినీ లక్ష్యపెట్టక ముందుకు సాగిపోతాడు. ఈ నేపథ్యంలో వారి అనుభవమో, పరిశీలనో తెలియదు కానీ **"వాడేదో కొన్ని మెలకువల్ని పోగేసుకుని నిమ్మళంగా వెలుగులు పూయించుకుంటున్నాడు. కొన్ని సామర్థ్యాలను వెలికితీసి బహు జాగ్రత్తగా అందల మెక్కుతున్నాడు. తెల తెల్లని చూపులతో వాడి ఉన్నతిని కాంక్షిద్దాం"** అంటారు 'సహృదయత' కవితలో. **"నువ్వు ఎదుగుతావు, నీ చుట్టూ కొంతమేర చిట్లిన చూపులు కళ్ళు చికిలిస్తాయి రెప్పల్ని సాగదీస్తాయి"** అంటూ అసూయాగ్రస్తుల వేషాలను వివరిస్తారు – 'ఈ జబ్బుకు మందేది'లో. 'నిమ్మళంగా' వంటి జనబాహుళ్యంలోని పదాలు రాజు గారి కవితలో ఎంత ప్రేమగా ఒదిగిపోయాయో!

ఒక్కోసారి సామాన్యభావం అభివ్యక్తి వలన అపురూపవాక్యమై ఆశ్చర్యపరుస్తుంది. ఉదాహరణకు, ప్రభుత్వం ఇచ్చిన హామీలకోసం ఆశగా ఎదురుచూస్తున్న రైతన్నలనుద్దేసించి, అడగక పోయినా వరమిచ్చి ఇపుడు మాటకీ చేతకీ మధ్య వంతెన కడుతున్న నాయకుణ్ణి – **"కనీసం ఒక సుదీర్ఘ నిరీక్షణను సగం చెయ్యమని అడగడం తప్ప నేనేం చెయ్యగలను?"** అని ప్రశ్నిస్తారు. కవితంతా ఒక ఎత్తైతే, సుదీర్ఘ నిరీక్షణను సగం చెయ్యమని అనే పదబంధం ఎంత అరుదైన నిర్మాణమో! మరోచోట పదవీ విరమణను **"పటమేదో సగంలోనే ఆగినట్లు"** అని వయస్సు చేసిన అల్లరికి గొంతు మూగబోయింది అంటారు – ఉపాధ్యాయునిగా ముగిసిన అధ్యాయాన్ని తలచి. ఇలా చాలాచోట్ల మనల్ని ఒక్కసారి ఆపి మరోసారి చదివించుకుంటారు.

ఇన్ని జీవిత పార్శ్వాలను కవిత్వీకరించినా తుది గమ్యమేమిటనే ఓ తాత్త్విక భావన ఎల్లపుడూ వెంటాడుతూనే ఉంటుంది. ఏదో ఒక సన్నివేశం ఇదంతా అశాశ్వతమని గుర్తుచేస్తుంది. అందుకే కవి **"ఈ వెలుగులూ, ఈ వెంపర్లాటలూ, ఈ చైతన్యమూ ఈ ప్రవాహ క్షణాలూ అన్నీ ఒక చోట ఆగిపోయి, భావ ప్రసారాలు**

**ఛిద్రమై తీరాన ఎక్కడో కీర్తిని వేలాడదీసి ఉన్నట్టుండి మూగబోవటం ఏమిటో? దగ్ధమై బూడిదవ్వడం ఏమిటో"** అంటారు – ఒకింత వైరాగ్యంగా. అయితే **"తీరాన ఎక్కడో కీర్తిని వేలాడదీసి"** అనడం ద్వారా ఆ తుది సన్నివేశానికి ముందే బ్రతుకు ఫలవంతం చేసుకోవలసిన అవసరాన్ని గుర్తుచేస్తారు.

"ఒక ఏకాంతపు ఊహ" కవితలో ప్రేయసిలేని వేళ ఆమె ప్రభావాన్ని స్ఫురణకు తెచ్చుకుంటూ **"నీవు తాకిన ప్రతి వస్తువు ఒకానొక మోహపు కాంతితో తళతళ మెరుస్తుంది"** అంటారు. ఇక్కడ కవి కాంతిని వర్ణించడానికి ఏ ఇతరమైన ఉపమానాల్నీ వాడుకోకుండా "ఒకానొక" అనే అనిర్ధారిత భావాన్ని నిక్షిప్తం చేయడం ప్రశంసనీయం.

మనిషి ఆనందానికి అవసరమైన సరంజామా ఏమిటో పూర్తి అవగాహన గల వ్యక్తి శ్రీ దాట్ల. అందుకే తన హాయికి, ఉత్సాహానికి, ఆర్ద్రమైన మనసుకు వెనుక అసలు రహస్యాన్ని చెప్పేస్తారీ గ్రంథంలో – **"హాయిగా ఉంది, చెంత చెట్టుఉంది; ఉత్సాహంగా ఉంది, చేత పుస్తకం ఉంది; మనసు తడిగా ఉంది, చేరువ నది ఉంది".** కవిగా, రచయితగా, వ్యాసకర్తగా శాఖోపశాఖలుగా విస్తరించిన చెట్టంత సాహితీవేత్త మన మనసులు తడి చేసేందుకు చేతనుంచిన పుస్తకం ఈ "దోసిలిలో నది" స్నానం చెయ్యాలో..., పానం చెయ్యాలో... మన ఓపిక.

**(జూన్ - 2016 'విశాలాక్షి' మాసపత్రికలో ప్రచురితం)**

# 8 మధు రథ యానం

శ్రీ మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి –

పద్యాన్నీ, గద్యాన్నీ సమరీతిలో నడిపిన సమర్థత;

చరిత్రను కావ్యేతివృత్తంగా స్వీకరించిన సాహసం;

కవికి శీలము, కవితకు శైలి ముఖ్యమని సిద్ధాంతీకరించి కవనాన, జీవనాన ఆచరించి చూపిన ఋషిత్వం;

ఈ నేలను పరిమళింపజేసిన తెలుగువారి చరిత్ర కావ్యంగా వ్రాయడం ఘనతగా కాక సామాజిక బాధ్యతగా భావించగల ఔన్నత్యం;

అనేక అవరోధాల నడుమ ఆదర్శ పత్రికగా 'ఆంధ్రి' సంపాదకత్వం –

నా మాటలెందుకు – **"అతడు రాసులు వోసె సర్వాంధ్ర జాతి కారగింపుగ రసమయంబైన యాస్తి".**

***

**"మానవ జీవితమ్ము మేలైన కబ్బ, మందు**

**సత్కవి యేరిన బిందు వొకటి**

**యొక మహా కావ్యమౌ, నది సుకవి జాలు**

**కావ్యతా సిద్ధి కొక్క శ్లోకమ్మె చాలు"** అని ప్రకటించిన శ్రీ సత్యనారాయణ శాస్త్రి సుదీర్ఘ సాహితీ ప్రస్థానంలో, వారి చేయి తగిలిన ప్రత్యక్షరము కావ్యతాసిద్ధికి వాదోడుగా నిలిచింది. సతత సాహిత్య ఉపాసన వారిది, ఉపాయనం మనది.

***

**"ఈ నోటం బలికించు మాటలివి నీవే, పాటలున్నీవే తం**

**డ్రీ! నా గీసిన యక్షరాక్షరము నీవే నాకు బ్రత్యక్ష వి**

**జ్ఞాన జ్యోతివి నీవ తత్త్వమున"** అని ఆంధ్ర పురాణం అవతారికలో, వారి తండ్రి భిషగ్రత్న శ్రీ మధునాపంతుల సత్యనారాయణమూర్తి పట్ల గల భక్తి ప్రపత్తులతో, తన విజ్ఞాన సర్వస్వమూ తండ్రి వేసిన భిక్షగా భావన చేస్తూ వారి కృతిని అంగీకరించమని అర్థిస్తారు.

**"మరల నా తోడ పసి ఈడు తిరగ దోడి**

**యాడె జత గూడె నక్షరాభ్యసన మెనసె**

**శబ్ద మంజరి పట్టె శాస్త్రమ్ము ముట్టె**

**గవిగ దీవించె దన గొంతు కలిపి పంచె"** – ఒక్కో దశలో ఒక్కొక్క రీతిగా వేలుపెట్టి నడిపించినది, వెన్నుతట్టి ప్రోత్సహించినది, వేలు చూపి సూచన చేసినది... అంతా నాన్నేనని గుర్తెరిగి జీవిస్తూ, మనసా, వాచా, కర్మణా తన ప్రతిభంతా "పిత్రార్జితమే" అని, తనను తాను నిమిత్తమాత్రునిగా అంగీకరించగలగడం ద్వారా శాస్త్రిగారు "ఆనృణ్యము" చేసుకున్నట్లే (కృతి సమర్పణ గౌరవమునకు ఆనృణ్యము చేసుకొనుట ఎట్లో – అని ఓ సందర్భంలో శాస్త్రిగారి ప్రయోగం)

***

మట్టి పట్ల మమకారం మధునాపంతుల వారి సాహిత్యంలో మరో సుగంధం.

**"ఇతర క్షోణిని లక్షలిచ్చినను గానీ పుట్ట నీ భారత**

**క్షితి పై వేద పురాణ శాస్త్ర కృతి రాసి స్థానమీ మంగళ**

**క్షితిపై గర్భ దరిద్రునింట నయినన్ క్షేమంబుగా బుట్టి సు**
**వ్రతినై సాగెదనన్న భావమది దీవ్యజ్జీవ సంస్కారమౌ (సంస్కారంబుగా)"**

– కేళాకుళిలోని ఈ పద్యంలో భారత క్షితి ఘనతను వర్ణించడం; అంతటి సంపదకు వారసునిగా ప్రకటించుకొనటంతో సరిపుచ్చుకోక, "సువ్రతినై" సాగెదననడంలో కవి వ్యక్తిత్వం వ్యక్తమవుతుంది. పరం పరానుగతమైన భారతధాత్రి వైభవ స్మరణతో పాటు కృతజ్ఞతతో కవి మాతృభూమికి చేసిన "ప్రతిజ్ఞ" గా చివరిపాదం కనిపిస్తుంది.

***

**"అసమానంబగు పాండితీ విభవ మీ వార్జించి మా కెల్ల సం**
**తసముం గూర్చుచు సత్కవీశ్వరత నౌన్నత్యంబునుం గీర్తియున్**
**వసుధం బెంపు వహింప వర్ధిల గదే వత్సా! చిరంజీవివై**
**పసివానిన్ నిను గూర్చి పెక్కు పలుకన్ భావ్యంబె మా బోంట్లకున్"** అని

11-03-1933న 13వ ఏటనే శతావధాని ఓలేటి వేంకట రామశాస్త్రి గారి ఆశీః పూర్వక అభినందనలందుకున్న శాస్త్రిగారు తదనంతర కాలంలోనూ ఆ దీవెనకు భంగం రానీయలేదు. 'బాల సరస్వతి' అనే బిరుదానికి (శ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిచే) పరిమితమవకుండా "కళాప్రపూర్ణ"యై; తనని కన్నవారిని, ఉన్న ఊరిని ఈ తరంలో మనం స్మరించుకునేంతటి ఖ్యాతినొందారు. ఆ సమగ్ర సాహితీ మూర్తిమత్వానికి ఉదాహరణయే విశ్వనాథ వారి ఈ ప్రశంస:

**"ఒక్కటి యున్నచో నింకొకటి యుండదు నేటి కవీంద్రు లందు నీ**
**దృక్కవులందుసర్వ మమరించును దైవము పాండితీ పరి**
**స్ఫృక్కమనీయ ధారయువరిష్టముగా లలితత్వమున్ గడున్**
**పెక్కువ గాగ నుండిన కవి ప్రభు వీయన యంచు చెప్పెదన్".**

***

వీరికి (సూర్యారాయాంధ్ర) నిఘంటు కార్యాలయం పాండిత్యం అందిస్తే, కుటుంబ వాసన కవితా వ్యాసంగం చేకూర్చింది అని అసలు రహస్యాన్ని హనుమచ్ఛాస్త్రిగారు చెప్పేసినా, చమత్కారం విశేషించి చెప్పదగ్గ సత్యనారాయణ శాస్త్రిగారి మరో లక్షణం.

"మధురథ ప్రస్థానం" ముందుమాటలో ప్రముఖ పాత్రికేయులు శ్రీ పొత్తూరి వేంకటేశ్వరరావుగారు ఓ సందర్భాన్ని మనతో పంచుకుంటారు - రాజమహేంద్రవరంలో వారు నివాసముంటున్న వీథికి మధునాపంతుల వారి పేరు పెట్టారుట. వేంకటేశ్వరరావుగారు వీరిని కలవడానికివచ్చినపుడు **"నన్ను వీథికెక్కించారు, గమనించారా?"** అన్నారట సత్యనారాయణ గారు.

పల్లిపాలెంలో ఓసారి సత్కారం ముగిసాక ఫోటోగ్రాఫర్ "గురువు గారూ! ప్రత్యేకంగా ఎక్కడైనా నించోండి, మంచి ఫోటో తీస్తాను" అని అడిగితే, **"గడ్డిమేటి దగ్గర బావుంటుంది. అపుడు ఫొటో ప్రక్కన మేటికవి అని వ్రాసుకోవచ్చు"** - ఇదీ శాస్త్రిగారి సరసత.

మరోసారి, సన్మానం తరువాత వారి స్పందన తెలియజేయమంటే, **"నన్ను కూర్చోబెట్టి నలుగురూ నాలుగు మాటలంటుంటే నాకేదోలా ఉంటుంది"** అన్నార్ట.

ఓసారి కలవడానికి వచ్చిన వారితో అన్నమాట - **"వృద్ధాప్యంలో రెండే సాయంగా ఉంటాయ్ - ఒకటి కోడలు, రెండు గోడలు"** చమత్కారమే అనుకుంటాం కానీ, ఆలోచిస్తే - ఒక పరిణతి పొందిన జీవన తాత్త్వికత నిండిన, సత్య దూరం కాని హాస్య సంభాషణ అంత సులభం కాదు.

***

**"ఏమో! ఈ కృతియంత శాశ్వతమటోయీ! యందురా, కాదు కా**
**నీ, మాధుర్య ధురీణ కావ్యరచనా నిత్యోత్సవ శ్రీ కళా**
**ధాముల్ నూర్వురు పెంచు నీ యమృత గాథా జ్యోతు లీనాటితో**
**నే, మిన్నందియు వట్టి 'మందకొడు'లౌనే! యెట్టులూహించినన్"** - అని సవినయంగానే ఆంధ్ర రచయితలు కావ్య ఘనతను తెలియజెపుతూ తాతయ్యా, కొనుమయ్యా అంటూ వారి మాతామహులు శ్రీ ఆకొండి రామమూర్తిగారికి కృతి సమర్పణ చేశారు.

**"సాగిన జీవితంబు, చెయి చాపని భావము; కీర్తి లిప్సకున్**
**లోగమి - రాగ నిస్పృహత - లోకము దాటినచూపు -నిన్నిటం**

**దాగిన కోవిదుండవగు త్వత్కవితా గజగర్భ పద్ధతిం**

**దోగినవాడ నీ నిసువు దోయిట బోయుము పండు దీవనల్**"– పద్యంలో "లోకము దాటిన చూపు" కాసేపు ముందుకు వెళ్ళనివ్వకుండా ఆపింది. "పెంజీకటి కవ్వల నెవ్వడు" అనే పోతన స్థాయి భావనాపటిమ శాస్త్రిగారి సొంతం.

***

వేలూరి శివరామ శాస్త్రి గారికి పీఠిక వ్రాయమని తన 'వసుంధర' విషాదాంత కథా కావ్యం పంపారు మధునాపంతుల వారు. వేలూరి వారు కొన్ని దోషాలను చూపారు. **"తమరు సూచించినట్లు ప్రయోగములను బట్టి కొన్ని సమర్థనీయములు గలవు, కాక, అంత సమర్థించుకొనుట ఏల? సవరించిన దీరిపోవును"** – అని బదులివ్వగల వినమ్రత సత్యనారాయణ శాస్త్రి గారి సహజాలంకారం. ఇదే సమకాలికులైన ప్రఖ్యాత సాహితీ వేత్తల నుండి సైతం ప్రత్యేక గౌరవాన్ని పొందేట్టు చేసింది.

**"పొలిమేరలు మీరి పోకుండా కలము కదిలించు నేర్పు"** అన్న శ్రీ గడియారము వేంకట శేషశాస్త్రి మాట ప్రత్యేకం. భావ జగత్తులో విహరిస్తున్నపుడు నియంత్రణ ఎంత అవసరమో కదా! కవనాశ్వాన్ని ఎంతగా పరుగులు పెట్టిస్తున్నా కళ్ళెం చేతిలోనే ఉంచుకోవడం అందరికీ అబ్బే విద్య కాదు.

**"అడుగడుగునా ఆహా అనిపించే గడుసు పద ప్రయోగాలతో గారడీ చేసే విద్య కొందరికే వచ్చు. అందులో మీరు ఒకరు; ఇపుడు ఒక్కరే! ప్రాచీన సాహిత్య శిల్పం పెట్టుబడి. మీ విన్నాణం దానిపై వృద్ధి, అభివృద్ధి"** – అంటారు వీరి చైత్రరథం చదివాక ఆరుద్ర. మనకూ అచ్చం అలాగే అనిపిస్తుంది ఇలాంటివి చదివాక.

**"గాజు కన్నైన నొక యశ్రు కణము రాల్చు"**

**"విత్తు విసిరిన బంగారు గుత్తులొసగు" ...**

***

కేవలం, గ్రంథరచనా సమయంలోనే కాదు, ఆశువుగా చెప్పిన ఆశీర్వాద పద్యాలలోనూ విన్యాసం మంత్రముగ్ధులను చేస్తుంది. ఓలేటి వేంకట రామశాస్త్రిగారి

మనుమడు సత్యనారాయణమూర్తి కాకినాడలో ఇల్లు కట్టుకుని దానికి "కవితా విలాసం" అని పేరు పెట్టుకున్నారు. నిజానికి, పిఠాపురం సంస్థానంలో వారి తాతగారి ఇంటి పేరు కవితావిలాసం. అందుకే శాస్త్రి గారు

**"పరమ రసోజ్జ్వలత్కవన పద్ధతిలో అవధాన రీతిలో**
**ఒరవడి పెట్టినట్టిగురు ఓలేటి వేంకట రామశాస్త్రి కా**
**పురమగు పీఠికాపురిని పూర్వ మహీపతి వెల్గులేమి ఇ**
**త్తెరగున కొత్త యూరి కరుదెంచితివా కవితా విలాసమా"** అని ఇంటిని సంబోధిస్తూ దాని ప్రాభవాన్ని జ్ఞప్తికి తెచ్చుకున్నార్ట. వారసులు వ్రాసి, దాచి, ప్రాచుర్యం కల్పించకపోతే, ఓ మంచి పద్యం అచుంబితంగా మిగిలిపోయేది.

**"ఛందో మర్యాదతో ఉన్న కవిత్వమే స్థిర ప్రయోజనం సాధించగలది"** అని మనసారా నమ్మిన శాస్త్రిగారు **"మెరుపులతో, చమత్కారాలతో, కొన్ని అనుభూతులతో ఉండి సృజనాత్మకత ఉండే వచన కవిత్వం వస్తే చూడకుండా, చదవకుండా మూసేసుకోను కదా!"** అని తన సమదర్శనాన్ని చాటుతూనే వచన కవితకుండాల్సిన లక్షణాలను నర్మగర్భంగా సూచన చేశారు. మరో వ్యాసంలో గద్యము, పద్యము రెండూ జ్యోతిష్మంతములైన ఆంధ్ర సారస్వత మహాపురుషుని లోచనాలన్నారు.

***

**"ఆంధ్రి" పత్రిక :**

సృజన, పరిశోధన ఈ రెంటితోనే రెండు జీవితాలకు సరిపడా సాహిత్యసేవ చేసిన శాస్త్రిగారు అంతటితో సంతృప్తిని పొందలేదు. అదే ఆంధ్రుల పాలిట వరమై, "ఆంధ్రి" పత్రికగా అవతరించింది. మూడేళ్ల ప్రయాణంలో ముప్పై ఆరు సంచికల సాహిత్య వరివస్యను, అనితర సాధ్య విశేషాలను కొన్ని ముచ్చటించుకుందాం:

* కేవలం ప్రచురణకే పరిమితం కాకుండా వ్యాసం/ కవిత్వంలోని సౌందర్యాన్ని సంపాదకుడు తెలియజేసేవారు. దీనిద్వారా కవికి రెండింతల సంతృప్తి లభిస్తుంది ఇటు పాఠకుడూ భావాన్ని పరిపూర్ణంగా గ్రహించడమే కాక వ్యాకరణపరమైన విజ్ఞానాన్ని పొందుతాడు.

*	ప్రచురించిన ప్రతి అంశం పట్ల సంపాదక వర్గం పూర్తిగా సంతృప్తిని పొందినట్లు కాదు. మరింత గుణాత్మకం కావడానికి అవసరమైన సూచనలనూ అందజేసేవారు.

**ఉదా:** కృత్తివాస తీర్థులు వ్రాసిన 'సూఫీ కవిత్వము' అనే వ్యాసంపై సంపాదకుల సూచన ఇది **"ఈ వ్యాసము పారశీక కవులైన సూఫీల కవిత్వము గురించి కొంత పరిచయం గలుగజేయుచున్నది. ఆంగ్ల భాషా పరిచయం లేని 'యాంధ్రీ' పాఠకులకు గూడ అర్థమగునట్లు రసోద్గారములు, ఉదాత్త రమణీయములైన ఇంగ్లీషు పద్యముల భావమును సైతం పరిశుద్ధమైన భాషలో బ్రస్ఫుటీకరించినచో బాగుగానుండెడిది."**

*	**"పద్యములు సరసముగాను బ్రౌఢముగాను నున్నవి. మొదటి పాదము నందలి యఖండ యతి మాటకేమి గానీ 3 వ పద్యమున 'రాజ సౌరభము' చింత్యము. 'రజ స్సౌరభము' గాదా?"** – 'ప్రభు పదములు' శీర్షికన బులుసు వేంకటేశ్వరులు వ్రాసిన పద్యాలపై విశ్లేషణ ఇది. ఇలాంటి సూచనలు కవి భవిష్యత్‌కు ఎంతగానో ఉపకరిస్తాయి.

*	మరోచోట, గుంటుపల్లి వేంకటేశ్వరరావుగారి 'బిచ్చగాడు' పద్యాలను ప్రచురించి – అర్థానుస్వారాలు, విసంధుల ఉపయోగంలో లోపాలను చూపుతూ – **"ఇట్టి లక్షణ విషయములు గమనించుకొనుచు పద్య కవిత్వ పరిశ్రమమొనరించి ఈ వ్యాస కర్త ఆంధ్రినలంకరించుచుండు గాక"** అని ప్రోత్సహిస్తారు.

పత్రికతో పాటు ఇతర ప్రచురణలనూ ఆంధ్రి చేపట్టింది. ఆ గ్రంథాలకు ప్రాచుర్యం కలిగించే వేదికగా పత్రిక వినియోగింపబడింది. ఇతర మాధ్యమాలు లేని ఆ కాలంలో వెలువడుతున్న గ్రంథాల గురించి తెలియజెప్పే బాధ్యతనూ ఆంధ్రీ ప్రశంసనీయంగా నిర్వహించింది.

ఇక, సుప్రసిద్ధమై, సత్యనారాయణ శాస్త్రిగారికి అపరిమిత కీర్తినందజేసిన "ఆంధ్ర రచయితలు" గ్రంథం నిర్మాణ దశ నుండీ "ఆంధ్ర రచయితలు – రచయిత?" అనే ఒక పూర్తి పేజీ ప్రచురించి ఉత్సుకత రేకెత్తించారు.

కొత్త పుస్తకాలను "అందికోలు" పేరిట క్లుప్తంగా పరిచయం చేసి " కాల క్రమమున వీనిపై మా సమీక్షలు ప్రకటింపబడును" అని తెలియజేసేవారు. అందువల్ల ఆయా రచయితలు, వారి అభిమానులు కొన్ని నెలలపాటు ఆసక్తిగా ఎదురు చూసేవార్ట.

"ఇలా 1939 జనవరి సంచికతో ఓలేటి వేంకట రామశాస్త్రిగారు సర్వాధ్యక్షులుగా, మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి గారు సంపాదకులుగా, విద్వాన్ పాలెపు వెంకట రత్నం గారు సహాయ సంపాదకులుగా ప్రారంభమైన ఆంధ్రి, ప్రతి సంచికకు చందాదారులను, తన ప్రాభవాన్ని పెంచుకున్నా; రెండవ ప్రపంచ యుద్ధం, తదనంతర పరిణామాలు, కాగితం కరువు, పత్రికను ఉచితంగా ముద్రించే పిఠాపురం "విద్వజ్జన మనోరంజనీ ముద్రాక్షరశాల" మూతపడటంతో నిలిచిపోయింది.

***

**"తీయనికైత తోడ,**
**గడి దేరిన పాండితి తోడ,**
**నాంధ్ర రాష్ట్రీయ వికాసమున్ వలచు డెందము తోడ,**
**నపార శౌచ లక్ష్మీయుత జీవన ప్రవణ శీలము తోడ"** వెలిగి కవిగా, విమర్శకునిగా, పత్రికా సంపాదకునిగా త్రిమితీయంగా యశశ్చంద్రికలు ప్రసరించిన వాగ్యోగవేత్త శ్రీ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి.

***

**(ది. 05.11.2017న సాహితీ స్రవంతి, కాకినాడ సభలో ప్రసంగం.)**

# 9 నల్ల కలువల సౌకుమార్యం, నక్షత్రాంతర్గత విస్ఫోటనం

"Poetry is painting without form, painting is poetry with form" – ఇది కవిత్వ, చిత్రలేఖనాలను గురించి Kuo Hsi తులనాత్మక నిర్వచనం. మనోవీథిలో నడయాడే భావాలను శాశ్వతంగా మలచేందుకు ఓ కాగితం దొరికితే అటు ఆకృతినిచ్చి రంగులద్దాలా? లేక అక్షరాలుగా రూపుదిద్దాలా? అనే సంశయంతో సంఘర్షణ పడే అదృష్టం కొందరికే ఉంటుంది. అటువంటి తీయనివేదన పొందగల భాగ్యశాలి శ్రీ ఎస్.వి. రామశాస్త్రి. "శరీరానికి ఆత్మ ఎలాగో, ప్రజలకు కళాకారులు అలాగ" – గాబ్రియేలా మిస్ట్రాల్ మాటలు గుర్తుచేసుకుంటే ఇలాంటి కవి–చిత్రకారులు నిస్సందేహంగా సమాజానికి రెండింతల సేవచేస్తున్న ధన్యజీవులు.

కాసేపు, కవిగా వీరి ఒక పార్శ్వాన్నే పరికిస్తే, **"శుభాకాంక్షలు తెలుపుతూ పాపాయి ఇచ్చిన నందివర్ధనం పువ్వులో పరిమళాన్ని ఆఘ్రాణించగల"** భావుకుడు. **"పువ్వులే కాదు పిల్లల నవ్వులూ పరిమళిస్తాయని"** తన అనుభూతుల సాక్షిగా నిరూపించగల మాటకారి. తన తల్లిని, తన పాపను అన్నిటా సరిపోల్చుకొని, అద్వైత స్థితిని పొందగల యోగి. **"గమనించవు గానీ కలల తలుపులు తీసి చూడు, విజయం నీ గుమ్మం ముందు పడిగాపులు కాస్తోంది. స రి గ ప ద అనుకుంటూ మరోసారి స్వర పరుచు"** అని సౌమ్యంగా స్ఫూర్తినందించగల సరళ గంభీర చైతన్యశీలి. **"ఒక చేత్తో నిప్పులగిన్నె మరో చేతిలో నెమలీకల విసన కర్ర మోస్తూ, నాల్గు దిక్కులూ అల్లుకునే పరిమళ పాటను అందిస్తూ ఖుదా సదా కాపాడాలనే సాహెబ్"** ఆకాంక్షను మంగళాశాసనంగా స్వీకరించగల సమైక్యతావాది. రమణీయత నిండిన రెండు సంపుటాల కవితోత్పత్తి జరిగినా "సప్తవర్ణ స్వప్నాల నిరంతర ప్రవాహంలో" తాను దర్శించినది పూర్ణమా... భాగమా... అనే నిరంతర మూల్యాంకనం మరిన్ని కవితలు రాయించి మరో పుస్తకాన్ని మన ముందుంచింది. అవే ఈ "నల్ల కలువలు.. నక్షత్రాలు".

***

తనను తాను తెలుసుకోవడమే అభ్యసనలో తొలిమెట్టు. వేల ఏండ్లకు పూర్వమే "లోపలికి చూసుకోగలిగిన" మనిషి పరిణతికి నిదర్శనంగా Temple of Apollo at Delphi పై "know thyself" అని చెక్కబడింది. అయితే, తాను సృష్టిలో ప్రత్యేకమనీ, భౌతికంగా ఇతర వ్యక్తులతో సారూప్యం ఉన్నా మానసికశక్తుల పరంగా ఇతరుల కంటే ఏదో అంశంలో కాస్త ముందు వరుసలో ఉండగలవాడినని చాలా సమయాల్లో మరిచిపోతాడు. ఇదంతా ఒక అమాయక బాల్యచేష్టతో సంవిధానం చేస్తూ ముగింపులో బరువైన తత్త్వాన్ని నిక్షిప్తం చేస్తారు ఓ కవితలో. **"రెండు చేతుల్లో చిన్ని ముఖాన్ని దాచుకొని నేనెవరు చెప్పు అంటుంది చిన్నారి. తెలియదురా మరి అంటే, నేనే అంటుంది. 'నేను' ఓడి పాప గెలిచినందుకు, నేను ఎవరో చెప్పినందుకు ఆనందంలో ఉన్నాను"** – యోగ వాశిష్టాన్ని, రమణ మహర్షి తపః శోధనను కొన్ని పదుల పదాలలో బంధించి అందించిన ఈ కవితలో పరిశీలిస్తే – ఇక్కడ 'నేను' అంటే కేవలం 'నేను మాత్రమే' అని చెప్పకనే చెప్పడం. ఈ 'వైశిష్ట్యం' విస్మృతిని పొంది, సృష్టిలో కోటానుకోట్ల 'నేను'లు ఒకేలా జీవిస్తున్నాయి. కవి యథాతథ భావన

ఇది అయినా కాక పోయినా – యద్భావం తద్భవతి.

కృతజ్ఞతా వాక్యాలను కృత్రిమంగాకాక గుండెతడిలో ముంచి ఆర్ద్రంగా అల్లడం వీరి 'ససంకల్పిత మమకార చర్య'గా తోస్తుంది. అనురాగ సరాగాల్నే కాక, భీకర స్వరాల్ని ఆలాపించగల స్త్రీ గాత్ర వైవిధ్యాన్ని తలుస్తూ, అంతరంగంలో మౌనముద్ర మాటున బడబాగ్నులను దాచిన ఆమె సహనశీలతను కొలుస్తూ **"ఆమె ముందు మనమెపుడూ మోకరిల్లే ఇసుక రేణువులమే"** అంటూ నారీ లోకానికి సవినయ సాధువాదాలర్పించడం; ప్రజాకవి డా. అద్దేపల్లికి గ్రంథాన్ని అంకితమిస్తూ **"ఊరూరా ప్రయాణించే ఓ మోహన రూపం"**గా వారి నిరంతర పర్యటనా చైతన్యాన్ని కవిత్వీకరించడం; **"నాపరాళ్ళ ఊరిలో ఎన్ని సున్నిత హృదయాలో"** అని 'తాండూరు' వాసులపై ఆపేక్షను ప్రకటించడం ఇందుకు కొన్ని ఉదాహరణలు.

ఎదురుచూసిన మనిషి చేరువైనపుడు ఎన్నెన్నో మాటలు పంచుకుందా మనుకుంటాం. కానీ చాలా సేపు మౌనమే భాషగా మారుతుంది. మెల్లగా కాసేపటికి, మనసు మాటలై పురివిప్పి ఆనందనర్తనం చేస్తుంది. **"ఏమున్నాయ్ చెప్పుకోడానికి – అంటూ సాగదీస్తాం గానీ కొద్దిసేపు ఆగితే ఏమైందంటే అంటూ మొదలుపెడతాం. ఎంత బోర్లించినా హృదయం ఒక అక్షయ పాత్రగా మారుతుంది. ఎంత తోడినా మనిషి ఒక తడి ఆరని మాటల ఊటబావి అవుతాడు".** అయితే కవి విషయంలో ఆ యిద్దరిలో మరొకరు వ్యక్తే కానక్కర లేదు. కాన్వాసో, కాగితమో ఆ పాత్ర పోషణ చేసి వర్ణాలను ఒంపుకొనో, వాక్యాలను నింపుకొనో వారి హృదయాన్ని బోర్లిస్తుంది. ఇంకేముంది. అది అక్షయ పాత్రకదా! అక్షరాలు బోర్లించిన ప్రతిసారీ కవితా 'పంక్తి భోజనమే'.

మూడు కవితా సంపుటాలలో వందకుపైగా కవితలల్లిన శ్రీ రామశాస్త్రి దాని వెనుక పరిశ్రమను అత్యంత మనోహరంగా వర్ణిస్తారిలా – **"నిండారా తలస్నానం చేసిన ప్రేయసి వెనుక చేరి పిడప వొదులు చేసినంత సులువుగా ఆ కురుల జలపాతాన్ని ఎలా ఒడిసి పట్టుకోవాలో ఇంకా తెలియదు. కలలో చూసిన కవితా పంక్తులు మెలకువలో కాగితంపై పెడతానా ఎంత శ్రమించినా అర్థం కాని చిన్ని వెలితి అంతం కాదు. ఎప్పటికప్పుడు ప్రయత్నం చేస్తూనే ఉన్నా. ముగింపు వాక్యం ఎలా వ్రాయాలో**

**తెలియక ప్రారంభిస్తూనే ఉన్నా".** అయితే పిడప ఒదులు చేసిన తరువాత వీరికి చేతకాకపోతే మాత్రం కవితాప్రేయసి ఊరుకుంటుందా? అందమైన కవితయ్యేదాక అడుగులు ఆపనీయదు.

కొన్ని సార్లు కావాలని రాసినట్లు, మరికొన్ని సార్లు  కవిత్వమే తనకు కావలసిన రీతిలో కలంపట్టి దిద్దించినట్టు;  కొంత మూర్తంగా, మరికొంత అమూర్తంగా; కొంత సంక్షిప్తంగా, కొంత సమగ్రంగా ... ఇలా సౌందర్యం, సంఘర్షణల అపురూప మేళవింపు వీరి కవిత్వం. అందుకే, తెరిచిన ప్రతిసారీ  నల్ల కలువల సౌకుమార్యం, నక్షత్రాంతర్గత విస్ఫోటనం ప్రక్క ప్రక్కనే పలుకరిస్తాయి.

***

**(ఏప్రిల్ - 2016 'చినుకు' మాసపత్రికలో ప్రచురితం)**

# 10 ఆవేదనకు అక్షరానువాదం - డా. కత్తిమండ కవిత్వం

వ్యక్తి ఏ విషయాల గురించి ఆలోచిస్తాడు? ఎలా ఆలోచిస్తాడు? వాటి ఫలితాలేమిటి? అనే అంశాల ఆధారంగా తన Structural model of intellect ని ప్రతిపాదిస్తాడు గిల్‌ఫర్డ్. ప్రజ్ఞంటే ఏదో కొన్ని కారకాల ఫలితం కాదని అనేక విషయాలు (Contents), ఉత్పన్నాలు (Products), ప్రచాలకాలు (Operations) – వీటి పరస్పరచర్య అని ఇతని సిద్ధాంతం. ప్రజ్ఞలో సుమారు నూట యాభై కారకాల ప్రభావం ఉంటుందని మనో వైజ్ఞానికవేత్తల అంచనా. అయితే, కవితా సంపుటి సమీక్ష అని ఈ ప్రజ్ఞ – అంశవిశ్లేషణ ఇవన్నీ ఎందుకంటే... 'మట్టి రాతలు' పేరిట ప్రచురించిన కవితా సంపుటిలో డా. కత్తిమండ ప్రతాప్ కవిత్వాన్ని చదువుతున్నపుడు ప్రతి పదాన్నీ ప్రయోగించడం వెనుక రహస్యాన్ని తెలుసుకునే క్రమంలో కవి తాలూకు ఎన్నెన్నో లక్ష్యాలు, ఎన్నెన్నో ప్రేరణలు ఎదురవుతాయ్.

అంశాల ఎంపిక, అభివ్యక్తి తీవ్రత, ఎడతెగని భావశ్రేణి – అల్మారాలోంచి ఈ మధ్య బయటకు తీయని పుస్తకాలను తీసి ఇలాంటి సిద్ధాంతాలేవో వెతికేలా చేస్తాయి. కారణం ఒక్కటే, 'ఊహ, కల, కల్పన' వంటి సాధారణ శబ్దాలను పేర్చి ప్రతాప్ రాతలను నిర్వచించలేం. ఈ ప్రాథమిక కవితా సామగ్రికి తానెంత దూరమో చెబుతూ:

**"నీది ఊహల ప్రేమ, నాది కడుపు కోత**

**నీవి కళలు,**

**నావి జీవితాలు, నీవి కల్పనలు**

**నావి మట్టిరాతలు"** అని తన కవిత్వ అంతః సూత్రాన్ని తానే విశ్లేషించుకుంటారు, ప్రతాప్.

కవిత్వ నిర్మాణం కోసం భావాన్నో, వాహకమైన వాక్యాన్నో అరువు తెచ్చుకోకుండా తనవైన **"నలిగిన మనసు, చితికిన వయసు, గాయపడిన గుండె, గత జ్ఞాపకాలు"** – కవన సేద్యానికి బీజాలుగా నాటడం వీరి ప్రత్యేకత. ఫలవంతమైన ఈ కృషీవలత్వానికి మరికొన్ని రసాయనాలు దోహదమయ్యాయి.

**"పరమ పద జీవన సోపానంలో పాముకాట్లు**

**పట్టుదలను నింపాయి.**

**ఇప్పుడు నిచ్చెనెక్కిన నాకు**

**ఓటమి కొన్ని లక్షల మైళ్ళ దూరంలో**

**తొంగి చూస్తుంది**

**భయ పడుతూ..."** – 'ఇప్పుడు' అనే పదం ఇన్నేళ్ళ శ్రమను, నిరంతర పోరాటాన్ని సూచిస్తే; 'లక్షల మైళ్ళ దూరం' తాను అధిగమించిన పథాన్ని తెలియజెబితే, చివరి రెండు పాదాలు కవి సాధించిన విజయాన్ని పరాకాష్టగా నిలుపుతున్నాయ్. మామూలు వాక్యాలుగా కనిపిస్తున్నా, నారాయణ శర్మగారు ప్రశంసించినట్లు 'నిర్మాణ వ్యూహం' వీరి కవితకు బలం.

అనేక మాధ్యమాలలో వివిధ రూపాల్లో ప్రతినిత్యం మనకు ప్రతాప్ సాహిత్యం దర్శనమిస్తూనే ఉంటుంది. కవిత్వం కేవలం వ్యాసక్తి అయితే ఇంత అవిరళ ఉత్పత్తి సాధ్యం కాదు. దీని వెనుక, ముందే మనం మాట్లాడుకున్న అనేక కారకాలు కవికి వ్రాయకుండా ఉండలేని, వ్రాసి తీరాల్సిన మనస్థితిని కలిగిస్తాయి. అపుడు భాష, శిల్పం, ఇతరేతర సరంజామా.. వీటన్నిటికంటే చెప్పదలుచుకున్న విషయం కలాన్ని పరుగులెట్టిస్తుంది. కవిని ఆవేశించిన అదే మనస్థితి పాఠకుడికి సరఫరా అవుతుంది. అయితే ఈ సరఫరా ఎంత మోతాదులో? అనేది కవి ఆవేదనతో మనం ఎంత తాదాత్మ్యం చెందామన్నది ప్రధానంగా నిర్ణయిస్తుంది. ఈ కవిత చూడండి:

నా కలానికి జ్వరమొచ్చింది అని మొదలు పెట్టి,

**నొక్కిపట్టి రాస్తుంటే సత్యాలొస్తున్నాయి.**

**వొత్తిపట్టి రాస్తుంటే జీవితాలొస్తున్నాయి.**

**వేడెక్కిన కలంలో సలసల కాగే సిరా**

**నికరంగా, నిర్భయంగా**

**ఆలోచనగా, ఆవేశంగా**

**నల్లగా మట్టి రాతలు రాస్తుంది.**

**ఎర్రగా రక్తపు రాతలు రాసేస్తుంది" – నా కలానికి ఇప్పట్లో జ్వరం తగ్గదు** అని ముగిస్తారు. కారణం సుస్పష్టం. జ్వరానికి కారణమైన అనారోగ్య వాతావరణం కవి చుట్టూ ఉన్న పరిసరాలనుంచి ఇప్పట్లో పోయేలా లేదు. జ్వరాన్ని తగ్గించే ఔషధమూ అందుబాటులో లేదు. ఇలాంటి భావ పరంపరనే ప్రతిబింబిస్తూ మసిబారిన చేతులు, వార్ధక్యంతో ముడతలు పడ్డ ముఖం, సమాజాన్ని నిరసించే తీక్షణమైన చూపులు... మట్టిరాతలు ముఖచిత్రంగా ఎదురై కవర్‌పేజీలో కూడా ఏదో చెప్పాలనే కవి ప్రయత్నం కవితలు చదవకముందే తెలియజేస్తాయ్.

'బ్రతికి యుండిన సుఖములు బడయవచ్చు' మనం వింటూనే బ్రతికేస్తున్నాం. నిజానికి మన తర్వాత బ్రతికేవారంతా పొందబోయేదేదో మనం కోల్పోతామన్న భావనే, మరణమంటే భయాన్ని పెంచుతుంది. అయితే, పాత బాధలో, ఆవేదనలో తీరి

వాటి స్థానంలో కొత్తవి చేరుతున్నాయే గానీ సుఖమయ లోకం ఎప్పటికీ గగన కుసుమమే. అందుకే ఈ మారని లోకం తీరుని చూసి **"నేను శవంగానే ఉండిపోతాను"** అని సమాధిలోంచి బయటకు వచ్చిన నిర్జీవితో చెప్పిస్తాడు కవి **"నేడు, రేపు నిన్నటి సత్యాలే మిగులుతాయి"** అంటాడు మరోచోట. "నేడు, రేపు నిన్నటి 'సత్యాలై' మిగులుతాయి" అనే చిన్న మార్పు చేసినా మరో గొప్ప భావన ప్రతిఫలింపచేయడం పై వాక్యంలో ప్రత్యేకత. ఆ సందర్భంలో కవి ఉద్దేశ్యం ఏదయినా ప్రతి జీవన దశలోనూ ఇమిడిపోగల ఓ శాశ్వత వాక్యమిది.

**"గుండె గాయానికి లేపనం కోసం అన్వేషిస్తున్నా, పాదాలకు ఎన్ని గాయాలయినా రక్తపుదారుల్లో పయనిస్తా గుండెగాయాల మాన్పు కోసం"** నిజమే, హృదయక్షతాలతో విలవిలలాడే మనిషిని పాదాల గాయాలు బాధించేదేపాటి? అందుకే, ప్రతాప్ కవితను చదువుతున్న ప్రతిసారీ "వేదనతో పండిన గుండెను పిండి ప్రశ్నిస్తే రెండువైపులా కన్నీళ్లు మొండిగా సమాధానం చెబుతాయి" అన్న అలిసెట్టి ప్రభాకర్ గుర్తుకొస్తారు. కారణం ఒకటేనేమో "బారాత్లో గుర్రంమీద వెలిగే పెళ్లి కొడుకులనే కాదు, పెట్రోమాక్స్ లైట్ల కింద నలిగే పేద తల్లుల్నీ చూడగలగడం" అనే ప్రభాకర్ శైలి, దృక్కోణం కత్తిమండ కలానికీ వంటబట్టింది.

"పూల మాల మాదేగా" కవితలో శబ్దశ్లేషను అన్వయిస్తూ ఒకనాటి అసమానతల తీవ్ర రూపాన్ని తన జ్ఞాపకాలను తవ్వితీసి గుర్తుచెయ్యడం; ఇది కేవలం గతమే కాదు సుమా! అని వర్తమానంలో అక్కడక్కడా మిగిలిన ఆనవాళ్ళను, అంటరానితనపు చారికలను బహిర్గతం చేయడం; సాంకేతికంగా ఎదిగిన ఈ విజ్ఞాన యుగంలో నేటికీ మనం విడిచిపెట్టలేని మూఢవిశ్వాసాలను 'హుష్, గప్ చుప్' వంటి  కవితలలో అధిక్షేపించడం; సమకాలీన సంఘటనలు, ప్రత్యేక సందర్భాలను కవిత్వీకరించడం – ఇవన్నీ "రాలిపోయే కాలం, దృశ్యం, పగిలిన అద్దం, పిచ్చోడి చేతిలో పె(గ)న్ను" – అనే వీరి ఇతర కవితా సంపుటాలలో అక్కడక్కడా కనిపించినా, కవిత్వమంటే "ఆవేదనకు అక్షరానువాదం" అని నమ్మి ఆ మౌలికభావన నుండి దూరంకాని కవి ప్రతాప్.

సి.నా.రె. అన్నట్లు కొందరి "జీవిత చక్రాలు యంత్రాలతో తిరగవు, ఉద్యమించే సహజాత జీవ గుణాలతో తప్ప". అందుకే, ఒకవేళ తనంత తానుగా కాసింత దూరంగా జరుగుదామనుకున్నా **"కొక్కానికి వ్రేలాడదీసినట్టుగా జ్ఞాపకాలు వ్రేలాడుతున్నాయ్, ప్రతిరోజూ నన్ను ధరించమని దగ్గరకొస్తున్నాయ్"** అని, వాటి కోర్కెను కాదనలేని స్థితిలో **"కన్నీళ్ళలో ఈదులాడడం కళ్ళకు నేర్పుతూ"** ఒకే మార్గంలో, సమవేగంతో పరిగెడుతున్నారు ప్రతాప్. అందుకే, తాను నిర్వహిస్తున్న అనేక సాహిత్య కార్యక్రమాలు; విన్న, చదివిన వేలాది కవితలు; కలిసిన సుప్రసిద్ధ సాహితీవేత్తలు; దేశ విదేశ పర్యటనలు – వీరిని ఈ 'వేదన'ను మించి ఆకర్షించలేకపోయాయి.

ఇది ప్రశంసనీయమే. కానీ, ప్రపంచంలోని కన్నీళ్ళని, అందుకు కారణమైన పార్శ్వాల్ని విభిన్న కోణాల్లో అక్షరీకరించే బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తున్న ప్రతాప్, ఆ నిర్వహణలో ప్రపంచంలోని ఆనందమయభాగాన్ని ఆవిష్కరించేందుకు సమయాన్ని కేటాయించలేకపోయారేమో! ఇకనైనా ఆ వెలితి తీర్చి సంతోషమయ క్షణాలనూ సమాంతరంగా మనతో పంచుకుని సమగ్రకవిగా పరిణమించాలని ఆశిద్దాం.

***

11

# వ్యక్తావ్యక్త పారవశ్యం - 'జ్వాలాపాతం'

ఆసక్తికర అంశాన్ని చూసి పరిశీలించి, అంతటితో విడిచిపెట్టకుండా దానిని కవిత్వంగా దర్శించి, తద్వారా మనసును నిరంతరం చైతన్యవంతం చేసుకోవడం; ఎదురైన ప్రతి మంచి కవితనూ సూక్ష్మంగా అధ్యయనం చేయడం; తనలో అంతః ఘర్షణను అభివ్యక్తం చేయడానికి అనువైన కవితా సామగ్రిని ప్రోదిచేసుకోవడం – ఈ త్రిమితీయ సాధనతో తనను తాను మూడు కవితా సంపుటాలుగా ఆవిష్కరించుకొన్న కవి – శ్రీ శశికాంత్ శాతకర్ణి.

పై సాధనాక్రమంలో ప్రతి సోపానంలోనూ అపరిమితమైన ఆత్మ పరిశీలన, అవసరమైనంత జాగ్రత్త కవికి వచనకవిత్వం పట్ల కొన్ని ఖచ్చితమైన, నిర్దుష్టమైన అభిప్రాయాలను ఏర్పరచుకొనేందుకు అవకాశమిచ్చాయి. తనవైన కొన్ని నిర్వచనాలనూ అందించాయి. మొదట, **కవిత్వమంటే కోయిల కుహూరవం మనసు కొలనులో రేపిన ప్రభావ రంగంగా** భావించిన కవి, తరువాత దశలో **అది మేల్కొన్న వాడు వినే సురభిళ సుమధుర స్వప్న సంగీతంగా** మరింత ఉదాత్త ప్రతిపాదన చేస్తారు. నిజమే, కవిత్వం సృజింపబడే క్షణాలు నిద్ర, మెలకువ కాని ఓ పారవశ్య వ్యక్తావ్యక్త స్థితే కదా! అందుకే, మేల్కొని ఉన్న ఇంద్రియాలు, స్వప్నంలో మనసు పాడే సంగీతాన్ని వినే దివ్య సందర్భమే కవిత్వ సృజన.

నిన్నటివరకూ మన చుట్టూ అత్యంత సాధారణ వస్తువులు, జరిగే సంఘటనలు ఈ రోజు కొత్తగా కనిపించి కవితలుగా గౌరవాన్ని పొందుతాయి. నిన్న నుండి నేటి మన దృక్కోణంలో కలిగిన మార్పు వాటిని మన సృజనకు ముడిసరుకుగా మార్చివేస్తుంది. అందుకే కవి **"నీవు వాడే ప్రతి వస్తువు ఒక్క ఉదుటన నూత్న గీతాలను వినిపించడం – కవిత్వం"** అంటారు. కేవలం, కవిత్వం ఎలా ఉండాలో మాత్రమే కాక ఎలా ఉండకూడదో అనే విషయంపై కూడా వీరికి కొన్ని నిశ్చిత అభిప్రాయాలున్నాయి. ఈ సూత్రీకరణ నిరంతరం మనసులో స్థిరంగా ఉండి ఆ పరిధిలోనే ప్రతి కవితా రూపుదిద్దుకోవడం వలన కొన్ని సార్లు ఆ చట్రం దాటి బయటకు రాని స్వీయనియంత్రణ కవికి ఎదురైందనిపిస్తుంది. అందుకే, "Truth suffers from too much analysis" అంటారు, Frank Herbert.

దాదాపు కవితలన్నిటిలో, అలవోకగా మనసు నుండి కాగితం మీదకు పరుగులెత్తిన భావధారగా కాక ఒక ప్రణాళికను ముందే రూపొందించుకొని శ్రద్ధగా రూపు దిద్దిన 'శిల్పం' కనిపిస్తుంది. ఇది, కవిత్వం పట్ల వీరికి గల క్రమశిక్షణను వెల్లడిచేస్తుంది. ఉదాహరణకు తొలి కవితలో **"మా అమ్మకు నీళ్ళంటే ఎంత ఇష్టమో"** అనే సాధారణ వాక్యంతో కవిత మొదలైనా **"నా హృదయంలో తడి నీడగా, నాలో ఇగిరిపోని మానవత్వపు ఆర్ద్రతగా, కడదాకా మా అమ్మనాలో మిగిలే ఉంటుంది"**... ఇలా కవిత పూర్తయేసరికి మొదటి వాక్యపు ప్రాధాన్యత అగణితమవుతుంది. ఒక భూమికను ఏర్పాటుచేసుకొని కడదాకా సమర్థవంతంగా నిర్వహించగలగడం ప్రశంసనీయం.

ప్రధానంగా, వీరి వస్తువు అనుభూతుల పునశ్చరణ, అనుబంధాల సంస్మరణ. అయితే అది కేవలం ఆర్ద్రంగా, వాత్సల్య ప్రధానంగా సాగిపోకుండా చక్కని పోలికలతో సంవిధానం కాబడి కవి వైయక్తిక సంవేదనలతో మనలనూ భాగస్థులను చేస్తుంది. ఒక సంఘటనా క్రమానికి అనువైన పోలికలు వరుసగా పేర్చడం ఆకర్షింపజేస్తుంది. **"చల్ల గాలి తర్వాత వచ్చే వర్షంలా బాల్య స్మృతులతో నా కళ్ళ నిండా నీళ్ళు"** ఈ పద సంఘటన ఇలాంటిదే. దూరమైన అన్నయ్య జ్ఞాపకాల్లో ఒకనాటి అతడి దినచర్యను కవితగా నివేదిస్తూ **"సంవత్సరాలను గుర్తు పెట్టుకొనేది తుఫానులతో, పంట**

**వైఫల్యాలతో మాత్రమే; చేబదుళ్ళను హటాత్తుగా తీర్చేసినట్టు అంతులేని పగటి కలలు; రాత్రి భోజనం తర్వాత ఖర్చే గానీ జమలేని జమా ఖర్చుల తప్పనిసరి సమీక్ష"** మొదలైన వాక్యాలు అంతశ్చేతనలో ఉన్న మన జ్ఞాపకాలనూ నిద్రలేపుతాయి. బస్సు ప్రమాదంలో **"చెల్లా చెదరుగా పడి ఉన్న పిల్లల దేహాల్లా చిందర వందరగా పిల్లల జ్ఞాపకాలు" "చలనం లేని కలల మీద ఒదిగి పడుకొన్న పిల్లలు"** లాంటి వాక్యాల్లో సందర్భాన్నీ ప్రతీకలను జతపరిచిన తీరు అసాధారణం.

'ఒక శిథిల జ్ఞాపకం' కవితలో **"కూలిన గోడల మీంచి జాలిజాలిగా బరువు బరువుగా జారుతూ నా బాల్య స్మృతులు! విరిగిన ప్రతి ఇటుక మనసును తుత్తునియలు చేస్తున్న ఒక శిథిల జ్ఞాపిక! పెళ్లలు పెళ్లలుగా విరిగిపడి మిగిలిన మొండి గోడలు జాడలు, నా హృదయాన్ని చిదురుపలుగా చేస్తున్నాయి"** అని వైయక్తికంగా సాగిన కవిత ఒక్కసారిగా చెల్లీ నీకు గుర్తుందా! అంటూ ఉమ్మడి జ్ఞాపకాలలోకి మలుపు తిరిగి సాగిపోతుంది. నిజానికి ఇది దీర్ఘ కవిత తాలూకు లక్షణమైనా కవితలో నింపిన విషయ సామగ్రి (content) పాఠకుడిని ఏ సంశయానికీ గురిచేయకుండా చదివిస్తుంది.

**"దేవుడు పక్షులను ప్రేమించాడు కనుకనే వాటి కోసం చెట్లను సృష్టించాడు. మనిషీ పక్షులను ప్రేమించాడు కానీ వాటికోసం పంజరాలను రూపొందించాడు" –** మినీ కవితకు అవసరమైన క్లుప్తత, ధ్వని ఈ వాక్యాలలో ఇమిడి ఉండి మొత్తం కవిత నుండి వేరుచేసినా తమదైన ప్రత్యేకతను కలిగి ఉంటాయి.

వ్యక్తి తాలూకు మూర్తిమత్వాన్నో, కవిత్వతత్వాన్నో నేరుగా కాకుండా నర్మగర్భమైన విశేషణాలతో వినూత్నంగా పరిచయం చేయడం ఈ సంపుటిలో మరో ప్రత్యేకత. అందుకు ఉదాహరణగా శ్రీ సింగమనేని నారాయణపై వ్రాసిన కవితను పరిశీలిస్తే **"మట్టిలోంచి మాట పెకిలించుకు వస్తే అది నారాయణ మాటే అవుతుంది. మట్టి తన కడగండ్ల వెతల్ని ఏకరువు పెడితే అది నారాయణ గళమే అవుతుంది. తరతరాలుగా రైతు శ్రమ ఎలా వృధా అవుతుందో విడమర్చితే అది నారాయణ కతే అవుతుంది. తన యుగ యుగాల నిర్వేదాన్ని మట్టి వివరిస్తే అది నారాయణ ప్రసంగమే**

**అవుతుంది"** – ఇక్కడ నారాయణ తాలూకు characteristics ని మట్టితో ముడిపెట్టి చెప్పడం కవి తాలూకు ప్రణాళికా నైపుణ్యం.

మరో కవితలో **"నీ వృత్తేమిటి – మాటలకు సానబట్టడం; నీ లక్ష్యం ఏమిటి? – పాత మాటలకు కొత్త అర్థాలు కూర్చడం; కొత్త అర్థాలకు సరికొత్త మాటలు రూపొందించడం; నీవు ప్రస్తుతం చేస్తున్నదేమిటి? మకిలిపట్టిన మాటలను శుభ్రపరచడం; మొద్దు బారిన మాటలకు పదును పెట్టడం, ఇంతకీ నీ పేరేమిటి? డిలాన్ థామస్"** ఈ కవితలో United Kingdom కి చెందిన Dylan Marlais Thomas సాహిత్యాన్ని పరిచయం చేస్తారు.

ప్రాకృతికమైన సంఘటనను అందరిలా దృశ్యంగా కాక ధ్వని (Sound) పరంగా వర్ణించడం ప్రముఖంగా ప్రస్తావించదగ్గ విషయం. **"ఉదయం సంధ్యా గమనం – నిశ్శబ్దంలోంచి శబ్దంలోకి; సాయం సంధ్యా నిర్గమనం – శబ్దంలోంచి నిశ్శబ్దంలోకి"** ఇలా మౌన, ధ్వానాల మధ్య సంధి స్థితిని ఉభయ సంధ్యలుగా వర్ణించడం ఈ పుస్తకంలో అగ్రతాంబూలం పొందే అభివ్యక్తి.

***

ఈ కవితా సంపుటితో పాటు వీరి గత రెండు గ్రంథాలైన "చంద్ర జ్యోతి", "స్వేద బిందువు విజయాల కేంద్ర బిందువు" లను తరచిచూస్తే సమకాలీన కవిత్వంలో కనపడని శబ్దాలు ఎన్నో కొన్ని ప్రతి కవితలో కనిపిస్తాయి. మాధ్యమంగా వచన కవిత్వాన్నే ఎంచుకున్నా, ప్రౌఢిమ గల శబ్దాలపై వీరికిగల సాధికారత కనిపిస్తుంది. సుందరకాండలో హనుమంతుడు సీతమ్మను చూసి "ప్రస్తుతానికి ఆమె నిరాభరణగా ఉన్నా, గతంలో అవి ధరించిన గుర్తులు ఆమె దేహంపై కనిపిస్తున్నాయి" అనుకుంటాడు. వీరి కవిత్వాన్ని చదివినపుడు పాఠకుడూ ఇదే భావన పొందుతాడు. "ఉత్తమ కవితకు అందమైన ఆలోచన అమ్మయితే, అనువైన అక్షరం నాన్న" అంటారు డా. రావూరి భరద్వాజ. ఆ కోవలో చేర్చదగ్గ కవితల సమాహారమైన ఈ సంపుటి పేరుకి జ్వాలాపాతమే అయినా, లోపలంతా శశికాంతుల శీతలత్వమే.

***

# 12 ఓ చదవాల్సిన 'పాఠం'

**"భావమో, రూపమో, సంస్కారమో బహుశా వీటన్నిటి సమాహారమో వ్యక్తుల మధ్య దూరాన్ని నిర్వచిస్తుంది"** అని నమ్మే శ్రీ ఉప్పలధడియం వేంకటేశ్వర రూప, భావ, సంస్కారాల సమాహార స్వరూపమైన తన కవిత్వంతో సాహిత్య రంగంలో ఎందరో సహ ప్రయాణీకుల హృదయాలకు చేరువయ్యేందుకు చేసిన ప్రయత్న ఫలితం – వీరి కవితా సంపుటం 'పాఠం'.

"Poetry is the revelation of a feeling that the poet believes to be interior and personal which the reader recognizes as his own"- Salvatore Quasimodo. తనకు ఆంతరంగికము, వైయక్తికము అని కవి చేసిన భావనతో పాఠకుడు తానూ తాదాత్మ్యం పొందితే ఆ భావన కవిత్వమవుతుంది. అందుకే, కవిత్వ స్థానాన్ని లేదా స్థాయిని నిర్ణయించాల్సివచ్చినపుడు ప్రాథమిక సూత్రం – కవిత్వ మాధ్యమం ద్వారా వ్యక్తీకరింపబడ్డ ఆ కవి అంతరంగంతో ఎన్ని మార్లు మనం తాదాత్మ్యం పొందామో లెక్కించు కోవడమే. ప్రస్తుత కవితా సంపుటిని పై కోణంలో అవలోకిద్దాం:

ప్రకృతితో మమేకత్వాన్ని పొందిన తరువాత ఏకాంతానికి అవకాశమెక్కడిది. కానీ ఆ అనుభూతి పూర్తిగా వైయక్తికం. అపరిమిత ధ్యానానుభూతిలో పరవశం పొందిన వాడికి ఐహిక విషయాల పట్ల పొందడం, కోల్పోవడం - జ్ఞాపకానికి రావు. అందుకే, కొత్త పెళ్ళి కూతురిలా మెరిసిపోతున్న కొండ, వెండి తోరణంలా వేలాడే జలపాతం, చెంపల్ని నిమిరే చిరుగాలి, గిరి శిఖరం మీదుగా తరలి పోతూ తెలిమబ్బు కొంగ వీటన్నిటినీ ఆస్వాదిస్తున్న కవి **"చీకట్లో కూచున్నావేమని వెతుక్కుంటూ వచ్చిన మిత్రునికి ఏం జవాబు చెప్పాలి"**? అని ఆలోచనలో పడతారు.

ఎన్నెన్నో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని ఏ జలచరానికీ చిక్కక బయట పడ్డ జాలరి, తీరా తీరం చేరాక ఏమయ్యాడో

**"కొయ్య పడవ మీద నిలిచి ఒడుపుగా వల విసురుతాడు జాలరి**
**మరింత ఒడుపుగా తప్పుకొంటాయి చేపలు**
**చిన్ని, చిన్ని అలల్తో చెలిమి చేసిన కడలికాస్తా**
**మాట మార్చిన నేతలా కాల సర్పమై బుసకొడుతుంటే**
**ప్రతిక్షణమొక గండంగా చండ ప్రచండంగా**
**గట్టెక్కేనని బుట్టెడు సంతోషంతో పొద్దుటే తిరిగొస్తాడా**
**గతుక్కున మింగేస్తాయి - గట్టవతలి తిమింగలాలు"** - కథన రీతిలో 'జాలరి' కవితలో తెలుపుతూ నీటిని నెగ్గుకురాగలిగిన వాడు నేలపై దోపిడీకి గురౌతున్నాడంటారు.

క్రాంత దర్శనమే కాదు, కనబడుతున్న సన్నివేశం వెనుక, కనబడని సత్యాన్నీ అంచనా వేయగల విజ్ఞత వీరి కవిత్వంలో కనిపిస్తుంది. అందుకే, మధుపాత్రలైన కళ్ళు, నరనరానా నిండిన మాదకత, అస్తిత్వస్పృహలేని ప్రేలాపనలు వీటన్నిటినీ మనకు చూపుతూ **"రోజురోజుకీ పెద్దవవుతున్న ఇల్లాలి గాజులను"; "పసిహృదయాల్లో దిగబడుతున్న పగిలిన సీసాపెంకులను"** తాను దర్శిస్తాడు, కవి (దృశ్యాదృశ్యం కవితలో).

మరోకవితలో, కరువు ప్రాంతాలలో ఎంత తవ్వినా జల అంతుచిక్కనపుడు కర్కశత్వం ఖణేల్మని రాయిలా తగిలినపుడు, వలసపోయిన బతుకుల జీవన చిత్రాన్ని **"కాళ్ళు సరిహద్దుల్ని పునర్లిఖిస్తాయి"** అని ఒక్క వాక్యంగా వివరిస్తారు.

వాన తగ్గాక అప్పటివరకూ గొడుగు పట్టిన చెట్టు తడిపేయడం తెలిసినదే. అయితే, వీరి దర్శనం వేరు. **"మొయిలేనుగు చదలేట్లోంచి నీళ్ళు కుమ్మరిస్తున్నట్టు కురిసిన వాన వెలిసాక కూడా లోపల అలజడి వాన కురుస్తూనే ఉంది. పొద్దుననగా బయటి కెళ్ళిన ఆరోప్రాణం కోసం ఎదురు చూస్తున్న ఇళ్ళలో"** అంటూ వర్షానంతర అల'జడి'ని వినిపిస్తారు.

కవిగా జన్మించడం పూర్వజన్మ సుకృతమంటారు. అయితే, ఆ గతజన్మల పుణ్యఫలంతో పాటు కొన్ని జ్ఞాపకాలనూ మిగుల్చుకున్నారు శ్రీ వేంకటేశ్వర. హంపి యాత్రలో గుహను సందర్శిస్తూ **"లోపలకు వెళుతున్న కొద్దీ కాలం వెనక్కు జరుగుతోంది. గాలి వేళ్ళు అలల తీగల్ని మీటుతుంటే ఏ వసంతోత్సవంలోనో ఇక్కడ పద్యం చదివిన పురాస్మృతి"** అంటారు. అంటే, ఆ జన్మలోనూ తనను పద్య సేద్యం చేసే సాహిత్య కృషీవలునిగానే భావన చేసారు.

నెలనెలా సాహిత్య కార్యక్రమాలు నిర్వహించడం అనేక చోట్ల జరుగుతోంది. అనుభవజ్ఞుల, వర్ధమానుల కలయికలో ఈ సాహిత్య సమ్మేళనాలను ఆస్వాదిస్తూ కవి –

**"బయట చీకటి అల్లుకొంటుంటే**
**లోపల వెన్నెల కురుస్తుంది.**
**ఏ సాయంత్రమైనా**
**ఇలా కళాకాంతులీనుతూ**
**రాత్రిగా పరావర్తనం చెందడం ఎంత అద్భుతం!"** అంటారు. దేశ వ్యాప్తంగా ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి నిర్వహిస్తూన్న ఈ కార్యక్రమాల నిర్వాహకులకు, సంస్థలకు పై వాక్యాలు ఓ శాశ్వత కానుక.

సాధారణంగా ప్రతీకవీ అంతర్వర్తనుడే. మనసునిండా కవితాలోచనలే సుడులు తిరుగుతున్నపుడు చేస్తున్న పనిలో తాను నిమిత్తమాత్రుడవుతాడు. సమూహంలో తాను అంతర్భాగమైనా ఏకాంతికంగానే విహరిస్తాడు. **"తీరా హోటల్లో దిగాకే తెలిసివస్తుంది పెట్టెనిండా పుస్తకాలే సర్దుకొచ్చేసానని. దారిలో ఐదారు సార్లయినా పెట్టె తెరిచి ఉంటారు గదా. అప్పుడు కూడా చూసుకోలేదా? పెట్టె**

**తెరిచినప్పుడల్లా గురజాడో, గోపీచందో ఎవరో ఒకరు పలకరిస్తారు. ఎందుకోసం తెరిచానో మరిచిపోయేలా"** – పఠనం వ్యాసంగం స్థాయి దాటి వ్యసనంగా మారడం మనకూ అనుభవైకవేద్యమే, కదా!

'మ్యాచ్ ఫిక్సింగ్' మర్మం తెలియని పిల్లలు ఆసక్తిగా ఆటంతా చూసి ఫలితం ఒక్కసారిగా తారుమారు కావడంతో ఆశ్చర్యానికి గురైనపుడు **"అంచనా ఎందుకు తప్పిందో అర్థం కాని పిల్లాడు క్రీడాస్థలి మైదానమే కానక్కరలేదని గ్రహిస్తాడా ఎప్పుడైనా?"** అంటారు క్రీ(నీ)డ కవితలో.

సాధారణ విషయాలతో రెండు మూడు వాక్యాలు నింపేసాక, ఏముంది దీనిలో? అని పాఠకుడు విసుగుపొందే సమయంలో మంచి మెరుపుతో ముగించడం తరచుగా కనిపిస్తుంది. ఈ వాక్యాలు చదవండి – **"వానరాదా? ఉక్కబోత నుంచి ఒకింత ఉపశమనమీదా? అని తపించిన వాళ్ళే తీరా నాలుగు చినుకులు రాలేసరికి శాపనార్థాలు పెడుతున్నారు – ప్రేమించిన వాడ్నే పెళ్ళయ్యాక తిట్టిపోసినట్టు"**.

**"భళ్ళున తెల్లారిపోతుంది పాలప్యాకెట్ ఒలికినట్టు"** లాంటి అందమైన భావాలు ఈ సంపుటిలో అడుగడుగునా పలకరించినా, వ్యాసానికి అందమైన ముగింపునివ్వాలని ఒక అత్యున్నత వాక్యం దాచుకున్నాను. సాధారణంగా సమాధానంలేని ప్రశ్నలను భేతాళ ప్రశ్నలంటాం. అలాగే చందమామ కథల ప్రకారం సంతృప్తికర సమాధానం లభించగానే భేతాళుడు తిరిగి చెట్టెక్కుతాడు. పై రెండు అంశాలను అత్యుత్తమంగా అన్వయించుకుంటూ వీరు చేసిన ప్రయోగం ఇది: **"భేతాళ ప్రశ్న: ఎక్కడానికి చెట్టెక్కడుంది?".** వాక్యం రసాత్మకం కావ్యం – నిజమే కదూ!

ఓ సీతాకోక చిలుక గోడ మీద గడియారం పక్కన నిశ్చలంగా కూచున్నపుడు, ముళ్ళు కదులుతున్నా కాలాన్ని కదలనీయకుండా చేసి, అది బయటకి వెళ్తూ, వెళ్తూ నా హృదయానికి రెక్కల్ని ప్రసాదించింది అంటూ తాదాత్మ్యం పొందుతారు శ్రీ వేంకటేశ్వర. వారి వర్ణమయ కవిత్వం పూసుకున్న ఈ చిన్న పుస్తకమూ అంతే! చదివినంత సేపూ కాలం కదలకుండా మొరాయిస్తుంది. ముగిసిన తరువాత హృదయం రెక్కలు కట్టుకుని భావవిహారం చేస్తుంది.

***

# 13 సశేష జ్ఞాపకాల సాక్షరరూపం "పారం పూర్తయ్యాక"

దాట్ల దేవదానం రాజు – **"సముద్రాల వింతల్ని, ఆకాశాల మెరుపుల్నీ, చంచల చూపుల్నీ, అనంత శ్వాసల్నీ, జారిపోతున్న ముఖపాతాల్నీ"** – మాటలుగా అనువదించే భాషకోసం తవ్వకం మొదలెట్టిన పరిశోధకులు.

తన "సశేష జ్ఞాపకాలై"న ప్రాకృతిక మమేకం, ఆనందోద్వేగ పరవశం, దుఃఖచ్ఛాయల అనుభవం – వీటన్నిటినీ దర్శించడానికి అక్షరాల్లో దాక్కున్న జ్ఞాపకాల్ని చెక్కి కవిత్వంచేసి, హృదయాన్ని తేలిక పరుచుకోవడానికి ప్రయత్నిస్తున్న నిత్య సత్యాన్వేషి. జీవిత సంఘటనలలో **"ఏది కలబోతల జాడో, ఏది అనుభవ సారమో ఫలశ్రుతులను అన్వేషించడం తప్ప ముందుగా చెప్పలేమని"** గ్రహించిన తాత్త్వికుడు.

దీపం అడుగు జాగాలో దాక్కున్న చీకటిని తలచి, వేదన చెందగల సున్నిత మనస్వి.

ముగిసిన విహారాన్ని రాత్రి కలలో ఓ మధురానుభవంగా ఉత్సవం జరుపుకోగల స్వాప్నికుడు.

**"ఎగిరే విమానానికి రెండు ఇంజనులున్నట్లు, మరెందరికో చోటివ్వడానికి మరో గుండె ఉంటే బావుండును"** అని కోరే మహోన్నత ఆశావాది.

వీరి ఈ బహుముఖీన పార్శ్వాలన్నీ స్పష్టాస్పష్టంగా వ్యక్తీకరింపబడిన కవితా సంపుటి 'పారం పూర్తయ్యాక...'

***

"కవి కాదలచుకున్నవాడిని పట్టుకుని నువ్వు కవిత్వం ఎందుకు రాస్తున్నావు? అని అడిగినప్పుడు, నేను చాలా ముఖ్యమైన విషయాలు చెప్పదలచుకున్నాను – అని అంటే అతడు కవి కాలేడు. అలా కాక, నా చుట్టూ మాటలు మూగుతున్నాయి. అవి చెబుతున్నది వినాలని, అంటే అతడు కవి అయ్యే అవకాశాలున్నాయి" అంటాడు W.H. ఔడెన్. అలా మూగుతున్న మాటలను కూర్చి, పాఠకుడిని జీవితకాలం పాటు వెంటాడే వాక్యాలుగా మార్చి కవితాజననం వెనుక రసాయనిక చర్య ఇదీ అని పరిచయం చేసి విడిచిపెడతారు దా.దే.రా.

**"మరవవలసిందేదో జ్ఞాపకం రావడం లేదు"** అనే పునశ్చరణ; **"నీకూ నాకూ మధ్య దూరమయ్యేంత దగ్గరతనం ఉంది"** అంటూ సాన్నిహిత్య దూరాన్ని కొలిచే ప్రయత్నం; **"చెట్టు ఆనవాళ్ళు అడవిలోనే కాదు నగరాల్లోనూ ఉండనిద్దాం"** అని అందంగా వ్యక్తంచేసిన ఆవేదన – ఈ కృషంతా వెంటాడే వాక్యాల సంధానమే.

***

ప్రవేశయోగ్యమైన ప్రతి సాహితీ ప్రక్రియలోనూ విస్తరించి తనదైన ముద్ర వేయడం వెనుక వీరికి ఆదర్శం 'ప్రవాహం'. అందుకే, **"విస్తరించేంత జాగా ఉన్నపుడు ప్రవాహం కూడా బహుముఖంగా చీలిపోతుంది"** (ఖాళీతనం) అంటారు. అయితే కేవలం విస్తరణే కాక శాశ్వతకీర్తితో వెలగాలనే ఆకాంక్షనూ తన కవితలో వ్యక్తం చేస్తారు. **"మొగ్గ విడుతున్నపుడు సున్నితమైన సవ్వడికి చెవి గూడు విశాలం అయినట్టు"** ప్రపంచం తన వ్యాసంగాన్ని శ్రద్ధగా పరికించాలని "నన్నే పిలవాలి" కవితలో పేర్కొంటూ అందుకు తానెంచుకున్న మార్గంలో సృజనను నిరంతర పయనానికి సన్నద్ధం చేస్తారు.

***

వృత్తిపరమైన అనుభవాలను అత్యుత్తమ కవితా సామగ్రిగా పరివర్తన చెందించడం వీరి ప్రత్యేకత. విభిన్న రంగాలలో గల ప్రతిభాసంపత్తి అనేక కవితలుగా రూపాంతరం చెందినా ఉపాధ్యాయుడు, కర్షకుడు చాలా సందర్భాలలో కవితా వస్తువును, గమనాన్ని నిర్దేశిస్తారు. అందుకే **"నల్లబల్లపై సుద్దముక్క అరిగే కొలదీ జ్ఞానం బదిలీ అయినట్లు పారవశ్యం చెందుతాడు"** అని తనలోని ఉపాధ్యాయుని

మనసుని మన ముందుంచుతారు. అయితే, అందుకు విరుద్ధంగా సాగిపోతున్న ప్రస్తుత విద్యా వ్యవస్థను మనకు దృశ్యమానం చేస్తారు **"పాఠం పూర్తయ్యాక"** కవితలో.

**"తరగతి గది ఒక మ్యూజియం**
**పురాతన రాతి విగ్రహాల్లా**
**విరిగిన అంగాలతో**
**తోలుకప్పిన చిన్న దేహాల విద్యార్థులు**
**కొన్ని కంఠ శోషలు కొన్ని బాధ్యతల మధ్య**
**పాఠం పూర్తవుతుంది**
**నిజానికి తరగతి గది ఎప్పుడూ జ్ఞాన సరఫరా కేంద్రంగానే ఉండదు**
**తరగతి గది నిండా**

**కొన్ని అసహనాలు మరెన్నో అయిష్టాలు"** అంటూ నేటి బడుల తీరుని ఒకింత బాధగా బయటపెడతారు. బోధన కంఠశోషగా, కేవల బాధ్యతగా పరిణమించిన దుస్థితికి వాపోయిన కవి, తరగతి గది నిండా పేరుకుపోయిన అసహనాలు, అయిష్టాలు, రాటకు కట్టిన లేగదూడల్లా రోడ్డు వైపుకు చూపులు సారించే బందీలుగా విద్యార్థులు... వీటన్నిటినీ పటం గీచి బెత్తంతో భాగాలుగా చూపిస్తారు.

**"పరీక్షల యజ్ఞంలో**
**పహారాలు కూలిపోయి**
**కంచే చేను మేస్తుంటుంది.**
**కొన్ని ఉత్తీర్ణతలు కొన్ని నిస్పృహలు**
**ఎక్కడో ఇంకో చోట మాత్రం**
**ఫలితాల గణాంకాలు**

**పూర్తి పేజీ ప్రకటనల్లా వెలిగిపోతాయి"** – ఈ వాక్యాలు విలువలు పతనమైన నేటి విద్యావ్యవస్థకు దర్పణంగా నిలుస్తాయి.

'క్రాప్ హాలీడే' ప్రకటించిన సందర్భంలో **"ముళ్ళుండవు గానీ దీనంగా మూలిగే గుండె చప్పుళ్ళు మీ పాదాలకు గుచ్చు కుంటాయి; చెమట నురగలై పారే చోట కన్నీళ్ళ గుండంలో పడిపోతారు, జాగ్రత్త"** అని గుండె వెనుక వేదనను నొక్కి

పట్టి నర్మగర్భితంగా హెచ్చరిస్తారు. కేవలం ఇలా విమర్శ, హెచ్చరికలే కాక అద్భుత ప్రతీకలూ వీరి కవిత్వంలో గోచరిస్తాయి. **"అరె... ఆ పక్షుల గుంపు చూడు అడ్డంగా నరికిన చెట్టు మేను మీదుగా గొడుగు పట్టి విశృంఖలంగా ఎగురుతున్నట్టు చెట్టు రూపు దాల్చింది"** (ఎరుక) – ఇలా మొండిచెట్టుపై ఎత్తుగా ఎగిరే పక్షి గుంపును సజీవ పరిపూర్ణ వృక్ష స్వరూపంగా దర్శించడం, కవి అత్యుత్తమ భావనాశక్తిని ప్రకటిస్తుంది.

ఇక కవికి ఉండాల్సిన లక్షణం – సమకాలీన సంఘటనలకు సాక్షీభూతంగా నిలవడం. అందుకే ప్రపంచీకరణ, స్వేచ్ఛా వాణిజ్యం – వీటి నేపథ్యంలో **"నిజానికి చిన్న రాయికే చెదిరిపోయే నీటిలో ప్రతిబింబం వాడు; పచ్చని చెట్టు ఆకులన్నింటినీ ఒక్క లిప్తలో రాల్చి నెపాన్ని ఎవరి మీదకైనా నెట్టగలడు; చిత్రమేమిటంటే గుండెల్ని పిండిచేసాక కూడా కళ్ళు అపరాధ భావాన్ని ప్రతిఫలించవు"** అంటూ 1990 దశకం తరువాత సరళీకృత ఆర్థిక విధానాల పర్యవసానాలపై వెల్లువెత్తిన కవితోద్యమంలో తన గొంతునూ కలుపుతారు.

***

కళ యొక్క అంతిమ లక్ష్యం పట్ల నిర్దిష్టమైన అవగాహన గల కవి శ్రీ దా.దే.రా. అందుకే తాను ప్రతి పాటకూ శాశ్వత ప్రవాహశీలతను ఆపాదించలేనని **"వీనులకింపైన స్వరమొక్కటే కాక, జ్వలించిన అక్షరము, పిడికిల్ని బిగింపజేయగల శక్తి, గాయపడ్డ వేదన, మట్టి నుండి పుట్టిన సహజత్వము, అన్నిటికీ మించి జాతి జాగృతికి సందేశమై నిలవగల ఔన్నత్యము.."** ఇవన్నీ కలిగి ఉన్నపుడే అది ప్రవాహగానమౌతుందంటారు. పైన పేర్కొన్న లక్షణాల సమాకలిత స్వరూపం వీరి కవితా గానం. అందుకే ఎప్పటికీ అది ప్రవాహశీలమైన జీవ నదే.

***

# 14 ఆంధ్ర సాహిత్య పరిషత్

ఒక వంశపు కీర్తి చిహ్నాలు, ఆస్తిపాస్తులు, వైభవ ప్రతీకలు – వీటన్నిటి పరిరక్షణ అనంతర తరాల బాధ్యత. అయితే, శతాబ్దాల వాఙ్మయసంరక్షణ విషయంలో, వారసులమని ఒకింత గర్వంగా ప్రకటించుకోగలమే గానీ, వ్యక్తిగతంగానో, చిన్న సమూహంగానో అంతటి నిర్వహణను చేపట్టలేం. అందుకే, సారస్వత సంరక్షణ – మొత్తం సమాజపు బాధ్యత, ప్రతి వ్యక్తి సామాజిక బాధ్యత. ఆ బాధ్యతనెరిగిన కొందరు మహనీయుల కృషితో ఏర్పడి, వైభవోపేతంగా వందేళ్ళ పండుగ జరుపుకుని నేటికీ తన అస్తిత్వాన్ని నిలుపుకున్న సంస్థ – ఆంధ్ర సాహిత్య పరిషత్.

**సీ. శ్రీజయంతి కులాబ్ధి శీతభానుడు రామ**
**యార్యుండు జనకుడై యలరు చుండ**
**బీరికాపుర మహీ భృన్మౌళి సూర్యరా**
**ట్ప్రభువు పోషకుండయి ప్రబలుచుండ**
**రాజాధిరాజ విక్రమ దేవవర్మ భూ**
**నేత యధ్యక్షుండై నెగడు చుండ**
**సంస్కృతాంధ్ర జ్ఞాన సంపూర్ణులైన వి**
**ద్వాంసులు సభ్యులై తనరుచుండ**
**బంచ వింశతి వత్సర ప్రాయమం ద**
**మందగతి రాజతోత్సవానందలీల**
**ననుభవించితి సాటి నీ కవని గలదె**
**యాంధ్ర సాహిత్య పరిషదబ్జాయతాక్షి!** – ఇదీ పరిషత్ ఒకనాటి వైభవం. విద్వాన్ పిసుపాటి విశ్వేశ్వరశాస్త్రి 'పరిషత్ రజతోత్సవ' సందర్భంగా చేసిన ఈ ప్రశంస అప్పటి స్థితినేకాక మరో ఏభై ఏళ్లపాటు కొనసాగిన సంస్థ ఔన్నత్యాన్ని, వైశిష్ట్యాన్ని మనకు సాక్షాత్కరింపజేస్తుంది. మహోన్నత చరితగల ఈ సంస్థ ఆవిర్భావ, వికాసాలను పరిశీలిద్దాం.

***

**సంస్థ ఏర్పాటు – నేపథ్యం:**

1910సం. కాలంలో నాటి మద్రాస్ ప్రెసిడెన్సీలో అంతర్భాగమైన ఆంధ్రదేశంలో భాషా విషయమై విషమపరిస్థితులు నెలకొన్నాయ్. 'తత్సమము, తద్భవము, దేశ్యము, గ్రామ్యము – ఇలా నాలుగు విధాల భాషా విభజనలో శ్రీ గురజాడ అప్పారావు వంటి పెద్దలు గ్రామ్యానికే పట్టంకట్టి దానికి ప్రాముఖ్యత సంతరింపజేశారు. అదే సమయంలో పర్లాఖిమిడిలో రావుసాహెబ్ శ్రీ గిడుగు రామ్మూర్తి పంతులు కూడా వ్యావహారిక భాషలోనే పాఠ్యగ్రంథాలుండాలనే వాదన లేవనెత్తారు.

అయితే, గ్రాంథిక భాషాభిమానుల అభిప్రాయంలో ఇవి వింతవాదనలు. వీరి ఉద్దేశ్యంలో – వ్యావహారిక భాష దారీ, తెన్నూ లేనిది. భిన్న ప్రాంతాలలో వివిధ

రీతులలో (మాండలికాలలో) ఒకే ప్రాంతంలో కూడా వైవిధ్యాన్ని కలిగి ఉంటుంది. కాబట్టి, దానికి సార్వజనీనత లేదు. అందుకే సంప్రదాయవాదులు పై పరిణామాలను తీవ్రంగా పరిగణించారు. ఈ సమయంలోనే వ్యావహారిక భాషలో వ్రాయబడ్డ శెట్టి లక్ష్మీ నరసింహం (విశాఖపట్నం) 'గ్రీకు పురాణ కథల'లో కొంత భాగం స్కూల్ ఫైనల్ పాఠ్యగ్రంథంలో చేర్చబడింది. ఈ పరిణామాలు సంప్రదాయవాదులను మరింతగా బాధించాయ్.

ఈ దశలో శ్రీ జయంతి రామయ్యపంతులు ప్రెసిడెన్సీ మేజిస్ట్రేట్‌గా మద్రాసులో సుమారు మూడేళ్ళు నివాసం ఉన్నారు. వారు ఆంధ్ర భాషా వాఙ్మయాభివృద్ధికి ఒక సంఘాన్ని ఏర్పరచటం అవసరమని భావించి "ఆంధ్ర భాషా మహా సంఘం' శీర్షికతో ఒక వ్యాసాన్ని ఆంధ్రపత్రికలో ప్రకటించారు. శ్రీ మహారాజా రావు వేంకటకుమారమహీపతి సూర్యారావు (పిఠాపురం రాజా) సైతం ఈ విషయమై సుముఖత వ్యక్తం చేసి ప్రోత్సహించడంతో, ప్రణాళికా రచన నిమిత్తం 'దన్మోరు'లో 1911వ సంవత్సరం మార్చి 26న ఒక సభ ఏర్పాటు చేయబడింది.

ఈ సభకు సర్వశ్రీ 1. రావు బహద్దర్ కందుకూరి వీరేశలింగం పంతులు 2. వేదం వేంకట రాయశాస్త్రులు 3. మొక్కపాటి సుబ్బారాయుడు 4. చెన్నాప్రగడ భానుమూర్తి 5. గోటేటి కనక రాజు 6. వావిలికొలను సుబ్బారావు 7. దినవహి హనుమంతరావు 8. కొమఱ్ఱాజు లక్ష్మణరావు హాజరయ్యారు.

ఆంధ్ర భాష, వాఙ్మయాల అభివృద్ధికై ఒక మహాసంఘం ఏర్పరచడానికి సభ్యులు ఏకగ్రీవంగా నిర్ణయించారు. సంఘం ఏర్పడిన తరువాత జరుపవలసిన కార్యక్రమాలలో సమగ్రమైన నిఘంటువు నిర్మాణం ముఖ్యమని వీరేశలింగం పంతులుగారు ప్రతిపాదించారు. స్థాపించబోయే సంఘానికి కావలసిన ధనమంతా తామే ఇస్తామని మహారాజా ప్రకటించారు.

రెండవ సమావేశం తిరువల్లిక్కేణి ఉన్నత పాఠశాలలో 1911 మే 12 న రాజావారి అధ్యక్షతన ప్రారంభమై, ఇతర పనులవలన రాజావారు బైటకు వెళ్ళడంతో శ్రీ న్యాపతి సుబ్బారావు అధ్యక్షతన కొనసాగింది. నిబంధనల నిర్మాణానికి ఒక సంఘం నియమింపబడింది. ఈ సమావేశంలోనే 'సాహిత్య పరిషత్' అనే పేరు 'వంగీయ

సాహిత్య పరిషత్' నుండి గ్రహించారు. 'దేశ భాషలందు తెలుగులెస్స' సంస్థ యొక్క ఉద్దేశసూచక సంగ్రహవాక్యం (మోటో)గానూ, సరస్వతీ విగ్రహము లాంఛనం (క్రెస్ట్) గాను గ్రహింపబడింది.

నిబంధనలలో పరిషత్ సభ్యులు 1. ప్రతిష్ఠాపకులు 2. ఉద్ధారకులు 3. పోషకులు 4. యావజ్జీవ సభ్యులు 5. సాధారణ సభ్యులు అని ఐదు వర్గాలుగా ఉండాలని నిర్ణయించారు. పిఠాపురం, వెంకటగిరి, మహారాజులు ప్రథమ ప్రతిష్ఠాపకులుకాగా, మరికొంత కాలానికి బొబ్బిలి మహారాజా చేరారు. శనివారపుపేట, మునగాల, ముక్త్యాల, నడిమితిరువూరు జమీందారులు పోషకులయ్యారు. 25 మంది యావజ్జీవ సభ్యులయ్యారు. ఉయ్యూరు జమీందారు ఉద్ధారకులయ్యారు. విద్యాధికులను చందాలతో నిమిత్తం లేకుండానే సభ్యులుగా చేర్చుకొనవచ్చని నిర్ణయమైంది. తేది. 08-04-1913న బ్రిటిష్ కంపెనీ ఏక్ట్ ప్రకారం సంస్థ రిజిష్టర్ కాబడింది.

**ప్రస్థానం:**

భాషా శాస్త్రజ్ఞుల మధ్య అనేక వాద, ప్రతివాదాలు; నాటి ప్రభుత్వంతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపి, పరిషత్ తొలి విజయంగా పాఠ్యగ్రంథాలలో వ్యావహారిక భాష చేర్చరాదనే నిబంధన తేగలిగారు. పిఠాపురం మహారాజా ప్రోత్సాహంతో 1921లో మద్రాస్ నుండి పిఠాపురానికి, ఆతరువాత సంవత్సరమే కాకినాడకు సాహిత్య పరిషత్ తన విలాసాన్ని మార్చుకుని 1946 వరకూ ప్రైవేట్ భవనంలో నిర్వహింపబడింది.

శాసనాలను విమర్శనా పూర్వకముగా ప్రకటించడం; అముద్రిత గ్రంథాలను ప్రకటించడం; పుస్తక భాండాగారాన్ని స్థాపించడం; సమగ్రాంధ్ర నిఘంటు నిర్మాణం; శాస్త్ర పారిభాషిక పద ప్రకటనము; భారత ప్రయోగానుక్రమణిక; పాఠభేద సహిత గ్రంథ ప్రకటనము; విజ్ఞాన సర్వస్వ సంగ్రహము; సమగ్ర ఆంధ్ర భాషావ్యాకరణం రూపొందించడం - ఇవన్నీ దశలవారీగా అమలుచేయడానికి నిర్ణయించిన పరిషత్ ప్రాథమిక మరియు ప్రధాన లక్ష్యాలు. అందుకోసం వివిధ ప్రాంతాలనుండి ఐదువేల తాళపత్ర గ్రంథాలను సేకరించారు. పత్రిక చందాదారులందరినీ సంస్థ సభ్యులుగా పరిగణించారు.

దరిమిలా, శ్రీ జయంతి రామయ్య పంతులు, శ్రీ కాశీభట్ట సుబ్బయ్య శాస్త్రి, కవి సార్వభౌమ శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి, శ్రీ బండారు తమ్మయ్య, శ్రీ దంటు భాస్కరరావు నిర్వహణా బాధ్యతలను చేపట్టి పరిషత్ సేవచేసారు. శ్రీ భాస్కరరావు హయాంలో సంస్థ ప్రభుత్వపరం చెయ్యబడి, 1973వ సంవత్సరం జూన్ నెలలో పురావస్తు శాఖ  పరిధిలోకి వచ్చి నాటినుండి Andhra Sahitya Parishad Government Museum & Research Institution పేరిట నిర్వహింపబడుతోంది. ఇలా ప్రభుత్వపరం చేయడం వలన నిర్వహణకు ఆటంకం లేకుండా,  ఏ ఒక్కరిమీదో ఆధారపడకుండా కొనసాగేందుకు అవకాశం ఏర్పడింది.

***

ఇంతవరకూ, కేవలం చరిత్రపాఠంలా సంక్షిప్తంగా వివరాలను విహంగవీక్షణ చేశాం. నిజానికి ప్రాచీన ఆంధ్ర సాహిత్య పరిరక్షణలో,  పునరుజ్జీవనంలో పరిషత్ కృషి, పరిశ్రమ, ఆంధ్రజాతికి అందజేసిన బహూకృతులు – వీటన్నిటినీ కేవలం లభ్యమైన గ్రంథాలను ఆధారంగా చేసుకొని వర్ణించడానికి ప్రయత్నించడం కష్ట సాధ్యమే. అందుకే, సాహితీమూర్తులైన మహనీయుల మాటలలో –

**“తొలుత నిది శ్రీ పిఠాపురం మహారాజా వారి దయాసార ప్రసారముచే శ్రీ జయంతి రామయ్య పంతులు గారి నిశిత పర్యవేక్షణ క్రింద దివ్యాతి దివ్యముగా నాంధ్ర భాషాలోకమున ననంతోపకారము చేసి సంప్రదాయ రక్షకులకు సర్వ విధముల పాటుపడిన సంస్థ. ఆనాటి యాంధ్ర సాహిత్య పరిషత్ పత్రికలు ప్రౌఢ సాహిత్య విమర్శకములు. ఈ పరిషత్ మున్ను మహా గ్రంథములు బ్రకటించినది. తాళపత్ర గ్రంథములు అనంతముగ సేకరించినది. హరిభట్టు, శ్రీనాథాది మహాకవులెందరివో అముద్రిత గ్రంథములు ప్రకటించినది. సూర్యారాయాంధ్ర  నిఘంటువు ఈ మహా పరిషత్ యొక్క బీజభావమే యగుచున్నది. విగుర్వణాది బహు శబ్దముల యర్థ నిర్ణయమునకు నాటిపండితులు మహా వ్యాసములు నాటి పరిషత్ పత్రికలతో ననేకములు గ్రథియించి భాషా పోషణము చేసిరి.**

**ఆనాడాంధ్ర సాహిత్య పరిషత్ పత్రికలలో జరిగిన సాహిత్య సేవ యపారము. ఒక వైపున బిడుగు వంటి గిడుగు రామమూర్తిపంతులు గారు వాడుక భాషా ధ్వజమెత్తి**

**గ్రాంథిక భాషా దుర్గము యొక్క కొమ్ముల మర ఫిరంగులతో భేదించుచుండగా నాంధ్ర సాహిత్య పరిషదనుయాయులైన మహారథులీ కోట శిథిలము కాకుండగా సంరక్షించినారు"** – ఇవి **కవి సామ్రాట్ శ్రీ విశ్వనాథ సత్యనారాయణ** సంస్థ 44వ వార్షికోత్సవ సభలో అధ్యక్షోపన్యాస సందర్భంలో పలికిన మాటలు, మనం ప్రత్యక్షంగా దర్శించలేని ప్రాభవాన్ని, ప్రభావాన్ని ఇపుడు అంచనా వేసుకునేందుకు ఉపకరించే సాక్షర సాక్ష్యాలు.

ఒక సంస్థ ఉన్నతి దానిని నడిపించే వ్యక్తుల పాండితీ ప్రకర్ష, నిబద్ధతలపైనే ఆధారపడి ఉంటుంది. పరిషత్ సౌభాగ్యమో లేదా ఆ వ్యక్తులకు అందిన అవకాశమోగానీ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులుగా పనిచేసిన మహనీయులందరూ సంస్థ కీర్తి పతాకను సమున్నతంగా ఎగరేసినవారే. వ్యక్తిగత సాహితీ జీవితం, పరిషత్ పురోగమనం పరస్పరం పెనవేసుకున్న వారి జీవన విశేషాలను ఈ సందర్భంగా రేఖామాత్రంగానైనా స్పృశించటం ఆవశ్యకం.

**శ్రీ జయంతి రామయ్య పంతులు :** తెలుగులో వ్యావహారిక భాషోద్యమం జరిగినప్పుడు గ్రాంథికవాదులకు నాయకత్వం వహించి పోరాడి, ఆంధ్ర వాఙ్మయానికి సర్వతోముఖ సేవచేసిన మహనీయులు రామయ్య పంతులుగారు. రాజస్వ మండలాధికారిగా (తొలి తెలుగు డిప్యూటీ కలెక్టర్) పనిచేస్తూ అనేక శాసనాలను సేకరించి పరిశోధించారు. వీటిలో దేవులపల్లి శాసనం, యుద్ధమల్లుని బెజవాడ శాసనం ముఖ్యమైనవి. ఇలా సేకరించిన శాసనాలలోని పద్యాలను క్రోడీకరించి "శాసన పద్య మంజరి" పేరుతో రెండు భాగాలుగా ప్రచురించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినవి కాక 1926 వరకు సేకరించిన తెలుగు శాసనాలను పరిష్కరించి "దక్షిణ హిందూదేశ శాసనాలు" పదవ సంపుటంగా ప్రకటించారు.

పరిషత్ ఆవిర్భావానికి ప్రధాన కారకులై, ప్రథమ అధ్యక్షునిగా 09.02.1941 వరకూ సేవలందించిన వీరు పరిశోధకులేకాక రససిద్ధులైన కవి. ఉత్తర రామచరిత్ర, చంపూ రామాయణం వీరి స్వతంత్ర రచనలు. పిఠాపురం మహారాజా ఆర్థిక సహాయంతో "సూర్యరాయాంధ్ర నిఘంటువు" నిర్మాణాన్ని ప్రారంభించారు. ఆంగ్లభాషలో "డిఫెన్స్ ఆఫ్ లిటరరీ తెలుగు", "ద్రవిడియన్ లెక్సికోగ్రఫీ" (1925)

అనే భాషా గ్రంథాలు, "ఆధునికాంధ్ర వాఙ్మయ వికాస వైఖరి" (1937) అనే విమర్శనాత్మక గ్రంథాన్ని రచించారు. గ్రాంథిక భాషావాదిగా తన వాణిని బలంగా వినిపించిన వీరు ఫిబ్రవరి 19, 1941 సంవత్సరంలో మరణించారు. 'ఆంధ్ర సాహిత్య పరిషత్తుకు శాశ్వత భవన నిర్మాణం' అనేది జయంతి వారి సంకల్పం. వీరి మరణానంతరం వీరి సోదరి ప్రభల వెంకట సుబ్బమ్మ కల్పించిన ధనసహాయంతో ఇది సాకారమైంది (సంబంధిత శిలా ఫలకాన్ని మనం పరిషత్ భవనంలో నేటికీ చూడవచ్చు).

**పిఠాపురం మహారాజా శ్రీ రాజారావు సూర్యారాయ బహద్దరు :** వీరు శ్రీ రాజా గంగాధర రామారావు మరియు మహారాణి మంగమాంబలకు అక్టోబర్ 5, 1885 న జన్మించారు. మద్రాస్ నెవింగ్టన్ కళాశాలలో విద్యాభ్యాసం చేస్తూండగా ప్రిన్సిపాల్ మొర్రిసన్ ప్రోద్బలంతో భారతీయ సంస్కృతిని, సంస్కృత భాషల పట్ల మక్కువను పెంచుకున్నారు. వీరికి ఆంధ్ర, ఆంగ్ల భాషా పండితులు శ్రీ మొక్కపాటి సుబ్బారాయుడు గురువుగా మార్గదర్శిగా నిలిచి ఉన్నతవ్యక్తిగా మలిచారు. బ్రహ్మర్షి రఘుపతి వేంకటరత్నం సాంగత్యం ఆధ్యాత్మిక చింతనను; కందుకూరి వారితో పరిచయం సంఘసంస్కరణాభిలాషను పాదుకొల్పింది. నిఘంటు నిర్మాణానికి ఆర్థిక పరిపుష్టిని అందజేయుటలో, తొలి తెలుగు టైపు రైటర్ రూపకల్పనలో కీలక భూమిక వహించారు. ఎందరో కవులు వారి కావ్యాలను రాజా వారికి అంకిత మిచ్చారు. సంస్కృత, వేద వాఙ్మయాలలో సేవ మాత్రమే కాక వీరి అభినివేశమూ ప్రశంసనీయమైనది.

**శ్రీ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి :** మహాభారతము, శ్రీమద్రామాయణము, భాగవతము ఈ మూడింటిని తెలుగు చేసి, అచ్చు వేసి సహస్రమాస జీవితోత్సవము జరిపించుకొన్న అవిశ్రాంత సాహితీ స్రష్ట, ద్వితీయ శ్రీనాథులు శ్రీ కృష్ణమూర్తి శాస్త్రి. లక్షల పద్యాలు రచించిన వీరి పట్టుదల తెలుగు కవులకొక యొరవడి. కవిరాజ, కవి సార్వభౌమాది బిరుదులు, కనకాభిషేకము పొందుట వీరి ప్రతిభాతిశయాలకు తార్కాణాలు. శ్రీ జయంతి రామయ్య పంతులుగారి అనంతరం పరిషత్తుకు అధ్యక్షత వహించి దాని పురోభివృద్ధికి కృషిసలిపారు.

**శ్రీ కాశీభట్ట బ్రహ్మయ్య శాస్త్రి :** "అల్పదోషమైనా కావ్యమందు సహించక విమర్శ చేసేటప్పుడు యమునికన్నా ఎక్కువ నిర్ఘృణుడు"అని గిడుగు రామ్మూర్తి గారిచే ప్రశంసలందుకున్నవారు శ్రీ బ్రహ్మయ్య శాస్త్రి. మాధవ విద్యారణ్యులు, శిష్ట్లు కృష్ణమూర్తి కవి, నారాయణ భట్టు, నాచన సోముడు మొదలగు వారి ప్రత్యేక జీవితములు వ్రాసిన చరిత్రజ్ఞులీయన. పరిషత్ మూడవ అధ్యక్షునిగా నిర్వహణ బాధ్యతలను వహించి సంస్థ ఖ్యాతిని సముజ్జ్వలంగా భాసింపచేశారు.

**ఐతిహాసిక సామ్రాట్ శ్రీ బండారు తమ్మయ్య :** శ్రీనాథునిపై పరిశోధనతో విమర్శకునిగా ఖ్యాతిపొంది 'శ్రీనాథ మహాకవి – గుణతత్త్వ విచారం' అనే సమగ్రవ్యాసం ప్రకటించడం, పాల్కురికి సోమనాథుని బసవపురాణం సులభశైలిలో వ్రాయవలసిన ఆవశ్యకతను కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారి దృష్టికితెచ్చి ముద్రింపచేయటం, పండితారాధ్య చరిత్రను ముద్రింపచేయటం, వేమనకు యోగిగా మాత్రమేకాక కవిగా ప్రాచుర్యం సంతరింపజేయ ప్రయత్నించడం అనన్య సామాన్యమైన వీరి విజయాలు.

"వీరి నిరంతర కృషి మూలంగానే ఆంధ్రమున వీర శైవవాఙ్మయమునకు గొప్పస్థానం లభించింది. లేకపోతే, అది ఏ జంగపు పాటల క్రిందనో నామరూపాలు లేక పడిఉండేది" – శ్రీ చిలుకూరి నారాయణరావు పంతులుగారి పై ప్రశంస ప్రత్యక్షర సత్యం. గిడుగు రామ్మూర్తి పంతులుగారన్నట్లు "He is an authority on what he writes". పరిషత్ ప్రారంభం నుండి సభ్యునిగా పాలుపంచుకున్న శివశ్రీ తమ్మయ్య అనంతర కాలంలో అధ్యక్ష బాధ్యతలనూ వహించి ముందుకు నడిపారు.

**శ్రీ దంటు భాస్కర రావు :** ఆంధ్ర సాహిత్య పరిషత్ ప్రధాన కార్యదర్శిగా ఘనమైన సభలు నిర్వహించి ఆంధ్ర దేశంలోని ప్రతిభావంతులైన కవి పండితులను కాకినాడకు రప్పించి, వారి కళా వైశారద్యాన్ని సాహితీ లోకానికి చవి చూపించిన అభినవ ఆంధ్ర భోజులు భాస్కరరావు. సాహిత్యపరిషత్ ప్రతినిధిగా ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి సభ్యులుగా ఎన్నుకోబడి, గణనీయమైన భాషా సేవ చేశారు. రసజ్ఞునిగా, కళాభిమానిగా, దాతగా, మానవతా వాదిగా, పురపాలక సంఘాధ్యక్షునిగా, శాసనసభ్యునిగా వీరిది బహుముఖీన ప్రజ్ఞ. డా. రాధాకృష్ణన్, డా. సంజీవరెడ్డి, డా. గోపాలరెడ్డి మొదలగు మహనీయుల అభిమానాన్ని పొందిన వీరు,

సూర్యారాయాంధ్ర నిఘంటువు పరిపూర్తి కావింపబడడంలో అద్వితీయ కృషి జరిపారు. సాహిత్య పరిషత్ స్వర్ణోత్సవాలలో డా. శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణన్‌చే సూర్యారాయాంధ్ర నిఘంటువును ఆంధ్ర ప్రజలకు అంకితం చేయించిన ఘనత భాస్కరరావుగారిదే. వీరి హయాంలోనే 1973లో పరిషత్ ప్రభుత్వపరం చేయబడింది.

***

సర్ వెలుగోటి శ్రీ రాజ గోపాలకృష్ణ యాచేంద్ర బహద్దర్, సర్. శ్రీ రావు వేంకట శ్వేతాచలపతి రంగారావు బహద్దర్, డా. శ్రీ విక్రమదేవ వర్మ బహద్దర్, దివాన్ బహద్దర్ పానుగంటి రామరాయనిం, శ్రీ రాజా శ్రీరంగ దేవరాయలు, దివాన్ బహద్దర్ వి. రామభద్ర నాయుడు, రాయ్ సాహెబ్ గుమ్ముదూరి వేంకట రంగారావు, శ్రీ రాజా మంత్రిప్రెగడ భుజంగరావు బహద్దర్, సర్. మోచర్ల రామ చంద్రరావు పంతులు, సర్ వేపా రామేశం పంతులు, రావు బహద్దర్ కందుకూరి వీరేశలింగం పంతులు, శ్రీ వేదం వేంకట రాయ శాస్త్రి, శ్రీ రఘుపతి వేంకటరత్నం నాయుడు, శ్రీ చెళ్ళపిళ్ళ వేంకట శాస్త్రి, శ్రీ మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి ... ఇలా ఎందరో పరిషత్ ఆవిర్భావ వికాసాలలో పాలు పంచుకొని సుసంపన్నం చేశారు.

**శ్రీ సూర్యారాయాంధ్ర నిఘంటువు :** భాషను స్థిర పరచుకోవడానికి, భాషా వ్యవస్థను పరిశీలించడానికి, భాషా జ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవడానికి నిఘంటువులు ఉపకరిస్తాయ్ – 'కోశవాన్ ఆచార్యః'. అందుకే, తొలి సమావేశంలోనే పరిషత్ నిఘంటు నిర్మాణ లక్ష్యాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఎంచుకుంది.

వందేళ్ళ పైబడిన భాషాసేవలో అగ్రస్థానం పొందిన విజయం – తెలుగు భాషకు సర్వతోముఖ సంపూర్ణ పదజాల కోశము అనదగిన ఈ నిఘంటు నిర్మాణం. ఈ మహాయజ్ఞాన్ని తలపెట్టిన శ్రీ రావు కుమార వేంకట మహీపతి సూర్యారావు బహద్దరు మహోన్నత ఆశయానికి ఈ నిఘంటువు ప్రతీక. 1930లో ప్రారంభించిన ఈ నిఘంటువు 1949లో సంస్థానాలు ప్రజాపరం చేయబడేనాటికి వ్రాత ప్రతిగా వెలువడింది.

శ్రీ జయంతి రామయ్య పంతులు ఆధ్వర్యంలో 1949లో నాల్గు సంపుటాలను ప్రకటించిన తరువాత, నిఘంటు కార్యాలయము కారణాంతరాల వలన

నిలిచిపోయింది. ఆ పరిస్థితులలో డా. గిడుగు వేంకట సీతాపతి 1957 లో రాజా వారి ఆజ్ఞాపత్రం పొంది, రాష్ట్ర ప్రభుత్వం నుండి ఐదువేల రూపాయలను, కేంద్ర ప్రభుత్వం నుండి ఎనిమిది వేల రూపాయలను సహాయం పొంది మద్రాసులో 5,6,7 సంపుటములలో ఎక్కువ భాగము పూర్తిచేశారు. ఈ సంపుటాలను, మిగిలిన వ్రాత ప్రతులను పరిషత్ కార్యదర్శి శ్రీ దంటు భాస్కరరావు, కవి సార్వభౌమ శ్రీ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి ఆదేశంపై శ్రీ సీతాపతికి తమ స్వంత ధనం ఐదువేలు ఇచ్చి కాకినాడ పరిషత్ కార్యాలయానికి తరలించారు. 1958 జూన్ 12వ తేదిన పరిషత్ వార్షికోత్సవ మహా సభలలో డా. సర్వేపల్లి రాధాకృష్ణ పండితులు ఆవిష్కరించారు.

శ్రీ దంటు భాస్కరరావు కోరికపై కళాప్రపూర్ణ శ్రీ వెంపరాల సూర్యనారాయణ శాస్త్రి, డా. దివాకర్ల వెంకటావధాని, శ్రీ శశాంక (శ్రీ వోలేటి వేంకట సుబ్బారావు) డా. పాటిబండ మాధవ రామశర్మ, శ్రీ శిరోమణి కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, శ్రీ డా. జి.వి. సుబ్రహ్మణ్యం, డా. కేతవరపు రామకోటి శాస్త్రి సహాయముతో వ్రాతప్రతిని తయారుచేసి కాకినాడ పంపారు. 7వ సంపుటానికి ఆంధ్ర సాహిత్య అకాడమి (హైదరాబాద్) ఐదువేలు సహాయంచేయగా, దంటు భాస్కరరావుగారు, శ్రీ పి. సీతాపతిరావు సహాయముతో 1972లో పూర్తిచేయబడింది. అప్పటికే అందుబాటులో ఉన్న అనేక నిఘంటువులలో "ప్రతి పదానికి ప్రాచీన సాహిత్యంలో ప్రముఖమైన పలు ప్రయోగాలను సోదాహరణంగా అందించడం" అనే లక్షణం సూర్యరాయాంధ్ర నిఘంటువుకు ప్రత్యేకతను సంతరింపజేసింది. ఆ విధంగా పిఠాపురం మహారాజా కోరిక నెరవేరి సంపూర్ణ ప్రతి 7 సంపుటాలుగా రూపొంది ఆంధ్రులకు, ఆంధ్రభాషకు ఒక అమూల్య అలంకారాన్ని అందజేసిన ఘనతను సాహిత్య పరిషత్తు పొందింది.

***

**ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక :** ప్రాచీన సాహిత్యానికి, గ్రాంథిక భాషకు – ముఖ్యంగా విమర్శకు ఎంతో సేవచేసిన పత్రిక ఇది. మొదట త్రైమాసిక పత్రికగా వెలువడి, తరువాత మాస పత్రికగా మారింది. ప్రపంచ యుద్ధం కారణంగా కాగితానికి కొరత ఏర్పడడంతో 1919 నుండి మరల ద్వైమాసిక పత్రికగా వెలువడింది. మొదట మద్రాసు నుండి తరువాత కాకినాడ నుండి పరిషత్తుతో పాటు పత్రికనూ

నిర్వహించారు. మద్రాసులోని 'జ్యోతిష్మతీ ముద్రాక్షరశాల' లో పత్రిక ప్రచురణ జరిగేది. ఎన్నో వాద, వివాదాలకు నిలయమై, చారిత్రక, భాషా పరమైన అనేక విచికిత్సలకు సాధికారక ముగింపునిస్తూ, సమకాలీన సాహితీ స్రష్టల సహకారంతో 1912 (పరీధావి నామ సంవత్సరం) నుండి 1970 (కీలక నామ సంవత్సరం) వరకూ వెలువడింది. రెండవ సంపుటం నుండి ఆరవ సంపుటం వరకు పత్రిక 8 సంచికలుగా వెలువడింది. సంవత్సరమంతా వెలువడిన దానిని సంపుటమని, రెండు నెలలకొకసారి వెలువడిన దానిని సంచిక అని పేర్కొన్నారు.

చాలా కాలం జయంతి రామయ్య పంతులు ప్రధాన సంపాదకత్వం వహించగా కొత్తపల్లి సూర్యారావు నిర్వాహకులుగా పనిచేసారు. అలనాటి ప్రసిద్ధ పండితుల, కవుల, విమర్శకుల రచనలతో సాహితీ విందునందించిన ఈ పత్రిక ద్వారా ప్రాచీన కావ్యాలు పరిష్కరించబడి వెలుగులోకి వచ్చాయి. శాసన, చారిత్రక పరిశోధనా వ్యాసాలకు ప్రాముఖ్యత లభించింది. శాస్త్ర పారిభాషిక పదాల ప్రకటన, కావ్య పాఠ్య భేదాల ప్రకటన, వ్యాకరణ చర్చలు, గ్రంథ సమీక్షలు మొదలగునవి సాహితీ ప్రియులకు చేరువ చేయుటలో సాహిత్య పరిషత్ సేవ మరువలేనిది. పత్రికకు సంబంధించిన అనేక విషయాలు 'జమ్మలమడక శ్రీపాప' పరిశోధక గ్రంథంలో పొందుపరచబడ్డాయ్.

***

**పరిషత్ ప్రస్తుత స్థితిగతులు :** కాకినాడ, రాజాట్యాంక్ పార్క్ ప్రధాన ద్వారానికి ఎదురుగా ఉన్న రామారావుపేట వీధిలో ఆర్క్యలాజికల్ మ్యూజియం భవనంలో ఆంధ్ర సాహిత్య పరిషత్ నిర్వహింపబడుతోంది. క్రీస్తుశకం 11వ శతాబ్దంలో నన్నయ్య రచించిన మహాభారతంలోని ఆదిపర్వం, 14వ శతాబ్దం నాటి శ్రీనాథ విరచిత భీమఖండం, 16వ శతాబ్దంలో పిల్లలమర్రి పినవీరభద్రుడు రచించిన జైమినీ భారతం, రామాయణంలో కిష్కింధకాండ, నటరాజ యశోభూషణం లాంటి సుమారు 8వేల తాళపత్ర గ్రంథాలు ఈ భవనంలో నేడు ప్రదర్శనగా ఉంచబడ్డాయ్.

ఆంధ్ర శబ్ద చింతామణి, శ్రీనాథుని శివరాత్రి మాహాత్మ్యము వంటి కావ్యాల వ్రాతప్రతులు ఉన్నాయ్. ఈ గ్రంథాలతోపాటు, అక్షరాల ముద్రణకి బంగారాన్ని వాడిన అరబిక్ పుస్తకం సందర్శకులకు మ్యూజియంలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

పశ్చిమగోదావరి జిల్లా పెదవేగిలో తవ్వి తీసిన 2,50,000 సంవత్సరాల నాటి పాత శిలాయుగపు రాతి పనిముట్లు, ఒకటవ శతాబ్దంలో కాకినాడ సమీపంలో చొల్లంగి గ్రామంలో ప్రజలు వాడిన మట్టిపాత్రలు మొదటి, రెండవ ప్రపంచ యుద్ధాల్లో ఉపయోగించిన కత్తులు, బాకులు; సింధునాగరికతకు చెందిన ముద్రల నకళ్ళు, ఐదవ శతాబ్దంనాటి యక్షిణుల ప్రతిమలు, తెలుగు లిపి పరిణామక్రమాన్ని తెలియజేసే చార్టులు, పండరంగని అద్దంకి శాసనం, యుద్ధమల్లుని బెజవాడ శాసనాలతో సహా 88 పరిష్కృత శాసనాలు; తూర్పు చాళుక్యుల దాన శాసనాలు, వివిధ కాలాల నాణాలు, ఏనుగు దంతంతో చేసిన పెద్ద పాచికలు, పురాతన పంచలోహ విగ్రహాలు, వివిధ కాలాలకు చెందిన ఎన్నో అద్భుతమైన శిల్పాలు, ఉభయ గోదావరి జిల్లాలలో తవ్వకాల్లో బయటపడిన పురాతన హైందవ, బౌద్ధ, జైన విగ్రహాలు మ్యూజియంలో చూపరుల దృష్టిని ఆకర్షిస్తాయి. మొత్తం మీద ఐదువేల తాళపత్ర గ్రంథాలు, ఏడు వందల వ్రాత ప్రతులు, వివిధ భాషలకు చెందిన 10,400కు పైగా గ్రంథాలు ఇక్కడ పరిరక్షింపబడుతున్నాయ్.

అముద్రిత గ్రంథ చింతామణి, ఆంధ్ర భారతి సంవత్సరాది సంచికలు, పరిషత్ పత్రికలు, ఆంధ్రి, కల్పలత, భారతి, చంద్రిక, చింతామణి, ధన్వంతరి, గృహలక్ష్మి, కిన్నెర, ప్రతిభ, సరస్వతి, సమదర్శిని, విభూతి, యధార్థ భారతి, ఆంధ్ర దేశీయ కథావళి, చిత్రకళ, అభ్యుదయ, భారత జ్యోతి, ఆంధ్ర మహిళ, ఆంధ్ర వైద్య సమ్మేళన, ఆంధ్ర విశ్వకళాపరిషత్, జయంతి, నవభారతి, మనోరమ, మహతి, ప్రబంధ కళావల్లరి, సంస్కృతి, సాక్షి, సామయోగము, ఉదయలక్ష్మి – మొదలైన అనేక సాహిత్య, వైద్య, వ్యాకరణ, చిత్రకళ, చరిత్రలకు చెందిన పత్రికలు లభ్యమవుతున్నాయ్. కొన్ని ఆయుర్వేద గ్రంథాలను సి.డి.లలో నిక్షిప్తం చేశారు. ప్రత్యేక సంచికలు కొన్ని గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయి. ఈ సంరక్షణ బాధ్యతను సహాయ సంచాలకులు, సాంకేతిక అధికారి, నలుగురు సహాయకులు, బైండర్, వాచ్‌మాన్, ఇతర సిబ్బంది వహిస్తున్నారు.

సంస్థ శత వసంతాలను పూర్తి చేసుకున్న సమయంలో విలువైన సంపద శిథిల స్థితికి చేరువకావటం, ఇవన్నీ ఓ పాతభవనంలో ఇనుప బీరువాలలో బంధింపబడడం సాహితీ ప్రియులను, చారిత్రక పరిశోధకులను కలచివేసే అంశం.

అయితే, ఇప్పటికే 3,500 తాళపత్ర గ్రంథాలకు కెమికల్ ట్రీట్మెంట్ ఇచ్చి సంరక్షించినట్లు అధికారులు తెలియజేయడం కొంత ఊరట కలిగించే విషయం. కానీ శాశ్వత భవన నిర్మాణం విషయమై పన్నెండవ ఆర్థిక సంఘం నిధులు మంజూరు కాబడినా రాష్ట్ర విభజన అనంతర పరిణామాల నేపథ్యంలో మరలా యథాస్థితే కొనసాగుతోంది.

***

ఆధునికీకరణ మాట అటుంచితే, కొంతకాలం నిద్రాణంగా ఉన్న పరిషత్ కార్యకలాపాలు గత మూడు సంవత్సరాలుగా క్రమంగా నిర్వహింపబడుతున్నాయ్. పరిషత్ చివరి కార్యదర్శి శ్రీ దంటు భాస్కరరావు కుమారులు శ్రీ దంటు సూర్యారావు వదాన్యతకు శాస్త్రీయ విజ్ఞాన పరిషత్, ఆస్వాదన సాహితీ సమితి సభ్యుల సహకారం, వంగూరిఫౌండేషన్ వంటి సంస్థల తోడ్పాటు, ప్రభుత్వసహాయం, సాహిత్యాభిమానులైన జిల్లా అధికారుల ఆదరణతో ఆంధ్ర సాహిత్యపరిషత్ శతజయంతి సభలు వరుసగా పన్నెండు నెలలు జరిగి శత వార్షికోత్సవ సభలు సాహితీ మూర్తులు, రాజకీయ ప్రముఖుల సమక్షంలో ది.29 జూన్ 2013 నుండి మూడురోజులపాటు ఘనంగా నిర్వహింపబడ్డాయ్. కొనసాగింపుగా "పరిషత్ ప్రభావైజయంతి" పేరిట తరచుగా పరిషత్ సంబంధిత వ్యక్తులు, సేవలపై సమావేశాలు జరుగుతున్నాయ్. ఆ విధంగా సంస్థ పునరుజ్జీవింపబడినదనవచ్చు.

***

అయితే, ఘనమైన పరిషత్ పునర్వైభవానికి ప్రభుత్వం మరింతగా దృష్టి సారించాలి. ప్రత్యేక నిధులు కేటాయించి శాశ్వత భవనాన్ని ఇతర ఆవశ్యక నిర్మాణాలూ చేపట్టాలి. ఆధునిక సాంకేతిక విజ్ఞానంతో గ్రంథాలన్నిటినీ డిజిటైజేషన్ చేయించి సాఫ్ట్‌కాపీలుగా భద్రపరచాలి. మూల ప్రతులను రసాయనిక విధానాల ద్వారా సంరక్షించాలి.

విశ్వవిద్యాలయాలన్నీ విద్యార్థులను పరిషత్తుతో ముడిపడిఉన్న అంశాలపై పరిశోధనకు ప్రోత్సహించాలి. పాఠశాలలు, కళాశాలలు విద్యార్థులను క్షేత్రపర్యటనలకు తీసుకు వచ్చి అలనాటి భాషా వైభవాన్ని విద్యార్థులకు అవగతం చెయ్యాలి.

సాహిత్య సృష్టి ఒక ఎత్తు. సాహిత్య ప్రచారం మరొక ఎత్తు. సృజనకి ప్రచారం అవసరం. ఆ అవసరాన్ని సాహిత్య సంస్థలు నెరవేరుస్తాయ్, గ్రంథాలను ప్రచురిస్తాయ్, వెలుగులోకి తెస్తాయ్, వ్యాప్తి చెందిస్తాయ్. వెలుగుచూడని అపూర్వ కావ్యాలను ప్రకటించి జాతికి అందజేయుటలో, మూలన పడిఉన్న విలువైన శాసనాలను సేకరించి, చక్కదిద్ది ప్రకటించుటలో, తెలుగు చరిత్ర పునర్నిర్మాణంలో అగణిత భాషా సేవ చేసిన ఈ సాహిత్య పరిషత్ సంరక్షణ ముందుగా చెప్పుకున్నట్లు మొత్తం సమాజపు బాధ్యత. ప్రతి వ్యక్తి సామాజిక బాధ్యత. బాధ్యత నెరిగి ప్రవర్తిద్దాం. గతమెంతో ఘనకీర్తి గలవాళ్ళుగా తృప్తిపొందక వైభవోపేతమైన వర్తమానాన్నీ దర్శిద్దాం.

***

**(ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రికలు, కార్యాలయంలో లభ్యమైన సమాచారంతో పాటు అంతర్జాలంలో అందుబాటులో గల సమాచారాన్ని ఈ వ్యాసరచనలో ఉపయోగించుకున్నాను. ఆ వ్యాసకర్తలందరికీ ధన్యవాదాలు)**

# 15 ఆశాద్వీపంలో కార్తీ (క)వనభోజనం

వేర్వేరు దృక్పథాలు, భావజాలాలు, సాహిత్య నేపథ్యాలు, రచనా విధానాలు గల వ్యక్తులందరినీ సమీకరించి, రెండేళ్ళపాటు అనేక సభలు, సమావేశాలు నిర్వహించి, కాకినాడలో ఓ సుహృద్భావ సాహిత్య వాతావరణాన్ని రూపొందించి, కొనసాగిస్తున్న ఘనత 'సాహితీ స్రవంతి'ది.

ఇది అద్దేపల్లి మానస పుత్రిక. ఇందరం ఒకటి కావడానికి ఒకే ఒక కారణమైన ఆ ప్రజాకవికి అత్యంత ప్రేరణదాయకమైన విషయం సముద్రం. సాగరాన్ని తలచుకున్న ప్రతిసారీ మాష్టారు ఉప్పొంగిపోయేవారు. "బందరు సముద్రం ఒక తన్ను తంతే కాకినాడ సముద్రం ఒడ్డున పడ్డాను"అన్న ఆయన నేలను కూడా 'ఆకుపచ్చని సజీవసముద్రం' గానే భావించారు. సంస్థ వార్షికోత్సవ సంచికలకు కూడా "కడలి చిరునామా", "ఆశాద్వీపం" పేర్లు పెట్టారు. అదిగో ఈ 'ఆశా ద్వీపం' గురించి విన్నప్పటి నుండి అందరికీ ఓసారి చూడాలనే ఉత్సుకత. వారున్నంత కాలం ఎన్నిసార్లనుకున్నా వీలు చిక్కలేదు. ఇంతమందికీ అనువైన రోజు, వాతావరణం అంత సులువుగా కుదరవు కదా! ఎలాగైతేనే శ్రీ గదుల నాగేశ్వరరావు (గనారా) పూనికతో 13, నవంబర్, 2016 న ప్రయాణం సాధ్యమైంది.

సర్వశ్రీ దాట్ల దేవదానం రాజు, అద్దేపల్లి ప్రభు, మధునాపంతుల సత్యనారాయణ మూర్తి, డా. జోశ్యుల కృష్ణబాబు, డా. వుయ్యపు హనుమంతరావు, బొల్లోజు బాబా, ఇంద్రగంటి నరసింహమూర్తి, రామకృష్ణ శ్రీవత్స, పద్మజవాణి, గడల శివప్రసాద్, అద్దేపల్లి జ్యోతి, మద్దా సత్యనారాయణ, మార్ని జానకిరాం చౌదరి, మేడిశెట్టి శ్రీరాములు, కొందరి కుటుంబసభ్యులు మొత్తం 35 మంది ఉదయం తొమ్మిదింటికి 'భానుగుడి' సెంటర్లో కలుసుకున్నాం. అందరం అలా 'సాంబమూర్తి నగర్ ఫ్లై ఓవర్' మీంచి సమూహాలుగా 'ఫిషింగ్ హార్బర్' చేరాం. టూరిజం శాఖవారి బోట్ సిద్ధంగా ఉంది. నెమ్మదిగా అందులో చేరి(దూరి అనాలి), కాసేపాగి కెరటాల ఉద్ధృతి తగ్గాక ముందుగా మషాలా ఉప్మా, పూరి బరువును క్యారియర్‌లోంచి కడుపులోకి చేరవేసాం. స్మార్ట్‌ఫోన్‌ల పుణ్యమాని వీలైనన్ని సాగరదృశ్యాలని బంధించాం. బృందంగా కొన్ని, పక్క వారితో చెవులు కొరుక్కుంటూ మరికొన్ని, బోలెడన్ని కబుర్లు...

మధ్యమధ్యలో టూరిజం వాళ్ళ సూచనలు, హనుమంతరావుగారి ముందు జాగ్రత్తలు. మా వాళ్ళు పడవ నడుపుతున్న భంగిమల్లో ఫోటోలు దిగుతుంటే "వురేయ్ వింజం డైవర్ నన్ను రైలు తోలనిస్తావా నీకు ఫ్పది బీడీలిస్తా" నన్న బుడుగు జ్ఞాపకమొచ్చాడు. మొత్తానికి పదకొండున్నరకి ఆవలి ఒడ్డుకి చేరాం. తగిన లోతు లేకపోవడంతో స్టీమరులోంచి దిగి మరో పడవలోకి మారాల్సి వచ్చింది. తినాల్సిన పదార్థాలు దింపేటప్పటికి తాతలు దిగొచ్చారు. పడవ కూడా ముందుకు జరగదనడంతో మూడు అడుగుల లోతులో కాస్త దూరం, బురదలో ఇంకాస్త, డొంకలలో మరికొంత నడిచి నిర్దేశిత ప్రదేశానికి చేరుకున్నాం. చుట్టూ సర్వీ చెట్లు శ్రద్ధగా పనిగట్టుకు పెంచినట్టు పైన కప్పుగా ఏర్పడి కింద చదునుగా ఎంత అనువుగా ఉందో. బరువులు దింపుకుని దుప్పట్లు పరుచుకుని, కొందరు కూర్చుని, ఇంకొందరు సాగిలపడి సేద తీరారు. నెమ్మదిగా మైక్ అందుకొని రిడిల్స్ అడిగి చిన్న చిన్న బహుమతులిస్తూ ఉత్సాహపరిచే ప్రయత్నం చేసారు జానకి రాంచౌదరి. మద్దావారు ఓ ప్రహేళికా పద్యం, ఆశువుగా మరికొన్ని పద్యాలు, పొడుపుకథలు సంధించారు. అందులో ఒకటి.

పాలనిచ్చుగాని పసరంబు గాదది
పండ్లు చెవులు గల్గు పక్షి యద్ది,

పగలు నిదుర వోయి శయనించు నిశయందు

నడువలేదు, ఎగిరి వెడలునెద్ది – ఎవరో 'గబ్బిలం' అని గట్టిగా చెప్పడం, చప్పట్లు, మరికొన్ని జోకులు కొనసాగింపుగా నవ్వులు. తనవంతు రావడంతో నెమ్మదిగా డా. కృష్ణబాబు మొదలుపెట్టారు:

అల్లము కారముండదిల; నాశకు నంతము కద్దు; చీకటిన్
బిల్లికి చూపులేదు; వరిబియ్యము బ్రాకులయందు తీయనౌ;
బెల్లము చేదుమాన; దలవేము సుధానిధి; చందమామ బల్
నల్లగనుండు; కోకిల వనంబుల నుండు కిరాత జాతియే – కొందరు తెల్లమొహం వేసాం. మేస్టారు కదా! అర్థ వివరణ చేసారు: ఇలా విభజించితే అర్థం పొసగదు. ఇది విరోధం. అయితే "అల్లము కారము; ఉండదు ఇల నాశకు నంతము; కద్దు చీకటిన్ పిల్లికి చూపు; లేదు వరిబియ్యము బ్రాకులయందు; తియ్యనౌ బెల్లము; చేదు మానదల వేము; సుధానిధి చందమామ; బల్ నల్లగనుండు కోకిల; వనంబుల నుండు కిరాత జాతియే" ఇలా చెప్పుకోవడం వలన విరోధం తొలగి అర్థం తేటతెల్లమవుతుంది. ఇది విరోధాభాసాలంకారం అవుతుంది.

దేవదానంరాజు తాను ముందురోజు రాత్రి వ్రాసిన తాజా కవిత "ఒక పగిలిన కల" వినిపించారు. "సౌకర్యాల లేపనం రాసుకున్న వంటికి చెమటచుక్క బరువైన వాడిని; నేలను గజాలుగా కొలతలు వేసుకుంటూ మట్టిని కనకపు రాశులుగా పోగేసిన వాడిని; ఈ రాత్రి నన్నెలా నిద్ర పుచ్చుతుంది?". Demonitization అనంతర పరిణామాలను ఇంత భావగర్భితంగా కవిత్వీకరించడంలో దాట్ల వారి చేయితిరిగినతనం కనిపించింది.

తరువాత, బొల్లోజు బాబా Wadih Saadeh వ్రాసిన Migration కవితకు తన అనువాదం "వలస పోవటం" (translated from Arabic by Anne Fairbairn) వినిపించారు. వాతావరణం ఒక్కసారిగా ఆర్ద్రమయమైంది. ముఖ్యంగా "వారి పాదముద్రల్ని స్పర్శించే ఒకే ఒక దయామయి కాలిబాట ఆ తరువాతెప్పుడూ వారిని చూడలేదు ఎంత ప్రయత్నించినా. ఒక వీధికుక్క ప్రతీ సాయంత్రమూ వచ్చి వారి ఇంటిముందు అరుస్తూండేదని ఆ వూరిలోనే ఉండిపోయిన కొంతమంది చాలాకాలం చెప్పుకొన్నారు" ఈ పాదాలు అందరినీ కదిలించాయ్. వీటన్నిటికీ

మధునాపంతుల ప్రయోక్తగా వ్యవహరిస్తూ సందర్భానుసారంగా ప్రాచీన, ఆధునిక సాహిత్యాల్లో అంశాలను, వారి వైయక్తిక అనుభవాల్ని పంచుకున్నారు.

పరిసరాలను, ప్రసంగాలను ఎంత ఆనందిస్తూన్నా అందరిలో పదే పదే కనిపించిన లోటు అద్దేపల్లి. ప్రయాణంలో చాలాసార్లు "చేతిలో ఒక చెక్క పట్టుకుని కొందరు తమకంటే నాలుగు రెట్లు పెద్దవైన కెరటాల మీద షికారు చేస్తుంటే బీచి నుంచి చూసేవాళ్లకి సముద్రపు రోమాంచాల్లా కనిపిస్తారు" వాక్యం వెంటాడింది. మేస్టారున్న లోకపు కాలమానం తెలియదుగానీ అప్పటికి ఫోంచేస్తుంటే మాత్రం పొలమారి ఉంటుంది.

తరువాత 'అసలు విందు'లో కేరెట్ హల్వా ప్రత్యేక ఆకర్షణ అయింది. అకస్మాత్తుగా రామకృష్ణ శ్రీవత్స కనపడలేదు. కాసేపు సిగ్నల్ లేక ఆయన ఫోన్ పలకలేదు. భోజనాలయ్యేసరికి వచ్చి అలా ఊరు, సముద్రం చూసొచ్చానన్నారు. ఊరికే చూసి రావడం కాదు అక్కడ పిల్లలను (ఆశాద్వీపపు రేపటి ఆశా దీపాలన్నారాయన) పలకరించి వచ్చారు. "నడక కడలి వరకే" దీర్ఘకవితలో శ్రీవత్స అంటారు – "ఆకాశంలానే సముద్రానికీ భాష ఉంది. సముద్ర ఘోష అర్థం కావాలంటే మౌనంగా ఉండాలి" ఆ మౌనమే అతనికి "కనుచూపు మేరా విస్తరించి కదలికలున్న ఆకాశం సముద్రం" అనే తత్త్వాన్ని బోధపరిచింది. మురళీకుమారి కూడా అక్కడ నివాసం ఉంటున్న కుటుంబాలను కలసి బాగోగులు తెలుసుకొని వచ్చారు.

మరలా కాసేపు అంత్యాక్షరి. పడవ వాళ్ళ తొందరతో ఈ లోకంలోకి వచ్చి మెల్లగా సర్దుకుని అడుగులో అడుగేసుకొంటూ బయలుదేరాం. ఈసారి లోతు పెరగడంతో జట్టీ ఎక్కి అందులోంచి పడవలోకి దిగాలి. వచ్చేప్పుడు పెద్ద పడవలోంచి చిన్న పడవలోకి రావాలన్నపుడు, ఇపుడు జట్టీలోంచి పడవలోకి దిగేప్పుడు "బారిష్టర్ పార్వతీశం" నవల, ఇలాంటి సందర్భంలో పార్వతీశం పొందిన ఆందోళన, మొక్కపాటి వారు ఆ సన్నివేశాన్ని నడిపించిన తీరు గుర్తొచ్చి నవ్వొచ్చింది. ఆ పాత్ర స్వభావాన్ని అంత సహజంగా చిత్రించిన రచయిత ప్రతిభ ఎంత గొప్పదో! అనిపించింది.

తిరుగు ప్రయాణంలో మరిన్ని ఆసక్తికర చర్చలు. కవిత్వానువాదం, అనువాద కవిత్వంపై చాలా సేపు బాబా, ప్రభు మాట్లాడుకున్నారు. Wadih Saadeh వ్రాసిన

Night Visit కవితకు బాబా అనువాదం “రాత్రి ఆపద” (translated from Arabic by Anne Fairbairn) గురించి ప్రధాన చర్చ. ‘సాయుధుడు, సైనికుడు’ పదాల ప్రయోగంలో ఎంత తేడా ఉందనేది ముఖ్యాంశం. తినేవేవో పంచుతూ కాస్త బిజీ అయ్యాను గానీ లేకపోతే నేనూ మాట కలిపేవాడినే.

అయితే ఓ సాధారణ పర్యాటకునిలా అన్నీ పరిశీలిస్తూ గడిపిన ప్రభు ఏమీ మాట్లాడకపోయినా ఎపుడో ఆయన వ్రాసిన వాక్యాలు నాకు పదే పదే గుర్తొచ్చాయి. “వాళ్ళు వలలేసి సముద్రాన్ని బయటకు లాగేస్తారా!” “సముద్రపు నీళ్ళలో నాని నాని ఊళ్ళన్నీ అదో రకం బతుకు వాసనేస్తాయి” –ఎంత గొప్ప వాక్యాలో కదా! ఇది సమీక్షా వ్యాసం అయుంటే పై వాక్యాల గురించి ఎంత రాస్తే తనివి తీరుతుంది?

మొత్తానికి గంట ప్రయాణం తరువాత ఒడ్డుకు చేరుకున్నాం.

సముద్రంతోనూ, పల్లెకారుల జీవితంతోనూ దశాబ్దాల సాన్నిహిత్యం గల గ.నా.రా. మాత్రం మౌనంగా వెనకుండి కార్యక్రమాన్ని నిర్వహించారు. అయినా గ.నా.రా.కు ఎంత తెలుసో ‘కడలి కల్లోలం’ నవల చదివిన వారికి ప్రత్యేకంగా చెప్పక్కరలేదు కదా!

మా బృందంలో అతిచిన్న వయసు 12, అతిపెద్ద వయసు 75. ఇంతమందికీ ఎంతో కొంత మోతాదులో ఆహ్లాదాన్ని, మధురానుభూతినీ పంచే ఉమ్మడి అంశాలు ఏమి ఉంటాయి? ఆలోచిస్తే రెండే అనిపించాయి. సాహిత్యం, సాగరం.

కులభోజనాలుగానో, ఇతరత్రా వ్యాపకాలకోసమో చిరునామాలుగా మారుతున్న కార్తీక సమారాధనలు ఇకపై ఒకే వ్యాసంగం పట్ల ఆసక్తి గల సమూహాలుగా నిర్వహింపబడితే భావ వినిమయం సాధ్యమై ఆ విహారం విజ్ఞానదాయకం అవుతుంది, ఆ దిశలో సాహితీ స్రవంతి ఈ ఏడే (2016) తొలి అడుగేసింది.

***

**(ఫిబ్రవరి - 2017 ‘ప్రస్థానం’ మాసపత్రికలో ప్రచురితం)**

# 16 భక్తి - బాధ్యత

“నీకు పాటలు పాడడానికే ఉన్నాను, ఇక్కడ నేను.
ఈ నీ సభలో నాకో మూల స్థానం వుంది.
లోకంలో నేను చేయవలసినది ఏమీ లేదు.
నిశీధ అంధకారాలయంలో మౌనంగా పూజ చేసే వేళ
ఓ ప్రభూ, నన్ను నీ ముందు నిలబడి పాడమని ఆజ్ఞాపించు” – అంటారు గీతాంజలిలో టాగూర్ (చలం అనువాదం) కానీ ఆశ్చర్యం! చాలా తెలుసనుకునే మనం, ఇక్కడ పాడాల్సిన పాటేదో పాడకుండానే మిగిలిపోతాం. బహుశా, పాడమనే ఆజ్ఞ రాకో, ఇతరత్రా రణగొణుల మధ్య వినిపించుకోకో. కానీ, విని అమలు చేసే సాధకులూ కొందరుంటారు. అలా భక్తి, బాధ్యతా తెలిసిన శ్రీపాద సీతామహాలక్ష్మి నిత్యసాధనా ఫలితమే “శ్రీ సాయి లీలామృతం” పారాయణ గ్రంథం.

కొత్తగా చెప్పిన విషయం, చెప్పాలనే ఆడంబరం కనబడవీ గ్రంథంలో. సద్భావం పునః పునః మననం చేసు కోవడమే గదా, సంస్కృతి! ఆ పరంపరలో భాగంగా దశాబ్దాలుగా

ఎందరో, ఎన్నో విధాలుగా ప్రచారం చేసిన మాహాత్మ్యాన్ని తనదైన గొంతుతో మరోసారి వినిపించారు రచయిత్రి. ఏకం సత్ విప్రా బహుధా వదన్తి (ఒకే సత్యాన్ని మహాత్ములు అనేక రకాలుగా దర్శించగలుగుతారు). నిజానికి, అవగాహన – క్లుప్తత రెండూ విలోమానుపాతంలో వుంటాయ్. అందుకే, ఎంతో తెలిసిన విషయాన్ని అంత సంక్షిప్తీకరించడం అరుదైన విషయం.

భగవంతుని చరిత్రనో, మహిమనో కథగా వ్రాయడం అంత సులభం కాదనిపిస్తుంది. ఈ గ్రంథం రెండవ అధ్యాయంలో దభోల్కర్ కథలో చెప్పినట్లు స్వయంగా భగవానుడే తన కథను తనకు నచ్చినట్లుగా వ్రాయించుకునేందుకు కొందరిని మాధ్యమంగా నియోగించుకుంటాడు. వారి అర్హత ఒక్కటే, పలుమార్లు ఈ గ్రంథంలో ప్రస్తావించిన 'సర్వస్య శరణాగతి'.

వాత్సల్య పూర్వకంగా రచయిత్రి నా అభిప్రాయాన్ని కోరినపుడు బాబా చరిత్రను శ్రద్ధగా చదువుకునేందుకు ఓ అవకాశంగా అనుకుని సరే అన్నాను. అధ్యాయాలుగా విభజన, ప్రతి అధ్యాయంలో వేర్వేరు కథ ఉండడంతో కొంచెం కొంచెంగా చదువుదామనుకొన్నాను. కానీ అలా సాధ్యం కాలేదు. పేజీ చివర ఖాళీ మిగిలిన ప్రతిచోట బాబా చిత్రాన్ని ముద్రించారు. రూపాన్ని చూస్తూ నామాన్ని స్మరించేలోగా మరో అధ్యాయం మొదలైపోయింది. ఇలా ఒక అధ్యాయం నుండి మరో అధ్యాయానికి ప్రవేశించేలోగా పాఠకుడి మనసు ఏ విచలనాలకూ గురికాకుండా 'మిగతాది రేపు' అనుకోకుండా చదివించారు రచయిత్రి.

విష్ణు సహస్ర నామ స్తోత్రంలో :

కేనోపాయేన లఘునా విష్ణోర్నామ సహస్రకం।
పఠ్యతే పండితైర్నిత్యం శ్రోతు మిచ్ఛామ్యహం ప్రభో ॥
అని పార్వతీదేవి అడిగితే పరమేశ్వరుడు
"శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే।
సహస్రనామ తత్తుల్యం రామనామ వరాననే" అని ఉపదేశించాడుట.

కష్ట కాలంలో ప్రదక్షిణలు, పారాయణాలు... ఇలా ఇవేవీ కష్ట సాధ్యమనిపించవు. ఐతే, అవి తీరాక, దేవుడికిచ్చిన ఆ హామీలన్నీ నెరవేర్చాలనే

కోరిక ఉన్నా, వందల పేజీల ఉద్గ్రంథాలు చదివేంతటి తీరిక లేని మన యాంత్రిక జీవితాలలో "వాక్కు తప్పినా వరం తప్పకుండా" ఉపకరించే సాధనం ఈ చిన్ని పుస్తకం.

ఈ విధంగా సాయి స్మరణకు, విశ్వాస స్థిరీకరణకు అవకాశం కలగజేసిన శ్రీమతి సీతామహాలక్ష్మికి ధన్యవాదాలు.

***

# SPHURANA... SMARANA

(Speeches & Reviews)

**Avadhanula Mani Babu**, M.Sc., B.Ed.,

మనుషులందరినీ సమంగా ప్రేమించగలగడం ఒక సిద్ధి అంటారు. తటస్థపడ్డ పుస్తకాలన్నిటినీ అలాగే ఇష్టపడడం కూడా ఒక సిద్ధే. అది ఏ పుస్తకం కానివ్వండి, మీరు శ్రద్ధగా చదువుతున్నారు, ఇష్టంగా పరిచయం చేస్తున్నారు. మీకు పరిచయ కళ బాగా తెలిసింది. పుస్తకంలో ప్రధానమైన విషయాలన్నిటినీ సారం ఎక్కడుందో పట్టుకుని, సరళంగా, ఏ రకమైన సందిగ్ధతలు లేకుండా, చెప్పకుంటూ పోయే శక్తి అందరికీ అబ్బదు.

- "అన్నవి... అనుకొన్నవి..." గ్రంథం గురించి డా॥ రెంటాల శ్రీ వేంకటేశ్వరరావు.

❖❖❖

మణిబాబు ఈ గ్రంథాన్ని చాలా నిశితంగా రాసాడు. వాల్యూమ్ కోసం కాకుండా వేల్యూ కోసం దృష్టి సారించాడు. ఇతనికి పరిశీలనా నైశిత్యం ఉంది. భావాభివ్యక్తీ ఉంది. అనుభవం, సమభావుకత్వం విడివిడిగా పెంపెసలారుతున్నాయి.

- "అందినంత చందమామ" గ్రంథం గురించి డా॥ ఆవంత్స సోమసుందర్.

❖❖❖

ఒక్కోసారి, ఈ తాత్త్వికభావ సంచయం ఈ అబ్బాయికి ఎక్కడినుండి అబ్బిందనిపిస్తుంది, ఆశ్చర్యం వేస్తుంది. మణిబాబు విమర్శ, అనుభూతి విమర్శ కావడంవల్ల అది పాఠకుడి మనసులో విమర్శనానుభూతిని పూయిస్తుంది.

- "అందినంత చందమామ" గ్రంథం గురించి శ్రీ మాకినీడి సూర్యభాస్కర్.

❖❖❖

అధ్యయనంపట్ల ఆసక్తి ఉండడం, మిత్రులు అద్దేపల్లి రామమోహనరావుగారి వంటి గురుస్థానీయులు దొరకడం, ఉద్దీపన కారణాలైనా - పలు రచనలు చదివి స్వతంత్రబుద్ధితో ఆలోచించి అంచనాలు వేయగల నైపుణ్యం ఉండడం వల్ల, సాహిత్య విమర్శవైపు దృష్టి పెట్టారని - ఈ వ్యాసాలు చదవడం ద్వారా నాకు అర్థమైంది. వీరి వ్యాసాలలో నాకు కనిపించిన మొదటి సుగుణం - వాక్యరచనలో ధారాళగుణం.

- ఈ గ్రంథం గురించి శ్రీ ఇంద్రగంటి శ్రీకాంత శర్మ